# THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY
OU_204925
UNIVERSAL LIBRARY

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T81.6 Accession No. GT 307
S95D

Author సుందరరామశాస్త్రి

Title ధైర్యకేవచము 1914

This book should be returned on or before the date last marked below.

శ్రీరస్తు.

# ధైర్యకవచము.

చ. ఎవని నెఱుంగలేనియెడ నీ జలభూపవనానలాభ్రముల్
ధ్రువములుగాఁ గఁదోఁచు మృగతృష్ణలలో జలమట్లు మిథ్యలై
యెవనియథార్థతం దెలియ నెందును దోఁపవు రజ్జుసర్పమ
ట్లవిరలమోదరూపు విమలాత్మకు నప్పరమాత్ముఁ గొల్చెదన్.

## 1. ప్రకరణము.

తే. కాముశరఘాటి కించుక గలఁగనేని
యే కళానిధియును దేజ మెడలి క్రుంగు
దినమునకు భూషణంబయి తేజరిలియు
వారుణీలోలుఁడై శశి వ్రాలునట్లు.

“మన్మథా! నీకుం జొరరాని చోట్లెందును గానరావుగా. పవిత్రంబులగు మునిజనాశ్రయంబులును, సజ్జన సభలును, నిను బోఁటిదుష్టులకు చొరరా వందురు గాని యదియు విశ్వాసయోగ్యంబని తోఁచకున్నది. మఱియు క్రూరాత్ములకును, హింసాపరులకునైన, రారానిచోట్లును చేయరానిపనులును గలవే? కుసుమంబులారా! మృదుస్వభావంబుచే లోకంబులఁ బ్రసిద్ధిఁగాంచియు నిట్టి క్రూరకార్యములకు సాధనంబుల రగుట యెట్లు సంభవించె?

సంభవింపకేమి? దుర్జనసాంగత్యము గల్గిన నెట్టి సజ్జనులైనను సద్గుణభూషణరహితులగుట యెుక్క యద్భుతమా! పవనా! దేవతలకెల్ల నధికుండ ననిపించుకొనుచుండియు, జగములకెల్ల ప్రాణాధారంబవై ఘనయశంబు వడయుచుండియు నీసహజచాంచల్యమును మానవైతివిగా! విబుధసేవితంబగు నా బ్రహ్మసభయందున నర- వతీ వస్త్రోత్క్షేపణము. అవును, స్వాభావికగుణంబులు నశ్యంబు లని యెఱుంగియు విడుచుట యశక్యము. విడువ నేరకున్న నేరక వాని నిరాకరిజ్ఞానము.

ఆ! స్వామీ! ఇది మోహ యజ్ఞానము. సహజము లగువాని నెల్ల దూషింపఁ గడంగితి. ఇంద్రియముల నిగ్రహించి, రాజర్షులకు నుత్తమమైన బ్రహ్మలోకమునందియు చాంచల్యము విడువ నేరక తుచ్ఛసుఖంబు నాసించి, శాపవేగముచే నధోలోక దుఃఖములపాలైన యాగముని... భిషభుజాలు నిందించెదఁ గాక. ఏమి నా వెఱ్ఱితనము! త్రిలోకంబులందును పవిత్రయని గను, గంభీరస్వభావయని గను, వెండితివసి దేవతలచేఁ గూర్తప సంస్తవం బులు వడయుచున్న నేనే చాంచల్యమునంది యిట్టి పాటు స్వయముగాఁ దెచ్చికొనియు,నితరుల దూషింప నేటికి? ఎట్లు లైననేమి? చేసినదాని ననుభవింపక తీఱునా ?"

అని యిట్లు గతముల తలపోయుచు నొక్క యువతీమణి గంగానదీప్రాంతారణ్యంబుల సంచరించుచుండె. వికసించిన పద్మముంబోలు నామె వదనం బొక్కొక్కతరి వాడిస్వేదంబుగ కాంతిహీనంబగుచు మనంబునం దప్పుడప్పుడు వొడము సంతాపంబు సూచించుచుండె. మరియొకతరి నభీష్టవస్తుదర్శనంబు గల్గుననియుంబోలె నతి త్వరతో దృష్టుల నలుదెసల నిగడించు

చు నేదియో యొక సంతోషజనక మగువిషయము మనంబు నందున్నట్లు సూచించుచుండె. నితంబ స్తనభారంబులచే సహజమాందంబగు నామెగమనంబునకు వేగంబుగలిగించుచు నుత్సాహం బొక క్రొత్త చెలువు నందించుచుండె. మధురంబులగు పక్షికలకలములును సుగంధయుక్తం బగు శీతమారుతంబును, మనోహరంబులగు చివ్రకలతోడను కుసుమంబులతోడను ప్రకాశించుచు, ప్రక్కనున్న వృక్షంబులకు నల్లిబిల్లిగ నల్లుకొని యుల్లంబున కుల్లాసంబునందించు వల్లివితానంబులును, బహిఃప్రకృతి యామె మనంబు నాకర్షింపకుండె ననుట దీర్ఘనిశ్వాసంబులచే సూచింపఁబడుచుండె.

ఇట్లు నడచుచుండ "జననీ! గంగాదేవీ! మా విజ్ఞాపన మించుకొని యంగీకరింపవలయును. మమ్ము దయఁ జూచి కొంతవడి యట విశ్రమింపుఁడు" అని యొక మొలుఁగు వినంబడెను. దాని విని "నన్నిట జననీ! యని పిలుచువారెవ్వరు" అని నలుదెసల దృష్టి సారించునప్పటికి నెదుట కొందఱు పురుషులు గానంబడిరి. వారి తేజంబు నుసికప్పిన నిప్పుతెఱంగునఁ బ్రకాశహీనంబై యుండె. వారిముఖంబులును అధోముఖంబులై దుఃఖాతిశయంబు వెల్లడించుచుండె. అంత తనకు భక్తిపూర్వకముగ నమస్కరించుచున్నవారలంగని అష్టవసువులుగా నెఱింగి గంగయు వారి దుఃఖకారణంబు నెఱుంగోరి వారితో నిట్లు సంభాషింపఁదొడంగె.

గంగ—వసువులారా! ఏల కేఁగుచున్నారు. మీ వదనంబులు దుఃఖమును సూచించుచున్న వేల?

వసు—జననీ! ఇట్టి దయచూపుటయే మాకు మహద్భాగ్యము

వసిష్ఠముని శాపముచే మనుష్యలోకమున జన్మింపనేఁగుచు మీ దయకై వచ్చితిమి.

గంగ—శాపకారణ మేమి?

వసు—మేము భార్యాసహితులమై యొకనాఁడు విహారార్థము వసిష్ఠముని తపోవనమునకుం జని యందు దమ్మహాత్ముని హోమధేనువును, కోర్కుల నొసంగుదాని, "నందిని" యనుదానిం గాంచితిమి.

గంగ—స్వర్గలోకనివాసులగు మీకు దానియం దభిలాష జనించి యిట్టి దుఃఖంబునకు హేతువై యుండదుగదా.

వసు—హేతువుల కేమి? గర్వితులును స్త్రీలకు లోఁబడినవారును అగువారికి దుఃఖములు కలుగుట కన్నియును హేతువులే.

ప్రభా—అన్నలారా! "చేసినతప్పు చెప్పిన సగ మనుభవించినట్లు" అందురు. కాన అపరాధినగు నేనె తల్లి యెదుట వచించెఁగాక. తల్లీ! అంత నాభార్య, తనకు జితవతి యను నొకమిత్రురాలు గలదనియు నామెకీ ధేనువు నంపి సంతసింపఁ జేయవలెననియు నన్నుఁ బ్రేరేపించె. నేనును వీరల సహాయముచే నట్లొనర్చితి.

గంగ—తపఃప్రభావము మీ రెఱుంగనిదియే. శాంతునకు రోషం బుద్భవించిన జలంబులయం దుదయించిన యగ్నియుం బోలె నసాధ్యమగుననుట యెఱుంగరే.

వసు—జననీ! గతవిషయంబులఁ గూర్చి యిట్లన్న మే మేమను వారము.

(అనికన్నీరు నించుచు.)

గంగ—తనయులారా! శోకింపకుఁడు. ప్రమాదము సర్వసాధా

రణము. దుఃఖము తటస్థించినపుడు ధైర్యంబున సహింపవలయుఁగాక శోకముచే తీరునే ?

వసు—మీరన్నట్లు మమ్ముఁ బుత్రులఁగా నంగీకరించిన దీని సహించుటయన నెంత. మహాభిషుండను కురువంశంబున ప్రతీపునకు శంతనుండై జనించియున్నాఁడు.

గంగ—"మ్రొక్కఁబోయిన దేవర యెదురాయె" నన్నట్లు ఆతని వృత్తాంత మప్రయత్నముగా నెఱుంగఁబడియె. అని మనమునందు సంతసించి ప్రకాశముగా నిట్లనియె. ఇట్టి గుణవంతుల పుత్రులఁగాఁ బడయు భాగ్యము గల్గుటచే మనుష్యభావము, దేవత్వముకంటె సుఖదాయి యని యభిమానించెద.

వసు—మఱియొక విన్నపము. దుఃఖభూయిష్ఠంబగు మర్త్యలోకమున చిరకాల ముండనోపము. కాన మము పుట్టినయప్డు జలంబులవైచి స్వర్గమున కంప ననుగ్రహింపవలయు. వసిష్ఠమునియు నిట్లే యనుగ్రహించె.

గంగ—ఈవాక్యముల వినఁగానే కొంతవడి యూరకుండి యిట్లనియె. ఇది యేటిసందర్భము! ఇట్టి పుత్రుల పెక్కండ్రఁ బడిసి వారలచేత వధించుచు పరివారిలో క్రూరాత్మ ననిపించుకొని తుదకు స్వయముగాఁ గొని తెచ్చుకొనిన పుత్రహీనత్వదుఃఖ మెట్లనుభవింపనేర్తు. అట్లుగాదుపో. చిరసుఖముగు స్వర్గమందుండు మిమ్ము నాకై మనుష్యలోకమున చిరకాలముండుఁడని యెట్లననేర్తు.

ప్రభా—కలఁగవలదు. ఏను మహాపరాధినగుటచే భూలోకంబున మీ పుత్రుఁడనుగా చిరకాలముండవలయు.

అని యిట్లు ప్రభాసువాక్యమువిని తనకు చిరంజీవి యగు పుత్త్రుఁడొకఁడుండునని సంతసించుచు వారల వీడ్కొని గంగ నిజేచ్ఛం జనియె. వసువులును గంగా శంతను సమాగమంబుఁ బ్రతీక్షించుచుండిరి.

ప్రథమప్రకరణము ముగిసెను.

---

## ద్వితీయ ప్రకరణము.

క. పరహింసలు లీలలుగాఁ
బరఁగెడువారలును యువతిశ్రీపరులున్ స్వేచ్ఛా
పరిపూర్తి యగువిధంబుల
నరయుటయే కాని యన్యశ్రీ మరయఁగఁ గలరే.

తన ధనువు నెక్కుడించి మరలు మన్మథు ననుసరింప నొండొంటిం బిలుచుచున్నవియోయనఁ బక్షు లెల్లెడలం ధ్వనించుచుండె. నిజపతియగు చంద్రుని వియోగంబున మనమునఁ గల్గు తాపాగ్నికి ధూమంబోయన భ్రమరంబులు కల్వలనుండి వెల్వడఁదొడఁగె. పద్మినియు భర్తృదర్శనంబగునని సంతసంబునం బోలె తన సౌరభం బెల్లెడలం గ్రమ్మ వికసితకమలముఖియై రాజిల్లుచుండె. లోకమిత్త్రుండయ్యు మిత్త్రుండు సద్గుణంబుల వేఁటాడఁ దొడఁగె.

అట్టిప్రభాతంబున మహావనములం దొక్కొకయెడ వృక్షంబులు తమపైనుండి జాఱు మంచుబిందువులచే, తమ పరోపకారశీలమునకు మెచ్చి విధి యొసంగినయసూత్రముక్తాహారంబులచే తనుంబోలె రాజిల్లుచుండె. ఒండొకయెడ లతాలతాంగు

లు, మెల్లనిగాలిచే తమ పల్లవహస్తంబు లల్లాడ, వనమనోహరత్వంబు వ్రేలిడిచూపునవియుంబోలె మెఱయుచుండె. మఱియొకచో సుఖనిద్రనుండి మేల్కాంచి, తమ్ము హృదయంబున నిడికొని లాలించు మృగాంకుని యస్తమయంబునకు వగచునవియుంబోలె,నలుగడల వీక్షించుచు వీనులకు వినవచ్చిన శబ్దంబుల నెల్ల కిరాతు లొనర్చునవిగా భావించుచు స్వభావభీరువు లగు హరిణంబులు విచిత్రగతులఁ బరువిడుచుండె. వెండియు నొకచోట నికుంజంబులనుండి భుక్తశేషంబులగు పశువుల భుజించుచు, నడుమనడుమ చేరువ క్రొద్దియైన మృగమేతెంచెనోయని పొంచిపొంచి చూచుచు శార్దూలంబులు వేటకాండ్ర కుత్సాహంబు గలిగించుచుండె. సింగంబులును తమ కేసరముల విదుల్చికొనుచు గంభీరగమనంబున సంచరించుచుండె. కొందఱు కిరాతులుగు లోడ్డీపక్షులకై నిరీక్షించుచు మహావృక్షంబుల చెంత డాఁగియుండిరి. మఱికొందఱు మృగంబుల నమ్మించుటకై మధురంబగు వేణుగానము నొనర్చుచుండిరి.

ఇట్టివనంబున నశ్వారూఢుండై ధనువు చేఁబూని యొకపురుషుం డేకతంబు చరించుచుండె. ఆ మూల్యంబు లగుపచ్చనివలువలచే నాతని మహాకులీనత్వమును వేటకై వచ్చుటయును సహాయులు లేకుండుటచే నద్భుతంబగు ధైర్యంబును వెల్లడియగుచుండె. ఆ సత్పురుషుండు మత్తేభంబులం జక్కాడుచు లులాయంబులం బరిమార్చుచు శార్దూలంబులం గీటడఁగించుచు, పంచాస్యంబులఁ బంచత్వమునందించుచు. వరాహంబుల పరాసువులం జేయుచు, వాతాయువుల వీతాయువులనొనర్చుచుఁ గొంత వడి మృగయావిహారంబు సల్పి మనోహర కుసుమంబులచే నవ

ముని గంధవహత్వంబు సార్థకమొనర్చుచున్న గంగాప్రాంతారణ్యంబున సంచరించుచుండె. అహో! ఇది యేటి విపరీతము ! మనుష్యులయ్యు, వివేకముగల్గియు, పరుల కుచితానుచితముల బోధింపనేర్చియు నిరపరాధులగు హరిణాదిమృగంబుల తమ తాత్కాలిక సంతసంబునకై వధియించుట క్రీడయఁట; అజ్ఞానులై యాహారార్థముహింసించు శార్దూలాదిమృగంబులఁ జంపవలయునఁట; వ్యసనంబులం దగులరాదని శాస్త్రంబు లెన్నితెరుల వక్కాణించినను, జ్ఞానం బెన్నితెఱంగుల బోధించినను సంతోషకరములని వానిని విడువనేరకున్నారు. మనమును ధైర్యముచే నిగ్రహించి, గుణదోషంబుల విచారించి ప్రవర్తింపకుండిన నడుగడుగునకు ప్రమాదంబులపాలై దుఃఖింపవలసినవారగుదుముగదా. ప్రకృత మాలోచింతము.

అటు విహరించుచు క్రొక్కారు మెఱుంగునుంబోలె నొక్క యువతి యప్పురుషుదృష్టుల నాకస్మికంబుగ హరించె. మనంబును తన మిత్రుని ననుసరించునదియుంబోలె నయ్యువతియందు లగ్నంబయ్యె. తారుణ్యంబగు శరీరంబున నుండనేరక స్నేహపూరంబు వెలికేతెంచెనోయన స్వేదపూరం బొడలెల్లఁ గ్రమ్ముదొడంగె. యౌవనారంభంబగుటచే లజ్జయు మనమున కించుక యడ్డపాటగుచుండె.

"ఇది యేల యిట్లు కులశీలంబుల నెఱుంగకయు నీ యువతియందు నామనం బత్యంతానురాగంబందె? దీనివలన పవిత్రంబగు మద్వంశంబున కేదియైన కళంకంబొదవునేమో! కాదు కాదు; కులీనులమనంబులు వంశక్రమమున శుద్ధంబులగుటచే వెలుఁగు చీఁకటి నంటనిభంగి దుర్విషయంబుల సంకల్పింపవు.

కాన నిది నాఁడు మజ్జనకుండెఱింగించిన యువతిగానుండవలయు. దీనిదృష్టులును ప్రేమార్ద్రంబులై నాసంకల్పంబునే దృఢపఱచు చున్నవి. అహో! జనకుని కామించి యాయన సమ్మతింపకుండు టచే కౌమరునికాలమువఱకుఁ బ్రతీక్షించియు తనయౌవనంబు విడువకుండుశక్తి మనుజభామినులకుంగలదా! కావున దీని కామ రూపిణియగు దేవవనితఁగా నెంచెద. సంశయమేమి? అట్లగుట చేత నే మజ్జనకుండు జాత్యాదులఁ బరీక్షింపకయె పరిగ్రహింపు మనియె. అయినను సంభాషణచే సర్వము నెఱింగెదఁగాక' అని యిట్లు నిశ్చయించి యిట్లు సంభాషింపందొడంగె.

పురు—మానినీ ! నీ వెవ్వరిదానవు. ఇట్లిల భయంకర మగు నీ వనంబున నేకాకినివై చరించుచున్నదానవు.

స్త్రీ—రాజోత్తమా ! మీరుగల్గ నేమి భయము.

పురు—విహారార్థమై వచ్చినవారలు తిరముగ నుందురా.

స్త్రీ—ఉండకుండిన నేమి? కృపకలిగిన చాలదా.

పురు—"ఈ యువతివాక్యములు నాయభిప్రాయమున కనుగుణ ములుగా నున్నవి. ఇది యేమి విచిత్రము. కాదుకాదు, కాముకుడనగుటచే నా కట్లు దోఁచుచున్న వేమో! ఎట్లై న నేమి. వేఱొకతీరునసంభాషించి మర్మమెఱింగెదఁగాక" యని యిట్లు తలపోసి యారమణితో నిట్లనియె. "సుందరీ! మొదటిప్రశ్నంబున కుత్తర మొసంగకుండు టేల"?

స్త్రీ—ఒసంగిన నిప్పు డేమగు.

పురు—(తనలో) "జనకుండు దాని కులశీలంబుల విచారింప వలవదనుట కిది తార్కాణయయ్యె. అగుఁగాక". (ప్రకా శముగా) "నీచరిత్రము విచిత్రముగ నున్నది".

స్త్రీ——విచిత్రముకాకేమి? తండ్రినుండి కొమరునినఱకుఁ బ్రతీక్షించుట.

పురు——(తనలో) "హృదయమా త్వరపడకుము. త్వరపడకుము. (ప్రకాశంబుగా) తండ్రి యెవ్వఁడు! కొమరుండెవ్వఁడు!"

స్త్రీ——కురుకులనందనా! ఎఱింగియుండినను మరల వినదలంపవలయునా? అవును. కావుననే రాజులకు "విని చెవుడు కని గ్రుడ్డి" అందురు.

పురు——ఏ నేమెఱుంగుదును. పరిహాసముల వృథా దూషింప నేటికి? వచింపుము. ఎవ్వని నుద్దేశించి యిట్లు మాటలాడుచున్నావు.

స్త్రీ——ఎవ్వండో యొక్క ప్రతీపబుద్ధి యేకాంతమున యువతులతో భాషించుచు తడవు నిలువఁబోగునే. మీ కార్యంబుఁ జూచుకొనుఁడు.

పురు——(తనలో) ఇఁక దాఁప నేటికి (ప్రకాశముగా) కామినీ నీ తలఁపెఱుంగఁబడియె. నే నా ప్రతీపునకు నందనుండ. శంతనుండనువాఁడ, మదనుని శరంబులకు లక్ష్యంబైతి.

స్త్రీ——సుభగా! సామాన్యముగా యువతులందఱును తమ రూపవిభవంబున కన్నియల వలపించి తుదకు నస్వాతంత్రల మహాదుఃఖంబులకు పాల్పడఁజేసి యలంతురు. అట్లుగాకుండ ననుగ్రహింపవలయు; ఇది నాయొక్కటియే యభ్యర్థనీయము.

పురు——(వికసితముఖుండై) సామాన్యవిషయంబున నింతనిర్బంధింపనేటికి.

అని యిట్లు పరస్పరప్రేమ వెలువడునట్లు విచిత్రసంభాషణం బొనర్చి యిరువురును కరిపురంబున కేఁగిరి.

అహహా! యువతీలోలత్వ మెంతప్రకారము. ఎట్టి జ్ఞానికిని దానిచే ప్రమాదము గల్గకుండునే! చూడుఁడు. ప్రకృతమున నీ శాంతనుండు "సామాన్య మనుష్యాతిప్రవృత్తిస్థితికై యీ యువతి యిట్లు నిర్బంధింప నేల? తా నీనాము నొంద యెట్టికార్య మొనర్పనున్నదియో." అని యొక్కింతయైనను విచారింపఁగలిగెనే. అవును. కామపరవశులకు స్వకార్యము సాధించుటయే కాక యన్యమెఱుంగనచ్చునే.

ద్వితీయప్రకరణము ముగిసెను.

---

## తృతీయ ప్రకరణము.

ఆ. సుఖము దుఃఖ మొక స్వాని నాకస్మి
త్తము నదృష్టుఁగు నేని యధికమగుచు
హృదయమును గలంచు నిక సుఖాదులఁ గాన
వానిఁ గెలువు లెస్స మానవులకు.

ప్రభాతంబున నందంద పొడగను ప్రభాకరుని బాలకిరణంబులు నక్షత్రకాంతులుగ, రాత్రులు నిదురించి మేల్కని వెడలిన మృగంబులగుంపులు జంతువితానంబులుగా నద్యోతించెట్లు గానవచ్చు. తెరంగిరేఖ లూర్మిమాలికలుగ, నక్కడక్కడఁ దోఁచు వేతసనికుంజముల ద్వీపంబులుగా, సముద్రంబునంబోలె నొక్కొకనెడ రాజిల్లుచుండె. మఱియొక్కచోట నిసుక మందమారుతంబుచేఁ జెదరి చిత్రకారుని చిత్రలేఖనంబునఁ దోఁచుచుండె.

అట్టి గంగాపులినంబు నీక్షించుచు నొక్కపురుషుం డశ్వారూఢుండై వచ్చుచుండె. అతని యంగంబులెల్ల కృశంబులై యుండె. అతని ముఖంబుననుండి దీర్ఘవిశ్వాసంబు వెడలుచు తదధరప్రవాళంబును కాంతిహీనం బొనర్చుచుండె. చల్లని గాలి సోకునపుడెల్ల వడవడవడంకుచు నాతని మేను హృదయంబునందలి తాపంబు నెఱింగించుచుండె. ఎట్టి రమణీయవస్తువు గోచరంబైనను తత్క్షణమే మరలుచు నాతని దృష్టులు "నీని మనోగతవస్తువునకు సాటియగునది జగంబున లేదు" అని చాటుచుండె. వాని పరితాపకారణంబు సంపూర్ణముగా నెఱుంగఁబడకున్నను తత్సంచారిభంగులు, వాఁడెద్దియో యొకవస్తువును గోల్పోయెననియు, అది యీప్రాంతములం దుండవచ్చునని యు నూహించుట కించుక యవకాశ మిచ్చుచుండె.

ఇట్లు చనుచు తీరంబుఁ జేరునప్పటికి గంగ యతిసూక్ష్మప్రవాహయై కృశాంగియునుంబోలె ప్రకటీభూతసత్త్వయై భర్తృవర్జ్యనకుతూహలినియగు ప్రోషితయునుంబోలెఁ గన్పట్టుచుండె. దాని చూచుచుండ నప్పురుషుముఖంబున నొక్కొకపరి సంతోషజన్యంబగు వికాసంబును, మఱియొకమారు శోకోద్భవంబగు మాలిన్యంబును, కొండొకతఱి రోషప్రభవంబగు రక్తత్వంబును గలుగుచు దాని సహజకాంతిని గలంచుచుండె. వీని కారణంబుల నీ ప్రకరణాంతంబుననుండు సంభాషణముచే చదువరు లెఱుంగుదురు గాక.

ఇట్లనిమేషదృష్టియై దానిని జూచుచు నటనుండి చలింప నేరక కొంతవడి నిశ్చేష్టుండై, యెట్టకేలకు మనోవికారంబు నడిపికొని యిట్లు వితర్కించె. "ఇది గంగ శోషించుసమయము

గాదుకదా. దీనియందు దీనికి నిట్లుగా నేమివచ్చె. శుక్తిమ
తిని కోలాహలంబునుంబోలె నీ నది నెద్దియైన నొక శైలం
బడ్డగించియుండునా ? అట్లులైన నేను సురేంద్రునింబోలె దాని
సంగుప్తపక్షంబుల నవలంద్రోచి కీర్తిగాంచెద. ఈ యూహ
యసత్యమైనయెడలం గాక. ప్రతిబంధకంబు నడంచి దీని యార్తిం
దీర్చుట యావశ్యకము." అని యిట్లు నిశ్చయించి పశ్చిమాభి
ముఖుండై జనువాఁ డెదుట నాతిశోభితపాదుఁడును శరంబులచే
గంగనది కట్టుచున్నవాఁడునగు నొక్క కుమారుంగాంచె.

అట్లొక్క మహాత్ముండు దృష్టిగోచరుం డగుటయు, మనంబున
నొకవృత్తిజనించి యప్పురుషు నొక క్రొత్తవానిం జేయుచుండె.
వక్షం బబ్బాలు నాలింగనంబునకై విజృంభించుచుండె. నాసిక
యు నాతని మూర్ధాఘ్రాణంబునకై దుముకునట్లుండె. ఒకవై
పు "ఈతఁ డెవ్వండగునో" అను సంశయంబు మనమునం గ
లంచుచుండె. మఱియొకవైపు కుమారు సహజ వినయాదిగు
ణంబులవలన జనించిన సంతసంబు సందడించుచుండె. వేయేల!
అప్పటి యతనిస్థితి వర్ణనంబునకగోచరంబై, యూహకు విష
యంబుగాక, బ్రహ్మానందంబునుంబోలె ననుభవమాత్ర వేద్యం
బై యుండె.

అంత నట్టకేలకు మనోవికారం బించుక శాంతినొంద, కు
మారుని వృత్తాంతం బరయఁగోరి, "వత్సా! నీ వెవ్వరివాఁడవు."
అనునంత నొక్కతరుణి సర్వాంగసుందరి యబ్బాలు దక్షిణహ
స్తంబు నవలంబించి చూపట్టె. నేత్రద్వారంబులనుండి మనం
బు వెలికి నిర్గమించునో యన, నప్పురుషుం డనిమేషదృష్టియై
దానిని జూచుచుండి తుదకు నిట్లు సంభాషింపఁదొడంగె.

పురుషుఁడు ప్రశ్నముఖుఁడై - 'దేవీ! చిరకాలంబునకు నిను మరలంజూడఁగలిగితి. ధన్యుండనైతి. తాపమెల్లం దీఱె.- (అంత నాకస్మికంబుగా నించుక దైన్యముదోఁప)—హా! మదనార్తుని నిరపరాధి నన్ను ట్లుకారిణంబుగ విడుచుట పాడియగునె?. అమ్మాట లపరాధముగాఁ దలంచినను, అట్టి యల్పదోషంబున కట్టి శిక్షయే.

స్త్రీ—క్షత్రియోత్తమా! ధీరుండవగుదు, విజయుండవగుదు, తుచ్ఛంబును, పరిణామ విరసంబును, దుఃఖ బహుళంబును క్షణభంగురంబునగు సుఖంబునాశించి యంగునిపుష్పాస్త్రంబుల కోర్వనిది ... కలంగుదురే. కార్యార్థమై దేవకన్య లొక్కొక్కమాఱు మనుజులకు భార్యలుగా వలసివచ్చినను వారల కది దోసంబగునె. మఱియు ప్రతిజ్ఞ తప్పుట మఱచితివే.

పురు—శోకముతో! ... మనోజ సమానరూపుల ... ద్రఁ బుత్రులఁ బుట్టించి పూర్వజలంబుల నైచుచు సధించుచున్న, దానిం ... మచు నోర్వ శక్యంబగునే.

స్త్రీ—శోకింపనేల? ఎఱిఁగించితినిగదా వారి చరిత్రము.

పురు—(నిట్టూర్పువిడుచుచు) ఆ పమ్మట.

స్త్రీ—అట్లు మీచే నివారితనై యష్టమబాలు, మీకడనుండి గొనివచ్చితి. గుఱుతుకలదా.

పురు—(సంతసముతో) ... కేమి. నా ... చెంటనున్న వాఁడు.

స్త్రీ—సర్వశాస్త్రకోవిదుండై ... యోగ్యుఁడయినవాఁడై యెదుటనున్నవాఁడు.

అవ్వచనంబు చెవి సోఁకినతోడనే ప్రేమంబు రూపంబు

దాల్చెనో యన నప్పురుషుం డక్కుమారుని పునరాలింగనంబొనర్చుచు శిరంబు మూర్కొనుచుఁ దన యుత్సంగంబుపై నిడికొని యొడలెఱుఁగని యానంద మనుభవించుచు కొంతదడవున కెదుటఁ జూచునప్పటి కయ్యువతి గానరాకుండె.

పురు—"అహో! యువతుల కెంత సాహసము! అపరాధినని ననుఁ క్షమింపకుండిన నుండుఁగాక. ఈ చిన్నికొమరుం డేమితప్పొనర్చె? అట్లుగాదు. నాప్రేమను బరీక్షించుటకై యెటనైన దాఁగియుండెనని తలంచెద. (నిట్టూర్పు విడుచుచు) ఏటిప్రేమ! ఏటిపరీక్ష! సంకల్పములెల్ల నిష్ఫలంబులయ్యె" నని యిట్లు పలువిధముల వితర్కించుచు నా రమణినిఁ గాంచనగునోయని నలుదెసల దృష్టుల సారించుచు నద్దేశంబు విడువనేరకుండె.

కుమా—"జనకా! ఇఁక నిటఁ దడయనేటికి?" అని వాని యమృతభాషణంబుల యాతని మది కింపుగల్గించి స్వపురాభిముఖుం గావించె. సుఖదుఃఖములు సహజంబులైనను మనంబున కితరవిషయంబులఁ దోఁపనీక కలంగఁ జేయునఁట. ఇఁక నా సుఖదుఃఖంబు లాకస్మికంబులయ్యెనేని వాని వీర్యంబు వర్ణింప నలవియగునా?

తృతీయప్రకరణము ముగిసెను.

---

## చతుర్థ ప్రకరణము.

క. శౌర్యము నొసంగు దుష్కర
కార్యములఁ బొసంగఁ జేయుఁ గడిఁదివి యైనన్
వీర్యమునఁ జెఱచు నార్తుల
ధైర్యమునకు సాటి యొండు ధరణిం గలదే.

కాళిందీతీరంబున నొక్కపల్లెగలదు. దాని కొక్కనాధుండు గలండు. ఆతం డొకనాఁడు సకలసభ్యులు సేవించి యుండ సభాసీనుండై యిట్లు విచారింపం దొడంగె.

రాజు—అమాత్యా! ఈ మనంబునకు శాంతి గలుగుట యెన్నఁడు. (అని నిట్టూర్పు విడిచి) ఇది నా స్వయం కృతాపరాధమై యుండదుగదా.

మంత్రి—ఇం దపరాధ మేమున్నది? కావలసినదాని నొనర్చుట యపరాధ మగునా.

రాజు—అట్లుగాదు. నాఁటిమాటలలో నేదైన ననౌచిత్యము కలిగియుండునా? యని యడుగుచున్నవాఁడ.

మంత్రి—నిష్కర్ష చేయవలసినదానిని నిష్కర్ష చేసికొన ప్రయత్నించిరి. ఇం దనౌచిత్య మేమియున్నది?

సభ్యుఁడు—ఇఁక నమ్మహాత్మునియందా దోషమును నారోపించెదరు?

మంత్రి—అట్లుచెప్పిన వారెవరు? ఆమహాత్మునియందు మాత్రము దోష మేమియున్నది? రాజకార్యముల నిర్వహింపఁ దగినవయస్సు గలవాఁడై విద్యావంతుఁడై శుభలక్షణములుగల్గిన పుత్రుని రాజ్య విహీనునిఁ జేయుటకు మనసు సమ్మతించునా?

1\. సభ్యు—ఇదియెల్ల నేల? వసునాథుని యాజ్ఞ నలక్ష్యము చేయుటయె దీనికెల్ల కారణమని యూహింపరాదా.

2\. సభ్యు—ఊహాల కేమి? పరోక్షంబున నెయ్యదియైనం జేయ నచ్చును. అవ్విభునకుమాత్రము తన మనుమనికి రాజ్యాధికారము లేనియెడల సమ్మతి గల్గియుండునా.

1\. సభ్యు—ఈయూహామాత్ర మేమి నిక్కము? మహాత్ముల మనంబు లెట్లుండునో!

మరి-సభ్యు—(చమత్కారముతో) ఈ అభిప్రాయము ఎట్లైన నుండునుగాని నిక్కముగా నాతని యాజ్ఞనే తిరస్కరించియుండినచో నీకన్నియ యిప్పటికి దేవలుని యాశ్రమమున నుండియే యుండును.

మంత్రి—ఇది పరిహాసమునకు సమయము కాదు; కర్తవ్యమును విచారింపవలయును.

రాజు—విచారించుట కేమున్నది? ఎప్పటి కెవరెవరే స్థానమునందుండవలయునో అప్పటప్పటికి వారువారు ఆయా స్థానములయందుండినచో నేతప్పు లేకున్న మనస్సునకు శాంతి గలుగునా? నావిషయములో నీకార్యము నమకూర్చుటకు దైవము పద్దమూటుకమయ్యె. ఇంక నేమిసేయువాఁడ.

మంత్రి—నిక్కముగా నిప్రయత్నము పౌరుషము నతిక్రమించియేయున్నది. దైవ మెట్లు సహాయము చేయునో యెఱుంగరాదు.

సభ్యు—కేవలము దైవపరులై యూరకుండుట యుచితమగునా? మంత్రిసత్తమా! మీరు నుత్సాహము కలిగింపక

మన విభునకు మతియింత యధైర్యమును బెంచుట యుచి
తమా?

మరి-సభ్యు—కార్యముల కేమి? మన మహారాజశ్రీ మునిముఖ్యునకు
స్వయముగా నాత్మసంపిం నేమిలాఘవము? ఆయన చక్ర
వర్తి గదా.

రాజు—కన్నియగలవారికి లాఘవము తప్పదుగాని యిప్పటికి
మాత్రము మన సంకల్ప మేమి పూర్ణమగును.

మంత్రి—ఇది యుచితమగు కార్యము కాదు; దీనిచే కన్యకకు
దుఃఖముం గలిగించినవార మగుదుము.

రాజు—(నిట్టూర్పువిడిచి) నిక్కము నిక్కము, ఇకనేమి యుపాయము మంత్రి?

మంత్రి—(ఆలోచించి) రత్నములయందలి యోగ్యతను బరీక్షించు
కొనుట యెట్టివారికైనను నశక్యము. కావున; కన్యకను
ములు చూచి పిదప నెట్లును నొకతీరున కార్యమునిశ్చ
యింతము.

రాజు—ఎప్పటికైన నింతయేకద !

ఇట్లు సంభాషించుకొనుచుండ ద్వారపాలకుడొకడు లోప
లికి వచ్చి "దేవా! రాజపుత్రుడొకడు పరిమితసైన్యముతో
వాకిట నిలిచి మీయనుమతిని నిరీక్షించుచున్నాడు" అని చెప్పెను.
ఆసమయమున సభయందుండువారి మనసులెల్ల నాకస్మికముగ
నుత్సాహముతో నిండియుండెను. ముఖ్యముగా నారాజునకు
వచ్చినసంతోషమునకు మితియే లేదు. ఇంతియె కాక కుడికన్ను
అదురుట మొదలగు శుభసూచకములుకూడ కనపడెను. ఇట్టి
యాకస్మికశుభసూచకములను జూచి యందలి ప్రాజ్ఞులందఱును

నేఁడీరాజపుత్రునివలన మన రాజునకు మనంబునందుఁగల దుఃఖ
ములెల్ల సంపూర్ణముగా తీఱఁగలదని తలంచుచుండిరి.

అంత నాపల్లెరాజు ఆమాట వినఁగానే సింహాసనమునుండి దిగ్గనలేచి మంత్రులు మొదలగుసభ్యులెల్ల వెంబడింప ద్వారంబునకెదురుగవచ్చి రాజపుత్రుని నుచితమర్యాదలతోఁ దెచ్చి తనసింహాసనముపై నుంచిరి. సభాసదులెల్లరును రాజపుత్రునియొద్ద నుండి వచ్చు మాటలకై ప్రతీక్షించుచుండిరి.

రాజపుత్రుఁడు—(రాజునుజూచి) ఇట్లు నన్ని యుపచారములతోఁ
సన్మానము. మీరు మాకు గురుస్థానములోఁ జేరితిరి.

రాజు—పుష్పముల సాంగత్యమున నారయుఁ శిరముపై నెక్కఁగలిగినను,
త్రాఁడు, ఎప్పటికైనను త్రాఁడే యగునుగదా.

రాజపుత్రుఁడు—"ఎల్లెడను స్వస్థానమహిమ తప్పదు" అని యుక్తముగ
సంభాషించుచు సభయెల్ల యథాపూర్వముగా నమరి
యుండునంత నొంతసేపటికి రాజపుత్రునితోఁ ఆ రాజు
ఇట్లనియె.

రాజు—దేవవ్రతా! మీ జనకునికిఁ గుశలమా?

రాజపుత్రుఁడు—సర్వశత్రువులను జయింపఁబడుటచే నైశ్చింత్యమున
లని యన్నివిధములను గుశలమె. అయిన నొక్కశత్రుఁడు
మాటుండి యున్నాఁడు.

రాజు—(నిట్టూర్పువిడిచి) ఎట్టినిశ్చయమున్న నేమిప్రయోజనము?
రాజ్యలోభంబున నట్టిమహాత్ముని బాధ నుపేక్షింపవల
సె. అన్నిటికిని మీయనుగ్రహము తక్కువ.

మంత్రి—నిక్కము నిశ్చయమున కేమికొఱంత? అట్టితపోధనుఁడు
మహాత్ముఁ డగు దేవలుని నిరాశునిఁ జేసినదియొకఁడా !

మతిసోముకుఁడు — ఇఁక కన్నియవిషయమో మదనుండు విష్ణుపుత్రుండగుటచే స్త్రీవధ పాపంబున కించుక శంకించుచున్నాఁడు.

రాజపుత్రుఁడు — ఇట్లన్నియు సుముఖమై యున్న నీ దీర్ఘనిశ్వాసంబులకు కారణమేమి? రాజ్యలోభం బంటిరి. కన్యాదాతల యభీష్టంబు నెఱవేర్చి యెల్లరకును సంతోషముగా కన్నియను వివాహమాడఁదలంతురుగాని నిర్బంధింప నిశ్చయింపరుకదా కన్యార్థులు.

మంత్రి — కన్యాదాతలు తమ యుపయోగార్థమై తగిన యల్లుండ్ర విడనాడుదురా! కన్యాసౌందర్యమోహితు లగువారలును తమకు సాధ్యమగు నెట్టికార్యమునైనను జేయకుందురా?

రాజపుత్రుఁడు — మజ్జనకున కసాధ్యమగునది యెద్ది? ఇదియునుఁగాక 'మీ యనుగ్రహము తక్కున'యని నన్నుగ్గడించితిరేల?

మతిసోముకుఁడు — ఉన్నదియెల్లను మీతోడనే.

రాజపుత్రుఁడు — ఇది యేదియో విచిత్రముగా నున్నది.

మంత్రి — విన్నవించెదను. మీ రెఱుంగని రాజధర్మములు లేవు. అయినను సందర్భానుసారమున నక్కాణింపవలసె. రాజులకు ప్రాయికముగ నెందఱుకొడుకులుండినను పెద్దవానికి రాజ్యము వచ్చుటయు క్రమముగా వారి సంతతివారె రాజ్యభారమువహించుటయు కలదు. రాజ్యమును భాగించుట యనుచితముగదా; కావున నీకన్నియకు జనించిన పుత్రులు.

రాజు.—(వలదని సంజ్ఞచేసి రాజపుత్రునిఁజూచి) ఇదియంతయు నేల ? ఆకన్నియను మీరు పరిణయంబగుదురేని అన్ని విఘ్నముల సంతసం బగును.

మంత్రియొకఁడు.—ఉచితము వచించితిరి.

రాజపుత్రుఁడు.—హరిహరీ ! ఇది యేటిమాట! తండ్రి వరించిన కన్నియను కుమారుఁడు వివాహంబగుటయా ! ఏమి వచించితిరి ?

మంత్రి.—(అపరాధము క్షమింపవలయు).

మీకు దుఃఖము కలిగింప నొల్లమి యిట్లు పలుకఁ జేసె.

రాజపుత్రు.—ప్రేమాతిశయమునఁ బలుక నాడినమాట యపరాధము కానేరదు. మఱియు గురుకార్యము సాధించుటకుఁ బ్రయత్నించువానికి కష్టమొకటిగలదా? మీతలంపు, ఎఱుఁగఁబడియె. ఇదె సూర్యచంద్రాదులుసాక్షిగ రాజ్యమును పరిత్యజించుచున్నవాఁడ. ఈ సత్యవతీదేవి కడుపునఁ బోవు పుత్రుఁడు మజ్జనకుని రాజ్యమున కధికారి యగుఁగాక.

అని ప్రతిజ్ఞ సేయఁగానే యాకసమునుండి పుష్పవృష్టియు మేలుమేలు అను శుభవాదములును ఏతెంచెను. సభ్యులందఱు నీ యద్భుతప్రతిజ్ఞ కాశ్చర్యపడిరి. మఱియు నాసభయందు కొందఱు, సమర్థుఁడై యుచితవయస్కుఁడై మహారాజ్యమునకు చక్రవర్తి కాఁబోవు రాజపుత్రుఁ డిట్టిప్రతిజ్ఞ సేయుట కడు చిత్రమనువారును, కార్యమును నెఱవేర్చుకొనుటకై క్షత్రియులు వివిధోపాయములు సేయుదు రనువారును, గురుకులజులయెడ నిట్టి దోషము తలఁపరాదనువారును, గురుకార్య ధురంధరులకు స్వకార్య

మొద్దియనువారును, మన రాజు నిట్లు సేయునె యనువారును, జేయకుండిన వసురాజపుత్రి మనంబునకు తృప్తియగునా యనువారును, ఈతనియెడ దైవ మిట్లున్న నెవ రేమిసేయుదురను వారును, ఆ శంతనుఁ డెఱింగియు నింత విచారింపక యున్నాఁడనువారును నై బహువిధంబుల చింతించుచు నుండిరి.

మంత్రి—రాజా! ఇఁక తడవేటికి ?

రాజు—ఆలస్యమేమిగలదు? ఏమియును లేదు.

రాజపుత్రుఁడు—ఇఁక సంశయింపనేల ? మనంబున నిఁక నేదయిన కోర్కి గలదా ? అట్లని వచింపుఁడు. జనకుని మదిలోని తాపమును నిరాకరించుటకై వచ్చి యాలస్యము చేయుట నోర్వఁజాల.

మఱియొకఁడు—(తనలో) దీని నెట్లు చెప్పుదురు? చెప్పినఁగార్యమెట్లొనఁగూడు?

రాజపుత్రుఁడు—అమాత్యా! ఏదియో విచారించుచున్నట్లున్నది. ఎట్టికార్యమునకును సంశయింపఁబని లేదు. జనకునికొఱకైన నెట్టికార్యమునయినను జేయ సిద్ధుఁడనై యున్నవాఁడ.

మంత్రి—(తనలో) 'తటమిటటిమి యడుగుచున్నాఁడు. చెప్పక తీఱ'దని (ప్రకాశముగా) సత్యప్రతిజ్ఞా! కుమారా! లోకమునందెల్లరు నొకతీరుగ నుండరుగదా. తండ్రికొమరులకు సహిత మొకటే గుణముండుననుటకు నమ్మకము లేదు. కావున పుత్రపౌత్త్రాదులు తండ్రుల ప్రతిజ్ఞలను నిలుపఁగలుగుదురని నిశ్చయమెట్లు ?

రాజపుత్రుఁడు—ఈవిషయమును దెలుప నింత సంశయింపవల

యునా? ఇదె నాప్రతిజ్ఞ వినుఁడు;ఇంద్రాది దిక్పాలకులా
రా!సూర్యాదినవగ్రహంబులారా! ఇదె జనకునినిమిత్తమై
బ్రహ్మచర్యమహావ్రతంబుఁ బూనుచున్నాఁడ.అనపత్యతా
దోషంబు తక్కటిధర్మంబులచే శాంతినొందెడుఁగాక.

అని పలుకఁగా నే,'గురుకార్యధురంధరా!గాంగేయా! మేలు; నీచే కురువంశం బతిపవిత్రంబయ్యె; గంగయు త్రిభువనపావని యయ్యె; ఇట్టి భీమవ్రతము బూనుటచే నేఁడుమొదలు భీష్ముం డను ప్రసిద్ధిని జెందుము' అనువాక్కు వినంబడియె.

రాజు---ఎట్టి ఘోరప్రతిజ్ఞ! ఎట్టిఘోరప్రతిజ్ఞ!! కుమారా! ఇట్టిసాహసమేల?

ఒకసభ్యుఁడు---ఏమాశ్చర్యము! యౌవనదశలో గృహస్థులుగానుండి వృద్ధులగునప్పటికి స్త్రీసంచారమింకనైనను లేని మహారణ్యములఁ బ్రవేశించి కృచ్ఛ్ర చాంద్రాయణాదివ్రతములచే శరీరమును శోషింపఁజేయుచు తపముఁ జేయుచున్న మహర్షులె, కామవేగమును నిలుపలేకున్నారఁట; ఇట్లు యౌవనవంతుఁడై వివాహప్రశంసనే లేక యతిసుందరులై యప్సరసలతో సమాన లగు యువతుల నృత్యాదుల ననవరత మీక్షింప ననువగు మహాపట్టణమునం దుండవలసియు, నిట్టి మహాప్రతిజ్ఞ గైకొనె.

మంత్రి---ధైర్యవంతుల కసాధ్యమెద్ది?

మఱియొకఁడు---మహాత్ములకు అస్థిమాంసమయములగు స్త్రీరూపమను తోలుబొమ్మలయం దనురాగమెట్లు కలుగును?

రాజు—'వత్సా! అట్టి శ్రమఁ జెందనేల? మున్నువచించితినిగదా ఆకన్నియను' (అనునంతలో)

రాజపుత్రు—దానిని మరల వచింపకుఁడు. ఇఁక నాకనుజ్ఞయొసఁగిన శీఘ్రముగఁ పురమున కేఁగెద.

అని యిట్లు సంభాషణ ముగిసినపిదప నా రాజంతఃపురము నుండి కన్నియను రావించి రాజపుత్రున కొప్పించె. రాజపుత్రుఁడును తన జననిం దోడ్కొని నిజపురంబునకుఁ జనియె. శంతనుండును తా కోరిన కన్య లభించినందులకై సంతసించె. తన పుత్రుం డొనర్చిన ప్రతిజ్ఞలకు దుఃఖంబు జనించిన నది ప్రసంగాం సహాగను సంతోషంబుచే నడంచుకొనియె. కాముకులకు కాంతలకంటె నెద్దియు నధికంబు గానేరదుగదా!

చతుర్థప్రకరణము ముగిసెను.

---

## పంచమ ప్రకరణము.

క. పుత్రుఁడు సంతోషామృత
పాత్రము సకలాధినాశభవ్యౌషధసు
క్షేత్రము నిజసంతతి మణి
సూత్రము లోకంబునగు యశోవ్యాపనకున్.

శంతనుండు నంత తన రాజ్యభారంబునెల్ల కొమరునిపై డిగ్గ విడిచి మన్మథరాజ్యంబున కభిషిక్తుఁడయ్యె. అతఁ డతి లోకసుందరియగు నా సత్యవతీదేవిం గూడి మనోహర పుష్పభరితం

బులగు నుద్యానంబులయందును,జలశీకరంబుల వెదచల్లు మెల్లని గాలితోఁ గూడిన నదీపులినంబులయందును మేఘాచ్ఛాదనము లేక నతి శుభ్రములై పాలకడలివలె నన్నియెడల వెల్లిగొని మనోహరంబులైన వెన్నెలలయందును, రేయుంబగల్లెఱుంగక కాలము గడుపుచుండెను. ఆద్దేవియు తన కోకిలాలాపంబులచేతను, విరిసినపుం బుష్పములంబోలె మృదువులగు నయనములతోడను, మేఘములవలె నల్లని కురులతోడను, శరత్కాలమందలి పున్నమ చంద్రుని ధిక్కరించు ముఖకాంతితోడను మొల్లమొగ్గలంబోలె నతిరమణీయంబగు దంతపంక్తితోడను ప్రియుని మనంబున కుల్లాసముగ ప్రతిక్షణంబునను బహువిధమనోహరత్వంబుం గనుపుచుండె. ఈరీతి సతి ప్రేమంబున విహరించుచుండెను రాజునకు మనశ్శాంతిమాత్రము తీరదయ్యె.

ఒక పుత్రుఁడు గలవాఁడును పుత్రులు లేనివాఁడును ఒకటియే యని పెద్దలు చెప్పుదురు. దీని యర్థ మందఱకును సామాన్యమే యయ్యును రాజుల విషయమున ముఖ్యముగా నన్వయించును. వారు ఖడ్గమువలన జీవించువారలగుటచే ప్రతిక్షణము వారి జీవితసంశయము వెన్నంటియుండును. కాకేమి? హింసాపరులతో మైత్రిఁ జేసినవారి జీవితము దుఃఖమయమగుట చిత్రమా! చూడుఁడు. రాజులకు సంతానము లేకుండిన మనవెనుక రాజ్య మేమగునో యనియు, సంతానమునకు విచ్ఛేదము గలుగుననియు మహాదుఃఖము. అతిశూరుఁడై యుద్ధమునం దసహాయుఁడైన కొమరుఁడు పుట్టిన నీర్ష్యచే శత్రువు లేమి చేయుదురో యనియు, పుత్రుఁడు సామాన్యుఁ డుదయించిన రాజ్యము నెవరిపాలు సేయునోయనియు దుఃఖము కలుగును. పుత్రుఁడు మందబుద్ధియైన

దుఃఖమునకు మితియే లేదుగదా; కావున బహుపుత్రులైనచో పలువురకాలము లొక్కతీరుగ నుండుట సంభవింపదు గావున "నందో రాజా భవిష్యతి" యనున్యాయము నించుక యూరటచే గలుగవచ్చును.

మన శంతనుండును తనకుఁ గలయేకపుత్రుం డతిశూరుం డగుటచే బహుపుత్రులకై యత్నము సేయుచు నీ కన్నియను వివాహమాడినవాఁడుగావున పుత్రోత్పత్తికై త్వరపడుచుండె. అంత కొంతకాలంబునకు క్రమముగా నాదేవి మొగము వెల్లనగుచుండె. సంతానమునకంటె భూషణంబు లధికములు గావని శరీరము భూషణములనెల్ల సంపూర్ణముగ ధరింపనేరకుండె. ఆశ్రితులను పోషించుటయె మహాపురుషులకు ముఖ్యధర్మములని యెఱింగించునదియుంబోలె మధ్యభాగము స్పష్టమగుచుండె. మనస్సు రెండగుటచేతను గాఁబోలు కోర్కెలొకటికంటె ముందుగా నొకటి జనించుచుండె.

ఇట్లు తన మనోరథం బిగురొత్తు లక్షణంబులు గాన్పించుటయు, రాజు సంతోషపూర్ణమానసుండై ప్రతిక్షణ మా దేవి కోర్కెల నారయుచు తక్షణము వానినెల్ల సమకూర్చుచుండె. ఏ యింద్రియమునకు సంబంధించిన కోర్కెలం దీర్పకున్న శిశువున కా యింద్రియమునకు లోపమగునని భయమును భార్యయందలి సహజానురాగమును రాజు నీవిషయమున నతి జాగరూకునిఁ జేయుచుండె.

ఎట్టివారిమనంబైనను క్షోభము గలిగినప్పుడు సత్త్వంబును మఱచి క్షోభనిమిత్తంబు లందు నిష్ఫలమై యుండును. అట్టి క్షోభమునకు కలఁగకుండుటయే మనస్సునకు స్వాస్థ్యము; లేక యే

కాఁగలి. ఇదియె సర్వవిధములగు నుపదేశములచేతను సాధింపఁబడఁదగిన *ముఖ్యాంశము.

మఱియు నామె నివసించు మందిరమంతయు విచిత్రములగు వస్తువులతో విశేషముగా నలంకరింపఁబడియుండెను. ఆమె విహరించుచోట్లయందు దుఃఖకరమైనట్టియు, నసహ్యాకరమైనట్టియు వస్తువులు తొలఁగింపఁబడెను. ఆమె కెప్పుడును శూరుల చరితములయందు రుచి కలుగునటులు చేసి వారినే యెల్లప్పుడు ప్రసంగింపవలసినట్లు చెలులకు నిర్ణయింపఁబడెను. గర్భిణుల మనంబే విషయమందు నిలుచునో యావిషయమునందు ప్రసిద్ధుఁడయిన శిశువు జనించు ననుశాస్త్ర నిబంధనము రాజునకీ విషయమున శ్రద్ధ నతిశయింపఁజేయుచుండెను.

ఇట్లు సకలానందకరంబుగ నతి జాగరూకతతో రక్షింపఁబడుచు క్రమక్రమముగా గర్భము సంపూర్ణముకాఁగా, ఒక్క శుభదినంబున సూర్యచంద్రుల ట్లసమాన తేజస్కులగు నిర్వురుపుత్రులుద్భవించిరి. వారి జననవార్త వినఁగానె రాజు తన హర్షాతిశయమును సమస్తజనులకు పంచిపెట్టునోయన గోప్రభృతి నిఖిల దానంబుల నొసర్చె. పురజను లెల్లరును తమతమ గృహంబుల నవిశేషంబుగ నలంకరించుకొని యుత్సవంబు లొనర్చిరి. ప్రతి సభాభవనంబులందును, రచ్చకొట్టంబులయందును మఱియు నెక్కటి విశాలస్థలములయందును, సంగీత నృత్యాది వినోదంబులు ప్రవర్తిల్లుచుండెను. ఇట్ల జన్మదినంబున కరిపురంబెల్ల సలకాపురంబుమాడ్కి నమరావతివడువునను రాజిల్లుచుండె.

---

*విశేషాంశములు నాచే ప్రకటింపఁబడబోవు, జగత్తత్వము అను గ్రంథమువలన తెలియును.

అంత నబ్బాలురు శుక్లపక్షచంద్రునివలె దినదినమునకు ముద్దులుమూటకట్టుచుండిరి. జననీజనకులును కార్యాంతరంబుల మఱచి, సర్వకాలంబులయందును నా కొమరుల గాత్రస్పర్శనంబున సంతోషించుచు వారి బాలక్రీడల కానందించుచు వారి ముద్దుమాటలకు పలుమారు చెవియొగ్గుచు దాదులు ప్రయత్నముతో నేర్పినవారి వినయభావమునకు సంతసించుచు కాలమును గడపుచుండిరి.

కాలప్రభావమును తప్పింప నెవరితరమునుగాదు. ఈరాజు మొట్టమొదట ముక్తవయస్కుండగు తన పెద్దకొమరునకు రాజ్యాధికారమొసంగి యాతని రాజ్యపాలనావైఖరిని కన్నులారం గాంచి యాతని కీర్తిని పరాక్రమమును చెవులార విని సంతసింపవలయుననియు, నాతనికిం దోడుగ బహుపుత్రులం బడయవలయుననియు తలంచుచుండెను. అట్టి తలంపునకు విరుద్ధముగ రాజొకనాడు వేటకై యమునానదీప్రాంతమునకుం జనియుండ నచ్చటికనతిదూరంబున వసురాజపుత్రియయ్యుపల్లెవానియింటం జేరిన యీసత్యవతి తండ్రియాజ్ఞచే యోడ నడపుచుండుటయు తొల్లి యీయమ యోజనగంధంబు నియమ నడపుచుండెడు నావపై నెక్క యదృచ్ఛగా నచ్చిన పరాశరముని యనుగ్రహంబుచేం గలిగిన నిరుపమాన శరీరసుగంధంబు బస్సు డీరాజు నాకర్షించుటయును సంభవించె. లావణ్యవతి యగు నా యమయందు నీరాజు చిత్తము దగులుట యంత ఆశ్చర్యముగాదుగాని, తుట్టతుదకీ సత్యవతి సర్వరాజ్యశుల్కయయ్యె. ఇప్పుడైనని ముద్దుకుమారులలో నొకనికి రాజ్యాభిషేకమొసర్చి చూడవలెనను తలంపుతోనుండ నా కోఱికయు దీరకుండనే, కాలగతికి

లోపడవలసె. **ఈశంతనుం** డతిధర్మాత్ముఁడును, ప్రతాపశాలియు, నిష్పక్షపాతియు, సత్యప్రియుండును, ప్రజలనెల్ల తన పుత్రుల మాడ్కిఁ జూచువాఁడునగుటచే నాతని మరణంబునకు శత్రువులునయితేము దుఃఖాక్రాంతులైరి. ఇఁక సర్వవిషయముల సేలోపనులేకుండున ట్లాత్మ కుటుంబమునవలె పోషింపఁబడుచున్న ప్రజలవిషయము వేఱుగాఁ జెప్ప నేల? అట్లయినను సర్వగుణంబులయందును, తండ్రిని మఱపింపఁజాలు భీష్మునిఁజూచుకొనియు, నాతని యుచితములగు నూరడింపుపలుకులచేతను నెట్టకేలకో యొకవిధంబున నూరడిలిరి.

అంత భీష్ముం డుచితవచనంబుల జననిని తమ్ములను తక్కటి బంధుజనంబులను, తగినవిధంబులఁ దేర్చి యప్పటికృత్యముల నిర్వర్తించి తాను రాజ్యమును పరిత్యజించినవాఁడగుటచే నబ్బాలురలో నొక్కని నభిషేకించి సర్వవిషయములకుం దానయై రాజ్యకార్యంబు లప్రమాదంబున నారయుచుండె. తమ్ములు రాజ్యమునకై పోరాడువారు కాకపోయినను తండ్రికాలమునుండియు రాజ్యతంత్రముల నెఱింగినవాఁడయ్యును, సర్వజనులకు తనయందే ప్రేమ యతిశయించియున్నను, ఇంతయేల, తాఁ ప్రతిజ్ఞకు ముఖ్యకారణమగు తల్లియు తన్ను రాజ్యమును సహించుటకు నెంత ప్రేరేపించినను తన పూన్కియందలి నిలుకడచే దాని కొడంబడఁడయ్యె. అవకాశము కలిగినప్పుడు చలింపకుండుటయేకదా ధీరుల లక్షణము—

**పంచమప్రకరణము ముగిసెను.**

## షష్ఠప్రకరణము.

తే. మదిని సుఖహేతువులు చూపి యెవల కాత్మ
వశముగాఁ జేసికొనుచు వి భ్రాంతి నొసఁగి
కల వివేకంబు లెల్లను దొలఁగఁద్రోచి
కడకుఁ జఱతురు కామాదికపటహేతులు.

"కటా! ఇది యేటి బుద్ధివైపరీత్యము? సర్వధర్మంబులఁ దెలిసి యుండియు సకామయగు యువతిం బలాత్కరించుటకుఁ బూర్వికుల ప్రసిద్ధిసహితము తలంపునకు రాదయ్యె. యువతీభోగంబునకు చేయఁగూడని పనియెద్ది? ఔరా! రాజనందనా! మనుష్యుండ వయ్యు దేవతల కెగ్గుసేయ శంకింపనైతివిగా! భాగీరథీ! సవతి కొమరుని యిచ్చకు విరోధమొనర్చిన నిను దుష్టురాలని యందురని కాంబోలు, శరణాగతను సహితము రక్షింపక తిరంగిహస్తములచే వెలికిఁద్రోసితివి; ఇంతియకాని, దురిచ్ఛకుఁ దోడ్పడినవాదులకై దూషింతురని యనవైతివి. యమునా సరస్వతులారా! మీరైన చెవికి నుచిత మెఱింగింపలేకపోయితిరిగదా! లేదను; ఎట్టి సాత్వికునికి జనించినను, ఎట్టి తేజోవంతునకుఁ బుట్టినను, ఎట్టి వేదమయునికి సంభవించినను, జడాశయులు తమ వక్రగతిని మానఁగలరా. ప్రయాగంబ! నీకును వీరి సంసర్గమునఁ జనమహాత్వంబు దఱిగినట్లున్నది.

అవును. దుర్జన సాంగత్యము చేయలేనిపని యేమిగలదు? అమరత్వమా! ఇదివఱ కెల్ల హితమవైనను, నేఁడపరాధవైతివి గదా; నన్నిట్టి పరాభవదుఃఖమునకు పాల్పఱిచియు జీవింపఁ జేసితివి; ఇది ఏమి? అమరత్వ మేమిచేసెను? అదియుండఁబట్టియే

కదా. యిప్పుడు నా పరాభవ విధమెల్ల మజ్జనకున కెఱింగించి పిరోధిపై నేను దీర్చుకొని శాంతినొంద గలుగుచున్నదానను. వాఁడును నీతితో గుణములవాఁడగును గాక" అని యిట్లు తలంచుచు నా కృపనిక యతి త్వరతో రాజగృహము నుద్దేశించి పరుగిడుచుండెను.

ఇఁక విచారింపుఁడు. లోకమున సుఖమునకై మాత్రమె కాని, దుఃఖమునకై మాత్రమే కాని, సృజింపఁబడిన వస్తు వెద్ది గలదు. ఇట్టి సృష్టి తనకు దుఃఖ మతిశయించినపు డమరత్వమును దూరె. ఈర్ష్య యతిశయించఁగానె దానిని భంజించె; నీనిని పరికించిన సుఖదుఃఖములు రెండును సాంకల్పములకు స్వాధీనములని చదువరులకు స్పష్టము కాకపోదు. ఇట్లు జగమునందలి విషయముల భేదముచే యుక్తాయుక్తకారణములగు సుఖదుఃఖములె సంకల్పమున కధీనములై యుండ నిఁక దానివలన నేర్పడిన శత్రుమిత్రత్వములు తనవారనియు, ఇతరులవారనియు, చెప్పనేల? భార్యాపుత్రత్వాదులు సహితము మనస్సున కధీనములే యనియు ననుట కేమి యబ్బురము! * వీని నే కదా వేదాంతులు జీవసృష్టియనుచున్నారు.

అప్పటికి సూర్యుఁడు గగనమధ్యము నలంకరించి యుండుటచే సభాభవనమునం దంతకమున్న మంతనముచేయుచున్న రాజును సభ్యులును విశ్రమించుటకై తమతమ గృహంబులకేగి యుండిరి. బెత్తములవారుమాత్రము కొందఱా సభాగృహములయొక్క వాకిట కాచుచుండిరి. సాయంకాలసభార్థ మాగ్ర

* ఈ విషయమున విశేషాంశములను సప్రమాణముగా జగత్తత్త్వమను గ్రంథమున నెఱుంగుదురుగాక.

హమును సిద్ధముచేసి యలంకరించుటకై కొందఱు పనివాండ్రును వచ్చియుండిరిగాని యప్పటికి కొలువుదీరు సమయము దూరమయినందున నచటి భటులొండొరులతో యథేచ్ఛముగా సంభాషించుచు సజాగరూకులై యుండిరి.

ఇట్లుండ రాజాంతఃపురంబున సంచరించుచుండు నొక షండుఁడు రాజగృహమువైపు అతిత్వరతో పరువిడుచు గాఁ వచ్చెను. ఆతఁ డింతకుమున్ను ఒకసారిగూడ నాత్రోవనఁ బోయియుండెనుగాని యప్పుడు వీరు వీరిమాటలసందడివలన వానిపోకను గమనింపరైరి. వాఁడును తనకార్యభరంబున వీరిని బలుకరింపకయే చనియె. ఎప్పటికైన నేమి? వానిని చూడఁగనె నుఁ సభాగృహముల వాకిటనున్న భటులును పనివాండ్రును చేరఁజని ఇట్లనిరి.

భటులు—అయ్యా! ఏమి యింతమధ్యాహ్నములో ఎక్కడి నుండియో పరుగెత్తుచు వచ్చుచున్నావు?

షండుఁడు—ఇఁక పలుకరింపవద్దు.

భటు—చెప్పితీరవలయు. అంత షండుఁడు మంత్రిగృహమునుండి, మంత్రిగృహమునుండి యనుచు వెడలిపోయెను. ఆభటులు తమలో మనమించుక యాలస్యము చేసినందున బుద్ధిచెప్పినట్లయినది. పాడుప్రమాదము మన నెంతఁజేసె ననుకొనుచు నతిశీఘ్రముగా సభాగృహము నలంకరింప నారంభించిరి. అంత దూరమునుండి వైతాళికుల స్తోత్రవాక్యములు వినవచ్చుటయు అప్పుడు గలిగిన భయము వారిని మఱింత తొందర పెట్టసాగెను.

జగత్తులు సహితము క్రొత్తగా సృజింపఁగల మనస్సున కెంత పాటిపని.

తర్వాత రాజమంత్రు లిరువురును సభాగృహమును ప్రవేశించిరి. అందు రాజేతిత్వరతో తన సింహాసనముపై చతికిలఁబడి నిట్టూర్పులిడుచుండెను. ఆతని ముఖమంతయును నెఱ్ఱఁబాఱియుండెను. కనుబొమలు ముడిపడియుండెను. ఒడలెల్లను జెమ్మటలతో నిండియుండెను. నడుమనడుమ, 'ఓరీ ! కురుకుల పాంసనా ! దేవతలుకూడ లెక్కకురారైరిగా'' అనియు 'తనపై కోర్కెలేని యువతుల బలాత్కరించినవాఁడేమైరో యెఱుఁగుదువా' యనియు, 'పుత్రీ! ఈమనస్సు పరాభవము నోర్చునదికా'దనియు మాత్రము వినవచ్చుచుండెను. అప్పటికి తక్కినసభ్యులు సభాగృహమును జేరవచ్చిరిగాని యీతని యుగ్రాకారమును జూచి తమతమ యాసనములపై కూర్చుండుటకు సహితము భయపడియుండిరి. అపుడు కొందఱు వారివారి మనస్సులయందు 'కురుకులమున క్రూరులు జనించిరా' యనువారును, 'దానికేమి నేమనఁగలము' యనువారును, 'ఔను బో! కన్నియను కామించుట యపరాధమే' యనువారును 'స్వతంత్రురాలు కానిదానిని తన యందు కోర్కెలేనిదానిని బలాత్కరింపవచ్చునా' యనువారును, 'అయిన నింత రోషమున కవకాశము లే'దనువారును, 'రోషముచే నిపుడేమిచేయఁబోవునో' యనువారును, 'అంతమాత్రము బలహీనుఁడెవ్వఁడ?' డనువారును నై యుండిరి.

ఇంతలో దూరమునుండి "అమృతమా! మృత్యువును తొలంగించినంతమాత్రమున లోకోపకారివగుదువా? నీ నిమిత్తముననే కదా మహాత్ములగు దేవతలెల్లను పేరులను కీర్తినిపొందనేరక

పలుమాఱు వనములపాలు కావలసివచ్చుచున్నది.'' అను నొక మాట వినంబడియె. దీనిని వినఁగానే సచ్చెరుపాటుతో "గంధర్వలోకసమీపమున నమృతమును నిందించువాఁడెవఁడు? '' అని సభాద్వారము వైపునకు మరల చూచిరి.

౬వ షష్ఠప్రకరణము.

—·✣·—

## సప్తమ ప్రకరణము

ఆవాక్యము మరలమరల వినవచ్చుచు ధ్వని సమీపించుచుండెను. దానిచే నతికోపవివశుఁడగు రాజునకు సహితము ఆభిముఖ్యము కలిగెను. అప్పటికి నొక్కఁడు 'మిత్రమా! రక్షింపుము రక్షింపు'మనుచు రాజును సమీపించెను.

వానియంగములెల్ల విఱుగుటమాత్రము కొఱంతగా నుండెను. మాటలాడుటకుఁ దక్క మఱియొకవిషయమున నాతనికి శక్తి లేకయుండెను. మనోబలమె లేకుండిన నాతఁడీస్థలమునకు రాఁగలిగియేయుండఁడు. అంత నీ రాజాతనిఁజూచి 'మిత్రమా! యక్షోత్తమా! చిత్రసేనా! నీవిట్లనుటకుఁ గారణమెవ్వరు?

చిత్రసేను—ఎవ్వఁడుగలఁడు. ఆ వివేకమునకు వేరువిత్తు. ఆ నిష్కారణవైరమునకుఁ బుట్టినిల్లు; ఆ గుణములయందును దోషబుద్ధి గలిగించునట్టిమాయ; ఆతనియొక్కయు నితరులయొక్కయు భేదము నెఱుంగనియ్యని మోహినీవిద్య; ఆ యాత్మస్తుతికి వెనుకతీయనియ్యని యజ్ఞానపుపంట; ఆ మత్సరము నన్నింత చేసె.

రాజు— మత్సరము! అది గలుగుటకును నిమిత్తముండవలయు
ను గదా! అది యెవ్వరని నే నడుగుట.

చిత్రసేనుఁడు—ప్రియమిత్రుండగు నీనామ మగుటచే వాని పేరు
నుచ్చరించుటకును మనసొప్పకున్నది.

రాజు— అతనిది కురుకులమా?

చిత్రసేనుఁడు—మీ యూహకు అన్యము కలదా.

ఈ మాట వినఁగానే నారాజు పాలిక గోరుచుట్టుమీఁద రోఁక టిపోటను మాట నిజమయ్యె. అప్పు డినుమడించిన రోష దృష్టులు సభయెల్లఁ గలయఁజూచుచుండ నది యుద్ధప్రయత్నము నకు సమయము గావున సేనాపతి తన్నే రాజు చూచుచున్నాఁ డనితలఁచి "చిత్తము సైన్యమును సిద్ధపఱచెద" ననియె. రాజు ఆమాటకు చిఱునగవుతో "మనుష్యులను నంపెదవా! వారిని సా ధించుటకు సైన్యముగూడ కావలయునా" అనియె.

మంత్రి—దానిని విని "దేవా! ఒకవిన్నపము. 'చిన్నపామునైనను
పెద్దకఱ్ఱతో కొట్టవలయు' ననుమాట మీ రెఱుఁగ
నిది కాదు.

రాజు—ఆమాటను సమ్మతించి, సేనాపతికి సైన్యమును సిద్ధపఱ
చుట కాజ్ఞాపించి రేపు దండయాత్రయని నిశ్చయించె.
తనపై యుద్ధమునకు వచ్చినవానితో ప్రతియుద్ధము చే
యుట యపరాధమా, యాయుద్ధమునందు గెలుపుగలు
గుట యపరాధమా, క్రోధాంధు లేమెఱుంగుదురు.?

మఱునాటియుదయమున సూర్యుని బాలకిరణములు పచ్చనిపచ్చి పై కుంకుమపూఁతవలె ప్రసరించుచుండ నొక్క యైంద్రజాలి కుఁడు, హాస్తినాపురము వైపునకుఁ జనుచుండెను. ఆతని వస్త్ర

ము నానావర్ణములుగలదియగుటచేతను నాతనిచేత బదనిక కడియములుండుటచేతను నాతని నైంద్రజాలికునిఁగా భావింప ననుఫ్రపడియుండెను; కాని వానితో నే యుపకరణములుగాని, యెట్టి సహాయపురుషుఁడుగాని లేకయుండిరి. వాఁడు తన మనస్సున నిట్లాలోచించె, "రాజు; వానిని మన మేమిచేయఁగలము? ధర్మశాస్త్రవిజ్ఞానమున్నను ప్రయోజనము లేకయున్నది. రాజులకు నది సహజముగా కొంతయుండును. ఇంతవిపరీతమా! ఏకాలమున కెట్లుండునో యెవ రెఱుఁగుదురు. నేఁడు గంధర్వరాజునకు రోషముకలిగెనఁట, దానికి నీతని దుర్గుణమే కారణము. కానిమ్ము దైవమున్నాఁడు. మనకార్యమును మనమొనర్చినపిదప నతని యిష్టము" ఇట్లు దలఁచుచు హస్తినాపురప్రాంతమునకుఁ జేరె.

అప్పటికి కచ్చేరికిఁ బోవుచు న్యాయసమూహ నొక్క రాజపురుషుఁడు సంచరించుచుండె. ఆతఁడు సంచరించుచు కొనుచు నేదియో యొకటి దానిని మనంబున నాలోచించుచున్నాఁడు. మార్గమునందున్న తీఁగెలసొంపును, పువ్వులగుంపును, మనోహరము లగు కోయిలలు మొదలగు పక్షులధ్వనులును ఆయన మనస్సు నించుకయు నాకర్షింపనేరకుండె. ఇంతే యేల? ఎదిటికి వచ్చినవారు సహితము కనులకుఁ దోఁపకుండిరి. నిదుర లేకుండుటచేత కాఁబోలు! ఆయన కన్ను లెఱ్ఱఁబాఱియుండె. చంద్రునివంటి యాయనముఖము కాంతిహీనంబై వెల్లఁబడియుండె. ఆయన శరీరమునందెల్ల నప్పు డప్పుడు పొడము పులకలును చెమ్మటలును నాతని మనంబునఁ గలవస్తువుయొక్క మనోహరత్వంబు నెఱింగించుచుండె. ఇట్టి వాని డాయంజని యింద్రజాలికుండు జయశబ్దము నుచ్చరించి

యెదుట నిలువంబడియె. రాజును కొంతసేపటికి నెట్టకేలకు నాత ని మొగముపై దృష్టి సారించి తన మనంబున నున్నవిచారముల నెల్ల నడంచుకొని యిట్లు సంభాషింపఁదొడంగె.

రాజు—సోమకా! ఈ బదనికకడియముల నెటులు సంపాదిం దించితివి?

సోమకుఁడు—దేవా! మీ యనుగ్రహమునఁబడిన బదనికల కేమి తక్కువ.

రాజు—సరికాని నీ వేమి క్రొత్త వార్తల నెఱింగివచ్చితివి?

సోమకుఁడు—క్రొత్తవేమియు లేవుగాని నేను యమునానదీ ప్రాంతమునకు మరలి వచ్చునప్పటికి కొక గంధర్వసైన్య ము నా కంటఁబడియె. దాని వృత్తాంతము విచారింప నాతఁడు గంధర్వరాజఁట; పేరు చిత్రాంగదుఁడఁట; మీపై యుద్ధమునకు వచ్చుచున్నాఁడఁట.

రాజు—కారణమును విచారించితివా?

సోమకుఁడు—(తనలో) మీ దర్పమే (ప్రకాశముగా) విచారింప కేమి! నాఁడు మీతోఁ బోరి యోడిన యక్షుఁడె.

రాజు—(నవ్వి) ఆ! తనగతి చూచుకొనక మిత్రునికై వచ్చె కాఁబోలు.

సోమకుఁడు—(తనలో)ఇట్టి గర్వమే యింతకు తెచ్చెను. బహు జనవిరోధ మెన్నటికయినను బనికివచ్చునా? కానిమ్ము; జయాపజయంబు లెవరెఱుంగుదురు.

రాజు—"సోమకా! ఇఁకఁ బొమ్ము. కురుక్షేత్రమునందు ససైన్యుఁ డై కురురాజు కృతాంతుఁడు మీకై యెదురుచూచు చున్నాఁడనుము. సేనాపతితోడ నాయాజ్ఞ యెఱింగిం

పుము" అని చెప్పి వారినింబంపి యుచితసన్నాహంబుల నతిశీఘ్రముగా సిద్ధపఱచుకొని కురుక్షేత్రంబున కరిగె.

అప్పటి కా గంధర్వరాజును యుద్ధసన్నద్ధుండై యుండుటయు నతిశీఘ్రంబున యుద్ధ మారబ్ధంబయ్యె. కొంతసేపు గంధర్వ మానవసైన్యంబులు రెండును ఘోరంబుగఁ బోరినపిదప తన్నాయకులకు యుద్ధము తటస్థించె. అంత మనుష్య గంధర్వ నాయకు లిరువురును, కొంతవడి ధనుర్ధరులై బాణము నెత్తుట, ధనుస్సున సంధించుట, విడుచుటయు నెఱుంగరాకుండ నేకకాష్ఠాకారంబున వేనవేలశరంబుల నొండొరులపైఁ బరఁగించుకొనుచు, కొంతసేపు ఖడ్గపాణులై నొకళ్లొకళ్ల ఖడ్గంబులకు ఖడ్గంబులడ్డంబిడుచు పలుకలచే కత్తివేటులఁ దప్పించుకొనుచు పెనంగుచుండి మఱియొకపరి గదల చేఁబూని విచిత్రగతుల సంచరించుచు పరస్పర మర్మంబుల భేదించుకొనుచుం బోరి తుదకు బాహుయుద్ధంబున కుపక్రమించి జయాపజయంబు లెఱుంగరాక పోరుచుండిరి. కొంతసేపటికి సమాన మగురూప నామ బలప్రభావము లుండుటచే నెఱుంగలేక మాఱుపడి కాఁబోలు! విజయలక్ష్మి గంధర్వనాథు నాశ్రయించె. దర్పితులకు తమకంటె నధికులు లేరను భావ ముండునుగావున వారు మీఁదికి వచ్చుదానిని సయిత మెఱుంగలేరు. ఇఁక దీర్ఘాలోచనమున నెంతదూరము.

ఇది సప్తమప్రకరణము.

---

## అష్టమ ప్రకరణము.

ఆ. కన్య రూపుఁ దల్లి కనకంబు జనకుండు
విద్య బంధుజనులు వెలయు సుఖముఁ
గోరుచుందు రిన్ని గూడిన వరునకుఁ
గన్నె గూర్చుటనుట నెన్ను నరుఁడు.

రమణీయంబులగు మణిసమూహంబులతో నొప్పుచు రత్నాకరంబునకు జలనిధి యను పేరును సార్థకము సేయుచున్న యంగడివీథులును, బహువిధంబు లగుచిత్రములచే ప్రకాశించుచు పెక్కు వన్నెలుగల తోరణంబులతో నలంకరింపఁబడిన యెనిమిది తొమ్మిది యంతస్థులుగల మేడలచే నిరువంకల వ్యాపింపఁబడి యున్నందున నెల్లప్పుడును చల్లని నీడలచే బాటసారుల కుల్లాసంబుఁ గల్పించు విశాల రాజమార్గంబులును, రాజమార్గంబుల నడుమనడుమ విశ్రమార్థంబు నిర్మింపఁబడిన విచిత్రఫలపుష్పశోభితంబు లగువృక్షంబులచే నిండిన యుద్యానంబులును, నానావిధంబు లగుమంగళశ్రీలచే నెల్లప్పుడును ప్రకాశించుచుండు దివ్యగృహంబులును గలిగి యనాదికాలమునుండియు మహాపురుషుల కెల్ల నివాసమగుటచేతను, విశాలాక్షీసమేతుఁడగు విశ్వనాథునకు నివాసస్థలంబగుటచేతను, మహాక్షేత్రములలో నుత్తమంబై వేనవేల యాత్రికులచే ఈదిన మాదిన మనక యెల్లపుడు సేవింపఁబడుచు సకలశాస్త్రార్థంబుల కరతలామలకంబుగ నిర్ణయించి చూపఁజాలు పండితరత్నంబులచే నలంకరింపఁబడి, యెట్టివారికైనను ననాయాసంబుగ కోరికలు తీర్చుటకు కంకణము కట్టుకొనినదియుంబోలె నొప్పు వారణాశి యనునగరీరత్నంబు కలదు. ఈపట్టణమున కొక పార్శ్వమునందుండి వారణ యను

నదియును రెండవపార్శ్వమున అసి యను నదియును గంగలో చేరును గావున, ఈ రెంటికినడుమ నుండుటచే నీపట్టణమున నొకవైపు నలంకరించియుండెను.

అట్టి యాదిపట్టణమున కొకవంక విశాల మగుబయలున నతి విచిత్రము లగుశిల్పపుఁబనులతో నలంకరింపఁబడిన గుడారము లనేకములు వరుసలువరుసలుగా నిర్మింపఁబడియుండెను. వానిచుట్టును ననేక రాజభటులు బహుజాగ్రత్తతోఁ దిరుగుచుండిరి. ఆ గుడారము లొకటికంటె నొకటి యద్భుతములై చూచువారి కనులకు విందుసేయుచుండెను. వానినుండి వచ్చు విచిత్రము లగు స్తోత్రవచనంబులును, వినోదకరము లగువాద్యధ్వనులును లోపలనుండువారి మహాభాగ్యమును సూచించుచుండెను. ఇంతియ కాక నాపురి కన్నివైపులను లెక్కకు నెక్కుడనై విడిసియున్న చతురంగసైన్యములఁ జూచినచో వీరు రాజకుమారులని చెప్పవలసియుండెను.

మనము మాటలాడినయట్టి యాదినమున క్రమక్రమముగ 'రేయిముప్పాతిక కధికముగాఁ గడచెను. సూర్యుఁడు సమీపించుచున్నాఁడు. అతనిచే జయింపఁబడినపిమ్మట శాంతిహీనుండనై దుఃఖింప నేటికి? మున్నుమున్నుగ నెట్టినైన డాఁగి శత్రుని యున్నతి తగ్గుపాటుకు నిరీక్షించుచుండెదఁగాక'' యనునట్లు చంద్రుఁడు తన కిరణంబుల నుపసంహరించి పశ్చిమసముద్రమున వ్రాలఁబోవుచుండె. పక్షులెల్లను నిదురమేల్కాంచి పక్షంబుల విదుల్చుకొనుచు తమగూండ్లను సవరించుకొనుచు శిశువులనెల్ల సురక్షితములుగ నిడి యాహారార్థము ప్రయాణోన్ముఖములై యొండొంటిఁ బిలుచుచున్నట్లాయన కిలకిలారావంబులు సేయ నారంభించె;

విప్రోత్తము లెల్లరును శిష్యులకు వేదపాఠముల ముగించుచుండిరి.

ఇట్టిసమయంబున నాగుడారములయందెల్ల మనోహర మంగళ తూర్యంబులు ప్రారంభించెను. వానివెంట వివిధములై గద్యపద్యమయములైన మేలుకొలుపు లారబ్ధమైనవి. వాని సందడికి నన్నివైపుల నున్నసమస్తభృత్యులును మేల్కాంచి యకాలమున కుచితములైన కార్యములం దీర్చికొని యుచితాలంకారములను ధరించుచుండిరి. రాజాశ్రయము కలుగుటచే భృత్యులకు సైతము వాద్యఘోషములె మేలుకొలుపులయ్యె. మహదాశ్రయ మెవ్వరికి మహత్త్వము గలుగఁజేయదు?

సూర్యోదయమగునప్పటికి గుడారములనుండి యొకరికన్న నొకరెక్కువగ నలంకరించుకొనిన రాజపురుషు లసంఖ్యేయులై వెలువడఁదొడంగిరి. వారి కెదుట వరుసలువరుసలుగా నమర్పఁబడి రాజార్హములగు సింహాసనములతోడను సర్వవస్తు సమృద్ధంబులగు నుపచారములతోడను విచిత్రము లగుసోపానములతోడను నలంకరింపఁబడి యున్నతములైన మంచములు వరుసలువరుసలుగా నమర్పఁబడియుండెను. వానికిపైఁగా సూర్యరశ్మి సోఁకకుండ నొక పందిరివేయఁబడియుండెను. ఆపందిరి లోవైపున నతి శుభ్రవస్త్రములచేతను, నానావర్ణములైన సుగంధ పుష్పసరంబులచేతను చుట్టును విచిత్ర తోరణంబులచేతను శోభిల్లుచుండె.

ప్రతిస్తంభంబును సఫలంబులై విశాలపర్ణంబులుగల రంభాస్తంభంబులచే నలంకరింపఁబడియుండె. ఆమంచెలవరుసలలో నొక్కొకదానికి నడుమ బహుజనంబు లిఱుకులేక నడువఁగలిగిన విశాలమార్గము లమర్పఁబడియుండె.

వానిసమీపంబున నొక్కపురుషుఁడు మిక్కిలి మనోహరములగునలంకారములు ధరించి యతివికాసముగల మోము మహోత్సాహమును సూచించుచుండ బ్రాహ్మణ బంధుజనసమేతుండై యత్యుత్సుకులగు సేవకులచే నచ్చటి కార్యంబుల చక్కఁబఱుచుచుండె. ఆరాజకుమారు లట్లు గుడారములనుండి నిర్గమింపఁగానే మనము వర్ణించిన పురుషుఁ డెదురుచని వారల సగౌరవముగఁ దోడ్తెచ్చి "ఈ యాసనము నలంకరింపుఁడు, ఈ యాసనము నలంకరింపుఁ" డని యాసనములఁజూపుచుండెను.

అంత నొకబ్రాహ్మణుఁ డప్పురుషుని సమీపించి "దేవా! ఇఁక తడవులేదు. జరుగవలసిన కార్యముల జరిపింపుఁ" డనిచెప్పె. అంతట నప్పురుషుండు ప్రక్కనున్న సేవకులవైపు చూచి కనుసైగచేయుటయు వాఁడు నతిత్వరతో పురాభిముఖుఁడై చనుచుండె.

అప్పు డీమంచెల నలంకరించియున్న రాజకుమారుల మొగములు మిక్కిలి వికాసమునొందె. చంద్రుఁ డస్తమింపఁబోవుచు తన కాంతినెల్ల నీ రాజకుమారుల మొగంబులకు పంచి యిచ్చెనోయన చంద్రాస్తమయము మొదలు వీరి ముఖకాంతి యంతకంత కతిశయించుచు పైపేరాలో వర్ణింపఁబడిన బ్రాహ్మణుని మాటలువినఁగానే నాలుగైదువంతు లతిశయించెను. ఇంతియకాక సేవకుని శీఘ్రగమనమును వారి దృష్టులుకూడ ననుసరించుచుండెను. ఇంతలోపల నప్పురిలో నొక పెన్నిధానము నుంచినట్లు, వారి మనస్సులు తత్తఱఁబడుచుండెనని వారిచేష్టలచే స్పష్టముగా నెఱుంగనగుచుండెను.

అంత నగరమధ్యమున మంగళతూర్యధ్వని చెలంగుటయు

నీ రాజకుమారుల తత్తఱపాటునకు మితియే లేదు కాని యావా ద్యధ్వని సమీపించుకొలఁది వారి మొగంబుల క్షణక్షణంబునకు నొక్కొక నీలకాంతి తగులుచు విడుచుచుండెను. దీనిచే వారి మనంబున నించుక వ్యాకులత గలదని యూహింపవచ్చును గదా.

ఇట్లుండ మఱియొకవైపునుండి మేఘధ్వనితో సాటియగు నొక గంభీరధ్వని వినవచ్చెను. అంతకుము న్నొడలు సహింత మెఱుంగకయున్నను, మన రాజకుమారుల దృష్టులను యంత్రముచేత నాకర్షించినవిధంబున నొక్కమా ఱాధ్వని తనవైపున కాకర్షించుకొనియె. ఆవైపున పెంధూళి యెగయుటలేదు. గజముల ఘీంకారములుగాని అశ్వముల హేషలుకాని కాల్బలంబుల యార్భటులుగాని వినరాలేదు. దీనిచే నాధ్వని యేదియై యుండునో యని మనస్సున సంశయాభిప్రాయము తోఁచునంతలో నొక తాళధ్వజము కానవచ్చె. దానిచే నది యొక రథంబని మాత్రము దెలియవచ్చెనుగాని దానిలో నెవరుండిరో, యేనిమిత్తమై వచ్చుచున్నారో యెఱుంగరాకుండె. వీరు తమతో వచ్చిన రాజపుత్రులను వారి కేతనములను జక్కఁగ నెఱుంగుదురుగావున నీకేతనము క్రొత్తయగుటచే విచారింపవలసినవారైరి. పూర్వకాలమున నీతెఁ డీ రాజని యెఱుంగుటకు గుర్తులై వారిరథములమీఁద నొక వృక్షము పక్షి మొదలగునవి గుడ్డలపై వ్రాసి కట్టఁబడియుండును. వీనికే కేతనములనిపేరు. ఇప్పటికాలములో రథములు లేవు గావున సైన్యమునకు ముందుగా జండాలువచ్చుచుండుట యెల్లరు నెఱింగినదియేకదా.

అట్లారథ మంతకంతకు సమీపించుటయు దాని మధ్యమం

దున్న పురుషుఁడుఁ గనఁబడియె. ఆతఁ డొక్క కార్ముకంబును మితమైన యాయుధములును కొన్ని యమ్ముల పొదులును గలిగి, వారిదెస కతివేగమున వచ్చుచుండె. వానిని జూచి యీ రాకుమారు లొండొరులతో నిట్లు సంభాషించుకొనిరి.

ఒకఁడు—ఈతఁడెవ్వఁడు?

మఱియొకఁడు—క్రొత్తగా నడుగుచున్నావు. గంగాపుత్రుఁ డెఱుఁగవా?

ఒకఁడు—అయితే నిచటికేల వచ్చుచున్నాఁడు?

మఱియొకఁడు—మన కిట నేమిపనియో వానికి నదేపని.

ఒకఁడు—సరి. సరి! మొన్న దాశరాజునింట బ్రతిజ్ఞలుచేసెనఁట వినవా.

మఱియొకఁడు—ప్రతిజ్ఞలకు ఏమిలే; కార్యములకోసర మెన్నిటినైనఁ జేయవచ్చును. జరుపవలెగదా చేసినది.

వేఱొక్కఁడు—వాని,నోరుమూసి, 'ఆ-ఆ? ఏమనెద వ్రాయి! గంగాపుత్రుఁడు గంగాపుత్రుఁడు. తనతమ్మునకై కన్యార్థము వచ్చుచున్నాఁడేమో.

మఱియొకఁడు— (కొంచెమాలోచించి) తమ్ముఁడెవఁడు? విచిత్రవీర్యుఁడా? ఇప్పటిరాజు ఒకరికై ఒకరు వచ్చుటేమిటోయి? వివాహమునకు రేపటినుంచి మనముకూడ నెవ్వరినైన పంపవచ్చునా.

ఇంకొకఁడు—చాలు నీఁక నోరుమూయుండు; బలముగలవారియెదుట నీతులు సాగునా.

వేఱొక్కఁడు—సరికాని యెంతబలవంతుఁడైన నింత సాహసము చేయవచ్చునా; ఒక్క కవచముతో మన యిందఱబా

ణాగ్ని నోర్వఁదలంచినాఁడు.

మఱియొకఁడు—ఈకవచముండిననేమి? ఆతని ధైర్యకవచము గలదు. అదియుండిన దైవికములగు నాపదలే పురుషు నంటవఁట. ఇఁక శత్రువు లేమిచేయుదురు? బాణము లేమిచేయును? ఇవి యన్నియుఁ బౌరుషములేకదా.

వెండియు నొకఁడు-ముసలివారిమాటలు మాటలాడుచున్నావు. శరీరమునకు నొప్పియు నెవ్వియు లేనప్పుడు "మనస్స్థిరముగానిల్పిన దుఃఖము లేమిసేయును? ఎవరుమాత్రము ఏమిచేయవచ్చు" ననవచ్చునుగాని, బాణాగ్నులు శరీరమున దరికొనినప్పుడు ఈధైర్యము యేమిచేయును?

మఱియొకఁడు. మనఃశక్తిని నీ వేమెఱుంగుదువు? మనము ప్రయోగించు సస్త్రములన్నియు సామాన్యములగు బాణములే గదా! వానికట్టి యద్భుతశక్తి యెట్లుగలిగె?

అని యిట్లు మాటాడుచుండునప్పటికి నాతని రథము చేరువకువచ్చె. ముందు మనము వర్ణించిన పురుషుఁడు వాని సందర్శించి నమ్రుఁడుగ గౌరవించి యుచితాసనంబునఁ గూర్చుండ నియమించె. అప్పటికని పై రాజకుమారు లేమేమియో గొణుఁగుచుండిరిగాని యప్పటికి పురమునుండి వచ్చుచుండిన వాద్యములు సహితము మనోహరమగు నొక్కపల్లకితోఁగూడ మంచెలమధ్యమునను్న రాజమార్గమునఁ బ్రవేశించి వీరల నోరు సంపూర్ణముగా మూయించెను.

ఇది అష్టమప్రకరణము.

## నవమ ప్రకరణము.

ఆపల్లకియందు ముప్వురుస్త్రీ లుండిరి. వారి వయస్సును యావ నారంభదశ యలంకరించియుండెను. పలువిధములగు భూషణములు వారి మేని కాంతిని వేయిమడుంగు లతిశయింపఁజేయుచుండెను. వారిచేతులయందు విచిత్రములగు పుష్పమాలికలు ధరింపఁబడియుండెను. ఆపల్లకి రాజులు కూర్చుండియున్న యాసనముల సమీపింపఁగానే ప్రతిరాజపుత్రుని సమీపమందును నిలుపఁబడుచుండెను. అప్పుడు వాద్యఘోషము తగ్గించి యొక్కదాసి బంగరుబెత్తమును చేతనిడుకొని పల్లకియొద్దనిలిచి యాకన్నియలకు నారాజపుత్రునిఁ జూపి వాని రూపగుణముల విషయమై యున్నవి కొన్నియు, లేనివి కొన్నియు, గలిపి వర్ణించుచుండెను. వారు చేరువకు వచ్చినప్పుడును ఆపల్లకియందలి కన్యలు తనవైపుఁ జూచినప్పుడును, ప్రతిరాజపుత్రుఁడు తమతమ సౌభాగ్యముల ప్రకటించుటకై వివిధచేష్టలఁ జేయుచుండిరిగాని వారు మదనోన్మత్తులగుటచే వారు చేయఁబోయినపనులెల్ల "అయ్యను చేయఁ బోయినకోఁతియయ్యెను" అన్నట్లు వికారములుగాఁ బరిణమించుచుండెను.ఉన్మాదము వికారములకు ఆస్పదముగదా.

ఆకన్నియలలో నొక్కతెమాత్రము తన చేరువనున్న రాజకుమారుని నొక్కమాఱుచూచి యూరక ముఖ మావలికిఁ ద్రిప్పుకొనుచుండెను. ఇందుచే నాకన్నియమనంబున నొకవరుఁడు పూర్వమె నిశ్చయింపఁబడియుండెనని తోఁపక మానదుగదా. తక్కిన యిరువురుకన్నియలు నట్లుగాక ప్రతి రాజకుమారుని యాపాదమస్తకము పరీక్షించుచు కొందఱికి నమస్కారముచేతను మఱికొందఱికి తన బంగరుబెత్తము దాసీకి కనుసైగచేయుట

చేతను, మఱియు ననేకవిధంబులఁ దమయయిష్టమును సూచిం చుచుఁ బోవుచుండిరి. ఆకన్నియలు గడచి పోయినప్రదేశము లందలి రాజపుత్రుల హృదయము లెట్లుండెనో దానిని వర్ణించుట కంటె చదువరు లూహించిన మేలుగనుండును.

వర్ణనాప్రాయమగు నీప్రకరణ మారంభించినది మొదలు చదువరు లించుక విసుకుఁ జెందియుండవచ్చును. కావున నిఁక నొకటి రెండుమాటలలో నీప్రకరణమును ముగించెదను.

మనమిపుడు వర్ణించిన పద్ధతినిఁజూడ నది స్వయంవరమని యెఱుంగఁబడుచున్నదిగదా. సమయమువచ్చినపుడు విడువరాదు గాన దీనిగుణదోషములను గుఱించి కొంతవిచారింతము. స్వయం వరమనఁగా తాముగా భర్తనువరించుటయనిగదా అన్వయము. తాను భర్తనువరించుట యన స్వయంవరకాలమునకు పూర్వమే గుణదోషముల విచారించుకొని నిర్ణయించిన భర్తను వరించుట యా? లేక రాజకుమారు లందఱు మంచములపై నున్నయపుడే వారిలోనొక నివరించుటయా? మొదటిపక్షమైనయెడల మంచము లు మొదలగు పైస్వయంవరపు విధులకె యవకాశము లేదుగదా. తండ్రులు మొదలగువారు నిర్ణయించుటచేతనే కన్యకు నావిష యమున సమ్మతిమాత్రమే ప్రధానమగుటచేతను నది స్వయం వరమె కాకపోవును; స్వయంవరమునందు వరునిగుణదోషములు విచారించుభారమునహితము కన్యపైనే విడువఁబడునుగదా; ఇఁక రెండవపక్ష మయ్యెనేని, ఒకపురుషునిచూడఁగానె వానిగుణ దోషములు సంపూర్ణముగఁ దెలిసికొనుటకు శక్యమగునా ? పు రుషులవిషయము లెఱింగించుటకు నియమింపఁబడిన దూతికలు రాజపుత్రులయెదుట వారికి దోషంబులు కలిగియుండినను ప్రక

టింపఁగలుగుదురా? ఇంతియకాక రూపమాత్రమున కాసక్తులగు కన్యలు గుణహీనుఁడగు రూపవంతుని వరించి గుణవంతుని విడుచుట యుసంభవించును. అనేకరాజపుత్రులలో నొక్కని వరించుటచే మిగిలినవారి కామమెల్ల క్రోధముగా పరిణమించి తనకు భోగ్యవస్తువగుటచే కన్నియను విడిచి దానిచే వరింపఁబడిన పురుషుని నాక్రమించును. ఇట్టికలహము లొక్కొక చోట నామరణాంతంబులై కూడనుండుటకలదు. దీనికి పాండవులకు మేనమామయయ్యు తన కన్నియ నపహరించుటచే శ్రీకృష్ణునిపైఁ గలరోషమున శల్యుఁడు కొద్దికారణములు సాకుచెప్పి కౌరవులపక్షమునఁ జేరుటయె దృష్టాంతము. ఇట్లు బహుదోషములతోఁ గూడియుండుటయే కాక తుట్టతుదకు కన్యకు వరించినభర్త దక్కుటకూడ సంశయాస్పదమైయుండును. కావుననె మనపూర్వులు అష్టవిధవివాహములలోఁ జేర్పలేదు. గాంధర్వరాక్షసవివాహములు క్షత్రియులకుమాత్రమె విధింపఁబడినవి. గాంధర్వమనఁగా సతీపతులన్యాపేక్షణ లేక యైక్యమొందుట; ఈ కార్యము లజ్జను సంపూర్ణముగ విడిచిన స్త్రీలకుఁగాని సాధనముకానందున గుణదోష విచారమందు సహితము వారి బుద్ధికిఁ గొంతయుండదు. అన్నివిషయములయందును సమానుఁడై కేవలము కన్నియకు మాత్రమెగాని ఆమె బంధువులలో కొందఱికిఁగూడఁగాని సమ్మతుఁడైన పురుషుఁడు నిరాతంకముగా కన్నియను వివాహము చేసికొనుటకై విధించిన వివాహము రాక్షసవివాహము; దీనిచే శౌర్యముఁజూపి కన్నియను హరింతురు. ఈ రెండువివాహములు స్వయంవరముతో దాదాపు సమానములైనను దోషములు

గానరావు; ప్రసంగము లేకుండుటచే తక్కిన వివాహముల నిట * వివరింపలేదు.

ఇట్టిస్వయంవరము కలహకారణమని కొందఱు అవలంబింపక పోయినను అవలంబించువారలకు కొన్ని కారణములు లేకపోలేదు. పూర్వకాలమున ప్రతిబాలుఁడును వానినుసు స్వతంత్రముగ లోకవృత్తముల నెఱుంగఁగలిగి యొకమార్గమున స్థిరపడు కాలమునందు (౫-౬ సంవత్సరములు మొదలు ౧౫-౧౬ సంవత్సరములవఱకు) నెట్టిదుర్గుణవంతుఁడైనను సుగుణవంతునిఁ జేయఁజాలు నిత్యధర్మపరులైన ఋషులసన్నిధి నాశ్రమములలో చిత్తవిక్షేపకరములగు స్త్రీల సాన్నిధ్యము విడిచి పండ్రెండు సంవత్సరము లేకదీక్షగా విద్యాభ్యాసము చేయవలసియుండెను. రూప మనునది గుణములను సూచించునట్టి పటము. ఈ రెంటివలనను సాధారణముగా గుణహీనుఁడు వరింపఁబడుట కవకాశము లేదని, ఈ స్వయంవరపద్ధతి నవలంబించిరి యుద్ధమున రాజులకు వింటె.

అట్లాకన్యలు సమీపింపఁగా నే యా గంగాపుత్రుఁడు సింహకిశోరము పర్వతాగ్రమునుండి దిగునట్లు తాఁ గూర్చుండియున్న మంచమునుండి డిగ్గి తన హస్తములతో నా రాచకన్నియలఁ బట్టికొని తెచ్చి యంతకుముఁ బ్రయాణోన్ముఖమై యున్న తన రథముపై నిడికొని యుత్తరాభిముఖుఁడై పోవఁ దొడంగె. మొదటినుండియు నా రాజపుత్రులకు నుపచార మొనర్చుచున్న పురుషుఁ డక్కార్యమునకు సంతసించి తలయూఁచి యూరకుండె.

---

* విశేషవిమర్శనమును గోరువారు నేనీగ్రంథమాలయందు ప్రకటింపఁబోవు ధర్మశాస్త్రార్థసంగ్రహమునందు చూచుకొనునది.

ఆ ముప్వురుకన్నియలలో నొక్క కన్నియకుఁ దక్క తక్కిన యిద్దఱిముఖంబు లత్యుత్సాహభరితంబు లని వారి ముఖవికాసంబులు సూచించుచుండె.

అప్పుడు కన్నియలచే నంతకుమున్న నిరాశులుగా నొనర్పఁబడిన రాజకుమారులు సహితము లబ్ధోత్సాహులై తమతమ సైన్యముల సిద్ధపఱచుకొని యయ్యేకవీరుని ననతిదూరంబున నెత్తాఁకిరి. ఆశూరుండును వారి బాణవర్షంబులలో నొక్క బిందువైనను వారి యస్త్రాగ్నులలో నొక్క స్ఫులింగమైనను తన రథంబునందుండు కన్నియలకుఁగాని తనకుఁగాని సూత రథాశ్వములకుఁగాని తాఁకకుండు నట్లతివిచిత్రముగా రణమొనర్చె. బాణములారా! మిమ్మేతీరుననైన జయింపకతీఱ మనునట్లు వారెల్లఁ దమ వేగంబులఁ జూఁపసాగిరి. ధైర్యకవచము ధరించినవాని కసాధ్య మెయ్యది! అయిన నందొక్కరుఁడుమాత్రము మరలమరల తనంతటఁ దానె పురికొనుచు ననేకమాఱు లెదురుకొనెను గాని ప్రయోజనము లేదయ్యె. అట్లు వారిందఱయ్యుఁ జేయునది లేక 'కాశిరాజా! ఇందఱియెదుట మమ్ము నవమానించి మీదుహితలఁ గొనిపోవఁ దల యూఁచి యూరకుండి మాకెల్ల నీపై వృథా రోషము కలిగించుకొనుటకంటె నిశ్చయించిన పురుషునిఁ బ్రత్యేకముగఁ బిలిపించి వివాహ మొనర్చిన మేలై యుండునుగదా' అని తమలోఁ దలంచుకొనుచు వెడలిపోయిరి.

ఇది నవమప్రకరణము.

## దశమ ప్రకరణము.

ఆ. ఇంద్రపదముచేతి కీయఁబడిననైన
రంభ దానవలచి రాఁగనైన
మూఁడుకనులవాఁడు మొనసిచెప్పిననైన
ధీరమతులు వ్రాన్కిఁ దిరుగఁబోరు.

“ దేహాభిమానము విడిచి యంత తపముచేయుచున్నను రాజసులను కామాదులు విడువఁగలవా ? ఎట్లువిడువఁగలవు ? రజోగుణము వారికి తండ్రికదా? ఎట్లైన నగుఁగాక, ఇట్లు పుత్రతుల్యుఁడగు ప్రియశిష్యునిపై నిట్టి రోషమూనుట యుక్తము కాదు. ఇదియేమి గురునింద చేయఁబూనితి. ఒకరివలన పరాభవమునొంది తన్ను శరణన్నవారిఁ బ్రోచుటకై కలిగిన రోషము దోషమగునా ? చెడ్డగుణము లనఁబడు నెవ్వియైనను మంచి సంకల్పమునఁ బ్రవర్తించెనేని సుగుణములుగా మాఱునుగదా?” అని కొంత యాలోచించి “అతఁడుమాత్ర మేమితప్పు చేసెను? ప్రతిజ్ఞను స్థిరపఱుచుకొనెను. ఇప్పటికి నాచార్యుని వాక్యమునునైన వినునో వినఁడో ! మనకేల యీ విచారము? పట్టణము సమీపించుచున్నది. అన్యచిత్తులమై పోవుచుండిన మార్గము తప్పిపోవు నేమో” యని తనలో తలంచుచు నొక్క బాటసారి హస్తినాపురము ప్రవేశించి రాజమార్గమునఁ జనుచుండె. ఆతనిచేత నొక్క పలాశ దండంబును కమండలువునుండె. అతని మూఁపున నొక కృష్ణాజినము వ్రేలుచుండె. శుభ్రమగు యజ్ఞోపవీత మొక్కటి వాని వక్షఃస్థల మలంకరించుచుండె. వానిమొగము కాంతిచే యావ

నదశను సూచించుచుండె. శరీరమంత స్థూలమును కృశమును గాక బలాఢ్యమై యున్నట్లు వాని యునికి యెఱింగించుచుండె. ఎఱ్ఱని జటాభారము పాదములవఱకు వ్రేలుచుండె. పురవీథులం దిరువంకలం గల వివిధ వినోదము లాతని దృష్టుల హరించుచు గమనంబునకు పలుమా ఱాతంకమగుచుండె.

ఇట్లు చనిచని సర్వభవనంబులకంటె వేయిమడుంగు లతిచిత్రమగుటచేతను, బహుద్వారములు కలిగి యెందు చూచినను ఖడ్గపాణు లగుభటులచే నావరింపఁబడియుండుటచేతను, పురజనులు వేనవేలుగ ద్వారసమీపమున నిలిచి వార్తల లోనికంపుచుండుటచేతను, దానిని రాజభవనమని యెఱింగి లెక్కకు మిక్కిలియగు జనుల మధ్యమునుండి మెల్ల మెల్లగ మార్గము చేసికొని ద్వారముసమీపించి యందు వేత్రహస్తుండై యున్న యొక పురుషునిచే తన రాకను లోని కెఱింగించె. అట నుండి ప్రవేశింపఁజేయుమని యతిత్వరితమున రాజాజ్ఞయగుటయు నొక్కపురుషుఁడు మార్గము చూపుచుండ సభాభవనముం జేరె.

అచ్చటి సభ్యు లా బ్రహ్మచారి నెదుర్కొని తోడ్కొని పోయి యుచితాసనంబున నునిచిరి. భీష్ముఁడు నాపాదమస్తకముం బరీక్షించి గుర్తించి యిట్లనియె. 'విప్రోత్తమా! మానులకెల్ల కుశలంబె?

బ్రహ్మచారి—మీ విచారణములోనున్న కుశలమున కేమికొఱఁత?

భీష్ముఁడు—సర్వమును మహాత్ముల యనుగ్రహము. సహాధ్యాయుని నను మఱచితిరే?

బ్రహ్మచారి—ఆవిశ్వాస మెన్నఁటికైనను మఱపునకు వచ్చు నదియా ?

భీష్ముఁడు—ఇన్నిదినములకు మిమ్ముఁ జూడఁగంటి;కృతార్థుఁడ నైతి. మీరాక కిపుడు గతమేమి ?

బ్రహ్మచారి—సర్వమును దీనిచే నెఱుంగవచ్చు.

అని యొకపత్రికను భీష్మునిచేతి కందిచ్చె. దానిని స్వయము గా చూచుకొని భీష్ముం డతిసంభ్రమంబున గద్దియ డిగ్గి సభ్యుల వీడ్కొని కనచాది రాజవేషముఁ దీసివేసి వినీతవేషమును దాల్చి "విప్రోత్తమా! రండు రండు; మహాత్ముని యాజ్ఞ ననువర్తించుటకు తడవు చేయరా" దనుచు, నా బ్రహ్మచారి తోడ నడువ పాదచారి యై రాజభవనము నిర్గమించి, యమునానది కభిముఖుండై చను చుండె. అట్లు భీష్ముండు నిర్గమించుటఁగని సత్వరంబుగఁ గొం దఱు వృద్ధపురోహితులును వృద్ధామాత్యులును వెనువెంట నడచుచుండిరి. పురిజనులెల్లరును నారిట్లు పాదచారులై చను చుండుట చూచి యబ్బురపడుచుండిరి. కార్యము నెవ్వ రెఱుం గుదురు? మహాత్ముల సంకల్పంబులు ఫలము జనించినపిదపఁగదా యెఱుంగవచ్చును!

అట్లు త్రోవనడుచుచున్న భీష్మ బ్రహ్మచారుల కిట్లు సంభా షణము జరిగె.

భీ—మహేంద్రపర్వతమునుంచి యెపుడు బయలు వెడలితిరి?

బ్ర—నాలవదినము మధ్యాహ్నమున.

వృద్ధామాత్యుఁడు—కళింగదేశమునుండి హస్తినాపట్టణమున కు నాలుగుదినములలోనావచ్చుట?

భీ—ఇంత శీఘ్రప్రయాణమునకు కారణమేమి ?

బ్ర—ఏను సంపూర్ణముగ నెఱుంగ.

భీ—ఎఱింగినంత వక్కాణింపుఁడు.

బ్ర—మేము ప్రయాణమగుదినమున సూర్యుఁ డాకాశమధ్యమునకు చేరువనున్నయపుడు ఆశ్రమవాసు లగువానులు కొందఱు రాచకన్నియ నొక్కదాని నేదియో యొక కారణంబున దుఃఖించుచున్నదాని నాచార్యు సమీపంబునకుం దెచ్చిరి.

భీ—తర్వాత?

బ్ర—అపు డాశ్రమములయందు వైశ్వదేవకృత్యము ముగియు సమయ మగుటచే నేను భిక్షార్థమరిగితి; అందుచే నేనే మెఱుంగను; అయినను మరల వచ్చునప్పటికి 'నీక దుఃఖింపవలవదు. వాఁడు నా ప్రియశిష్యుండు నామాట నతిక్రమింపఁడు' అనుమాటలుమాత్రము వినవచ్చె.

భీ—మిత్రమా! ఆ ఘనుఁడు పురప్రవేశము నొల్లకుండుట కేమి కారణము?

బ్ర—అన్నియు నెఱుఁగవచ్చును; చేరువకువచ్చితిమి.

అనఁగానే వారలందఱు నెదుటఁ జూచునప్పటికి యమునానది కతిసమీపమునను్న యొక మహావృక్షముచెంత నొక్క పురుషుఁడు గూర్చుండి వీరిదెస చూచుచుండె. ఆయన దృష్టులు శాంతములైనట్లు గానవచ్చుచున్నను ముఖ మించుక కందువాఱియుండుటచే మనస్సున జనించిన రోష మడంచుకొనుచున్నట్లు స్పష్టమగుచుండె. ఆయన జడలును,వల్కలంబులును,దండకమండలువులును, రుద్రాక్షమాలికలును, వీనితో సమానముగ ధనుస్సును బాణములును ప్రధానముగా నొక గంద్రగొడ్డలియు

ధరించియుండెను. ఆయన పార్శ్వమున నొక కన్నియ నివసించి యుండి వీరిని జూడఁగనె సిగ్గువెంపున నించుక తలవాంచికొని యె. ఆకన్నియ కనులఁబడఁగానె భీష్ముఁడు తన మనంబున నించుక విచారించి తుదకు తలయూఁచి యప్పురుషున కభిముఖముగఁ జనుచుండె. ఇట్లందఱు నాపురుషుని సమీపించి యతివినయంబున నమస్కరించి దీవెనలఁబొంది యాయన యాజ్ఞచే నచ్చటచ్చటఁ గూరుచుండిరి. అప్పురుషుండును పుత్రవాత్సల్యంబున భీష్మం జేరఁదీసి, "వత్సా! ని న్నన్నిదినములనుండియో చూడవలయునని కోరికతో నుంటిని, నేఁటి కది సిద్ధించె. రాజ్యమును నిష్కంటకంబుగ నొనర్చితివా? ప్రజలును సుఖులై నీ కీర్తిని బ్రశంసించుచున్నవారలా ?"

భీ—(ధీరోదాత్తుఁడు గావున తన్ను స్తోత్రముఁజేయుటను వినఁగానే లజ్జచే నించుక తలవాంచి) 'ఆచార్యా! మీ యనుగ్రహంబునకుఁ గొఱంత లేదు. నేఁడు మీ దర్శనంబున కృతార్థుండనైతి. ప్రవేశంబున నగరంబునెల్ల పావనము సేయ బ్రార్థించుచున్నాఁడ.

పురుషుఁడు—పురప్రవేశంబున కేమి? ఈ కన్నియ నెఱుంగుదువా?

భీష్ముఁడు—ఎఱుంగ కేమి? స్వయంవరమునఁ దెచ్చిన కాశిరాజపుత్రికలలో నొకతె; అంబ. ఈమె మీయొద్ది కెట్లుచేరె?

కన్య—కన్నుపొడిచి కంట నీ రేల కాఱుచున్నదన్నట్లున్నది.

పురుషుఁడు—(భీష్మునిఁ జూచినప్పటినుండియు తన హృదయమున రాఁజుచున్న రోషాగ్ని నడంచుకొనుచు) కామిని సుఖంబు

లకెల్ల దూరీభూతమై ప్రతిపక్షుల సాధింప నన్నా
శ్రయించె !

భీష్ముఁడు—పాప మీమెయెడల దైవఘటన మన్నివిషయంబులఁ
బ్రతికూలంబయ్యె.

పురుషుఁడు—రోషముతో చేసినదంతయుఁ జేసి దైవముపైని
వేయనేల ?

వృద్ధామాత్యుఁడు—(తనలో) ఈతఁ డలిగిన నద్ద మెవ్వఁగు? ముం
డెట్లు గానున్నదియో !

భీష్ముఁడు—(వినయముతో) ఆచార్యా! కోపింపఁదగదు. ఇట నప
రాధ మేమియు లేదు. అట్లతిప్రయత్నముతో తమ్మునికై
వీరిని దెచ్చియు నీ యంబ నాకు సాల్వునిపై కూర్మి
గలదన్నతోడనే యుచితమగు తెఱఁగున వానియొద్ద
కంపితిఁగదా?

పురుషుఁడు—(ప్రక్షాళనాద్ధిపంకస్య దూరాదస్పర్శనంవరమ్)
బురదను త్రొక్కి కడుగుకొనుటకంటె ముందు త్రొక్క
కుండుటయే మేలు. అన్యచిత్తయగుకన్యను మొదట
నీ వేల తేవలయు ?

భీష్ముఁడు—నే నెట్లెఱుంగఁగలుగుదును! అందఱురాజులు వెన్ని
చ్చి పాఱినను సాల్వుఁడుమాత్రము పలుమాఱు రణోన్ము
ఖుండై వచ్చుచుండె. అది జయేచ్ఛయని తలంచితిని
గాని యంబపైఁ గల ప్రేమాతిశయమని యెట్లెఱుంగు
దును ?

పురు—ఏమి! కలచమత్కారములన్నియు ప్రకటించుచున్నావు,
లజ్జావతు లగుకన్యలు తమ తలంపులు నీకెఱింగింతురా?

వారి ముఖవికారంబులం గనిపెట్టి వారి తలంపుల నెఱింగి వారి కేర్పాటంత రాకుండునట్లు కార్యము జరుపవలయు.

భీష్ముఁడు—స్వామీ! నిక్క మానతిచ్చితిరి; బహుజనులతోఁ బోరుచుండుటచే నప్పటి కాపని సాధ్యము కాదయ్యె; ఏమి సేయువాఁడ.

పురోహితుఁడు—మహాత్మా! నే నొకటి విన్నవించెద; ఆ యుద్ధరంగమం దొకవేళ కన్నియల ముఖవికారములు పరీక్షించి వారి తలంపు నెఱుంగుట తటస్థించినను రణము సేయుచున్నవానిని బిలిచి "యీ కన్నియకు నీయందు కూర్మిగలదు గాన దీనిని నీవు కొనిపొమ్ము" అని యొసంగుట వీరున కవమానకరముగదా? ప్రాణమున కంటె మాన మధికముగ గణింతురుగదా వీరులు?

పురుషుఁడు—ఆ! ఏమిచెప్పితివి? ధర్మము నిలుపఁగోరువారికి ధర్మమునకంటె నతిశయమయిన దెద్ది?

వృద్ధామాత్యుఁడు—(తనలో) శౌర్యమును శూరధర్మమేగదా! ఈయన కెవరు చెప్పఁగలరు.

భీష్ముఁడు—నాపై నీనుచే నిరర్థకంబుగ నిన్నాళ్లుండియు తనపై కూర్మిగల కన్నియను నిరాకరించిన క్రూరుఁడు సాల్వుఁ డటుండ శిష్యునిపై నలుగనేటికి.

పురుషుఁడు—(అతిరోషముతో) యుద్ధమునఁ నోడి పిదప తన శత్రునిచే నర్పింపఁబడిన ప్రియధనమును గ్రహించుట యాతనికే మాత్ర మవమానకరముగాదా?

బ్రహ్మచారి—ఈ యిరువురయవమానములు నీమె కుత్తుకకు కత్తెరలయ్యె.

పురుషుఁడు—భీష్మా! ఇంతకు నీ ప్రమాదంబు మూలకారణం బు కావున నిక్కంబుగ నీవ పరిణయంబగుము. మాఱు మాట లాడి నారోషంబుఁ బెంపకుము.

భీష్ముఁడు—స్వామీ! సర్వము నెఱింగి యిట్లాడిన నేమిసేయు వాఁడ; పట్టిన ప్రతిజ్ఞ విడుచుట పాడియగునా?

పురుషుఁడు—నీ ప్రతిజ్ఞ దోషయుక్తమయినది. నీకు ననపత్యతా దోషంబు గల్గించుదాని కోర్వరాదుగదా, మఱియు నీ ప్రతిజ్ఞకు కారణమగు సత్యవతికిని నీ వివాహ మసమ్మ తముకాదు. కావున నామాట తిరస్కరింపకుము" అని పలుకఁగానే భీష్ముఁడు తన ప్రతిజ్ఞను విడుచుట కూడదని సంపూర్ణముగ నిశ్చయించి గురువాక్యమునైనను ధిక్క రించుటకు సంశయింపకుండె. త్రిలోకసుందరియగు సక్క న్నియ స్వయముగా వరించినను భీష్మునిచిత్త మొంతయు చలింపకుండె. ధైర్యమన నిట్లుగదా యుండవలయును.

అప్పురుషుండును భీష్ముని ముఖవికారంబువలన నతని నిశ్చయ మును సంపూర్ణముగ నెఱింగి కనుబొమలు ముడివడ తనచేత నున్న గండ్రగొడ్డలిని పైకెత్తి నేలం జఱచుచు, "ఓరీ! పరశురా ము నెదిరింపఁ దలంచువారుంగలరె! నిరాయుధునిపైకి నీశరం బులు పోనేరవు" అనియె. అంతట భీష్ముండును ప్రతిజ్ఞాభంగం బునకంటె యుద్ధంబె శ్రేష్ఠంబని నిశ్చయించి గురువునకు నమ స్కరించి "అట్లె సన్నద్ధుండనయ్యెదను. ప్రతిజ్ఞాభంగంబు సేయ నోపను" అనిపలికి తన పరిజనంబుతో పురాభిముఖుండై చనియె.

ఆతని ధైర్యంబున కచ్చెరుపాటును ధర్మంబునకు సంతసం

బును రూపంబున కనురాగంబును నొక్కటిగాయై తన మనంబున వెనఁగొన తనకుఁగలిగిన పరాభవంబునకు భీష్ముఁడు కారణం బని యాతనిపై రోష మంకురింప పరశురాముని యుద్ధోత్సాహంబువలన నాతని కేమి యపాయంబు కలుగునో యని స్త్రీ సహజంబగు చాంచల్యము వానియం దనురాగముండుటచే సధికమై యొకవంక సందడించుచుండ, పలువిధంబులుగా డోలాయమానమగు మనస్సుతో నయ్యంబయు సుఖమునొందకుండె.

ఇది దశమప్రకరణము.

## ఏకాదశ ప్రకరణము.

తే. జాతిభేదకారణములై ఖ్యాతిగన్న
త్రిగుణములు కులక్రమమునఁ దివియఁ గడమ
కార్యముల శాంతి శౌర్యాదికముల నొసఁగుఁ
బరుషుఁడగు పురుషునకైన భామకైన.

"వజ్రహృదయ మట్టిఘనునకు సంభవించుట చిత్రము! ధర్మమార్గమునుండి చింతాకంతయైనం దొలంగని పుణ్యశీలుఁడే! ప్రియశిష్యుఁడే! ఆతనియందా నిర్నిమిత్తంబుగ నింత దోష మూనుట! ఒకవేళ ప్రమాద ముండిన నుండనిండు. దాని కిది యా శిక్ష? ప్రతిజ్ఞను విడువుమనిన నామాట విన లేదఁట! దానికి యుద్ధము సేయవలయునఁట! ఎంత బాగుగనున్నది! వినయవంతులకు నయితము పారుష్యమును నేర్పుట యిదియేకదా? తాను జెప్పినది యధర్మమైనను ధర్మమైనను విననివారిని యుద్ధముచే దండింపవలయునని తెలిసనది. వహ్వా! ఎంతమంచినీతి యేర్పడినది!

గురువుల యుపదేశ మిటులుగఁదా యుండవలయును; అవును; ఎవరివద్ద నేమియుండునో వారి నాశ్రయించిన నదియే దొరఁ కొనుననుటకు చిత్రమేమున్నది? 'మనబంగారు మంచిదైన కంసలవాఁడేమిసేయు' ననునట్లు సహజ సుగుణవంతుని నెవ్వరేమిసేయఁగలరు? ఇది యేటి వెఱ్ఱితనము! అభ్యాసముచే కాని పని యేమున్నది? ఒక్కొక ధీరచిత్తము చెడకుండినను సామాన్యుల మనంబులు పెద్దలనఁబడువారి ననుసరించియేకదా పోవుచుండును. పుట్టినప్పటినుండియు ననేక యుద్ధములయం దాఁటి తేఁటి వెదకివెదకి యిరువదియొకమాఱు క్షత్రియవీరులనెల్ల వధించియున్న తనకు మొన్న మొన్న కనుదెఱచిన క్షీరకంఠుఁడేఁటు ప్రతివీరుఁడు! ఆహా! క్రోధపిశాచ మెంతచేసినది! ఈయుద్ధంబున జయాపజయములు రెంటియందును తన కపకీర్తియే నిశ్చయమను మాటయుఁ దోఁపనీయదయ్యె. ఇది యేటిపోరు; ఇది యేటి పోరు;జయాపజయముల నిశ్చయింపలేముగాని, ఒకదినమా? రెండుదినములా? నేఁటికి యిరువది రెండుదినములయ్యె! ఇఁక నెన్నిదినములు జరుగనున్నదియో''

అని యిట్లు తలపోయుచు నొక్క యువతి యమునానదీతీరమునఁ దిరుగుచుండె. ఆమె యడుగడుగునకు నిట్టూర్పువిడుచుచు, "ఇదియె యుద్ధభూమి యగుచున్నది; నే నేమిసేయఁగలను. గురువాక్యము వినుమని చెప్పఁబోయిన పుత్రుఁడు ధర్మపరాయణుఁడు. శిష్యునిపై కోపింపవలదన్న భృగువంశజులు క్రోధపరాయణులు. ఏమిచేయుటకు తోఁచక యున్నది" అని కొన్ని మాఱులు బిగ్గఱఁగను కొన్నిమాఱులు తనలోను నుడువుకొనుచుండెను. ఒక్కొకమాఱు శరీరము జల్లన "హా! ఈ క్షత్రి

యాంతకుని గెల్వఁగలవార లెవ్వ"రనియు మఱియొకమా ఱిం చుక యూరటతో "కానిమ్ము. దైవసంకల్ప మెవ్వ రెఱుఁగుదురు? రామచంద్రునిచేతం బోలె నిబ్బాలునిచేతఁ గూడ నీయన గర్వం బు నడంగఁజేసి శుద్ధబ్రాహ్మణత్వము ననుగ్రహించి కృతార్థునిఁజే యఁ దలఁచుచున్నాఁడేమో దైవము" అని పలువిధంబులఁ దలం చుచుండె. ఇట్లుండ నామెకు కొంతదూరమునుండి గంభీర మగు నొక రథధ్వని వినఁబడియె. అది వినఁబడఁగా నే యాకస్మికముగ మనస్సునుపుట్టె విచారములెల్ల మాని యుత్సాహమును బొందె. దాని నెఱింగి యామె "ఇది యేటిచిత్రము? ఇట్టి విచార సమయంబునందును హఠాత్తుగా నిట్టి శుభసూచకంబులు కలు గుచున్నవి. నిక్కముగా నాపుత్రునకు జయము కలుగనుండినఁ గాక యిట్టివికాసము కలుగ నేర్చునా? నాయంతి ధైర్యవంతులకై నను పరాజయకాలమున మనస్సు శంకించుచునే యుండును గదా" అని చింతించుచు, యూరట చెందుచున్నప్పుడె కెదుట నొక్క రాజపుత్రుఁడు రథారూఢుండై యుద్ధసన్నాహంబుతోఁ గాని పించె. మనసు సర్వకాలంబులందును రాఁబోవు శుభాశుభంబు లును వానియెడల పురుషులు నడచుకొనవలసిన పద్ధతులును బోధించుచునే యుండును. కామక్రోధాదులకు నధీనమగు మనసు తన యంతరాత్మ యెఱిఁగించు హితముల నెఱుఁగలేక, యెఱింగియు ప్రియములపై నున్న స్నేహముచే ననుసరింపలేక, తుదకు సుఖదుఃఖవేగములకు లోనై కలవరపడుచుండును. ఇది యెల్లరకును తెల్లమయిన విషయమె.

ఆవచ్చుచున్నరథమున కెదురుగా మఱియొకరథము వేగ ముతో నేతెంచి నిలువఁబడియె. దాని నొక్క యౌవనవతి

యగు కన్నియ గడపుచుండె. దానియందలి పురుషుఁడు రాజపుత్రుని రథమును జూడఁగానే యతి సంరంభంబున నిట్లనియె. "ఓయి! నామాట వినుము. పెండ్లిపెత్తనము సేయవచ్చినవాని చేత మరణము నేల కొనియెదవు! నీవు నా శిష్యుండవగుటచే నీ యుద్ధప్రావీణ్యమును జూడ నేనిన్నినాళ్లు క్షమించితి. నేను నిక్కముగ సలిగిన నాకడ్డ మెవ్వరు? ప్రతిజ్ఞాభంగంబు దోషమని శంకింపకుము. ఒక భూతమును రక్షించువిషయమున తమ ప్రతిజ్ఞలకు భంగమైనను సాధువులు సమ్మతింతురు.

రాజపుత్రుఁడు—స్వామీ! మీరన్నట్లు నా విద్యను పరీక్షించుటకై కాక నిక్కముగ మీరలిగిన మీయెదుట నిల్వ సురేంద్రునకైనను దరంబె. లోకసాక్షు లగుసూర్యాదులయెదుట నొనర్పఁబడిన ప్రతిజ్ఞ నసత్యముసేయుట యుక్తమగునా! వాత్సల్యము గలవారు తమ శిశువులకు ప్రియములఁ (అప్పటి సౌఖ్యముల) గోరుచుందురుగాని హితములఁ (చేయవలసినపనుల) దలంపరనుట సహజమేకదా.

పురుషుఁ డీమాట వినఁగానే కన్నెఱ్ఱఁజేసి "సరి! ఈ మూర్ఖ్యమునకు ఫల మనుభవింపు" మనుచు తన యెఱ్ఱని పరుషఁపు జడలఁ బిగియఁజుట్టి జందెముల నడుమున బిగియించి పైనున్న కాషాయవస్త్రమును నడుమునకు దట్టిచుట్టి రథముపై నిలుచుండి యాలీఢపాదమున నిలిచి యెక్కిడిన ధనుస్సు నతి గంభీరముగ మ్రోయించుచు శరంబు సంధింప సిద్ధుండై యుండె.

రాజపుత్రుండును ధనుస్సు నెక్కిడి యప్పురుషునకు నమస్కరించి "స్వామీ! ఆలస్యమేటికి? బాణంబును రానిండు. పిదపఁ

గాని నేను యుద్ధంబున కుపక్రమింప" నని వినయంబునఁ బల్కె. వినయంబులెల్ల క్రోధశీలురకు కపటంబులని తోఁచునుగదా?

ఆపురుషుఁడు వినయంబులచే రోషం బంతకంత కతిశయింప వాఁడిగల యమ్ముల నేయఁదొడంగె. వానినెల్ల నడుమన ఖండించుచు రాజపుత్రుండు విచిత్రగతుల పురుషుని నొప్పింపఁ బ్రయత్నించుచుండెనుగాని యక్కన్నియ సామర్థ్యంబువలన నాశరంబుల లక్ష్యంబు లెల్లఁ జెడుచుండె.

ఇట్లతిఘోరంబుగ చాలసేపు యుద్ధము నడచుచు బాలవృద్ధు లనుభేదములేక కొంతసేపు వారికి, కొంతసేపు వీరికిని, జయాపజయములు నియమములేక కలుగుచు, నిది యిట్లని నిశ్చయించుటకు వీలులేకుండె. ఎవరిపక్షము జయముగానున్నప్పుడు వారిప్రక్క వారు సంతసించుటయు నపజయము గలిగినప్పుడు దుఃఖించుటయు సహజమేకాని యిచ్చట నట్లుగాక నేపార్శ్వము నకు జయాపజయములు గలిగినను రెండుపార్శ్వములకు దుఃఖమే కలుగుచుండె.

ఈయుద్ధముఁ జేయు పురుషుల నిరువురను నందొకరికి సారథిగానున్న కన్నియను చదువరు లిప్పటికే గుఱుతించియుందురు. వీర లిప్పటికి చాలకాలమునుండి పోరుచున్నవారు కావున మిక్కిలి యలసియుండిరి. రోష మంత ప్రధానముగా లేకపోయినను సహజమగు మనోబలమే వారికి యుద్ధమునకుఁ దోడ్పడుచుండె. సారథ్యముఁ జేయుచున్న కన్నియ రాజపుత్రుని వైపునకుఁ జూచినపుడెల్ల వివిధవిధంబుల తన కామవికారంబుల వెలిపుచ్చుచు నాతని యపజయసమయములందు మొగము వ్రేలవైచుచుండె. జయ సమయములయందుఁగూడ నామెకు సంపూ

ర్ణముగ సంతసము కలిగెనని వచింపరాదు. తన్నురక్షింపఁ గంకణము కట్టికొని వచ్చిన పురుషున కాతని శిష్యునివలనన పరాభవము కలుగునేమోయని శంక యామెను బాధించుచుండె. గురువున కెంతదోషమున్నను తనప్రియశిష్యుని మృతికి సమ్మతించుననుట యుండదుగదా? శిష్యుఁడు సామాన్యుఁడైనను గురుని యందు ద్రోహము దలంపఁడు ఇఁక ధర్మజ్ఞునిమాట చెప్పనేటికి? ఇఁక మన రాజపుత్రుని మనము గురుని మరణమున కుత్సహించుననఁగలమా!

ఎట్లైనను యుద్ధమన్నపిదప నొప్పలేకుండునా! అట్లు కొంతవడి యుద్ధము జరిగినపిదప మనరాజపుత్రుని ఘోరశరంబు ఆ జటాధారిముఖంబున దృఢంబుగ నాటెను. ఆతండును దానివేదనకు మూర్ఛిల్లె. దానికి తక్కినవారందఱును కలంగుచున్నప్పటికి సత్పురుషుఁడు తెలిసి రోషమినుమడింప 'నిలునిలుము చచ్చితినని దలంచితివా? చిరంజీవియగు'మని "విష్ణువిచ్చిన వరముగలదు" అని పలుమారులు ధిక్కరించుచు నొక్క కఠోరమగు బాణమును రాజపుత్రునియురము నాటనేసె. నొప్పికలిగినప్పుడు రోషము గాక మఱేమి తోఁపఁగలదు? దానికా రాజపుత్రుఁడు మూర్ఛితుఁడై నేలపై నొరగె. చాలకాలమునుండి యలసినవాఁడగుటచేతను బాలుండగుటచేతను చూచువారల కది మృతియని భ్రమ జెందించుచుండె. దీనినిచూడఁగనె యీప్రకరణారంభమున వర్ణింపఁబడిన యువతి తత్తఱపడుచు రాజపుత్రునిఁ జేరవచ్చి "పుత్రా! వసువులంత వారికిఁ దల్లినయ్యు వారలలో నొక్కని నిన్ను స్థిరముగా భూమియందు నుందువని వరమునందియు "నానామము ప్రసిద్ధమవును గదా!" యని పెద్దనమ్మకము కలిగియున్నందు

కిప్పు డీయంబమూలంబున నీక్షత్రియాంతకునిచేతఁ గోల్పోవల
సివచ్చెఁగదా హా! దైవవిధి కేమి సేయవచ్చు? నేను మనుష్యస్త్రీ
నై పడిన శ్రమలకెల్ల ఫలంబై నీ వుందువనుకొన్నందుల కాయా
స నిష్ఫలంబయ్యె

అని యిట్లు బహువిధముల పలవరించుచుండ నించుకసేపటి
కారాజపుత్రుఁడు యమునానదీ జలశీకరంబులం దెచ్చి పైఁజల్లుచు
మందపవనుండు మేల్కొలుప కనువిచ్చి చెంతనున్న తల్లింగని
'జననీ! భాగీరథీ! మీరాక నాకు శుభంబును గూర్చు; సంశయము
లేదు' అని పలికి సన్నాహమును సవరించుకొని రథముపై కేఁగె;
గంగయు నారథ్యము నొనర్ప నారంభించె. అపు డా రాజపురు
షుఁడొక దివ్యాస్త్రంబు ధనువున సంధించి 'ఆచార్యా! ఇదె సమ్మో
హనాస్త్రము వచ్చుచున్నది' అనునంతకు దూరమునుండి 'వలదు
వలదు, వత్సా! సాహసము వలదు' అనునొక యెలుఁగు ఆకస
మునుండి వినంబడియె.

అది యేమియైయుండునని యాధ్వని వైపునకు మరలి
చూచునప్పటికి నేడ్వురు సమానవయస్కు లగువిప్రులును
కొందఱు ఋషులును శీఘ్రంబున నీ యుద్ధభూమి వైపునకు వచ్చిరి;
గంగ వారి నేడ్వురను చూడఁగానే 'పుత్రులారా! మిమ్మిందఱ నొ
క్కమాఱు చూడఁగలిగె. కన్నులు చల్లనయ్యె' నని తన సం
తోషమును వెలిపుచ్చె.

ఆ విప్రులును రాజపుత్రునివైపు చూచి 'సహోదరా! గురుని
పై క్రౌర్యము మానుము; క్రోధ ముపసంహరింపుము; దేవతలలో
నొక తెగవారమైన మన మిట్లు రోషాదులచే ధైర్యమును చెఱు
చుకొనవచ్చునా? అభిలాషవలన నేకదా మన మందఱము దేవ

లోక సౌఖ్యములకు వెలియై మనుష్యజన్మ మెత్తవలసివచ్చినది.

ఈమాట వినఁగానే రాజపుత్త్రుఁ డించుక లజ్జించి తలవాంచి కొంతసేపు మనంబున నేదియో యోచించి తుద కిట్లనియె; 'ఆశర వేదన నన్నింతచేసె; దాని నిలుపుకొన నేరనయితిని.

విప్రులు—'వత్సా ! ఎంతధీరులకైనను నొక్కొకవేళ మనంబు కలఁగుట సాధారణము: దానికి వెఱవకుము; అట్లయినను మనుష్యత్వమేకదా? దేవత్వమొందిన మేమునయితము భార్గవునియందలి రోషముచే నీకు జయము గలిగింప వలయునని యేకదా దైవమగు సమ్మోహనాస్త్రముపదేశించితిమి; ఇఁక నాచార్యుని క్షమాపణము వేఁడుము' అనిన భీష్ముఁడు భార్గవునకు నమస్కరించె.

మునులు—'భార్గవా! మహాత్మా! విప్రులము, శాంతిప్రధానులము; మనకు నేల యింత ఘోరమగు రోషము? దురాత్ములగురాజుల పెక్కండ్ర వధించి ధరణీభారము మాన్పితివి; మేలయ్యె; వినయవంతుఁడును ధర్మాత్ముఁడునగు శిష్యుని యందు క్రౌర్య మూనఁదగదు. బాగుగ విమర్శింపుఁడు; ఈతనియం దించుకయయిన నపరాధము లేదు. కన్నియ మనంబు పరీక్షించి వారి కెట్టిబాధయుఁ గలుగకుండు నట్లుగా వారి కోర్కులఁ దీర్పవలయుగదా'యని యందురేమో ! ఎల్లపుడు విడువకనుండునట్టి చెలులకు సహితము తెలియుట కసాధ్యమైన ముగ్ధల యభిప్రాయము లక్షణపరిచితుం డగుపురుషునకు శక్యమగునా? కావున నీయపరాధము కాశిరాజుయందును సాల్వునియందును సంక్రమించుచున్నది. తన తనయల కెవ్వనియందు కూర్మి

కలదో విచారించి దాని కనుకూలముగ నొనర్చుట తండ్రి పనికదా? అట్లొనర్పక స్వయంవరము చాటించుట వాని తప్పు; కన్నియ తనయొద్దకు చేరినపు డామె నిష్కల్మష యని యెఱింగియు భీష్మునిపై నున్న యీసు నామెపై నూపుట సాల్వునితప్పు; కావున నిదే నమస్కరించున్న వాఁడను; ఆదరింపుఁడు.

అను మునివాక్యములకు రోషము వహించికొని యా జటాధారి నమస్కరించుచున్న రాజపుత్రుని చేఁదీసికొని 'భీష్మా! నీకు సాటి యెవ్వరు? రోషావేశంబున నొనర్పఁబడు ఘోరకృత్యముల మదిఁదలం పనము; నీయట్టివాని శిష్యునిఁగాఁ బడయుటచే నాకు నాచంద్రార్కమగు ప్రసిద్ధిగలిగె; చిత్తవిక్షేపమును కలిగించు నీశరచాపంబుల నేఁడుతునక నిదె సన్న్యసించుచున్నవాఁడ; ఆహా! ప్రతిజ్ఞా పూరణంబున నీకగదా యుండవలయును; కామాదిజనకంబులగు నెన్నివస్తువులు సమీపమందున్నను మనస్సు నించుకయైన చలింపనీక ధైర్యంబున నిగ్రహించుట సుకరమా? మఱి యౌవన దశయందు నిట్టి ప్రతిజ్ఞను దృఢమగు పూన్కితో నిర్వహింపఁగలవారు నీకంటె నితరులుండఁగలరా? బాహ్యశత్రువులు పుట్టుటకు హేతువు లగు కామక్రోధాదుల వేగము నడంచుటకు ధైర్యమనెడి కవచమును నిష్కపటబుద్ధితో భగవంతుఁ డందఱకు నొసంగియే యున్నాఁడు. అయిన నేమి? దానిని మూలవేయక చక్కఁగ నుపయోగించుకొన నేరవలయునుగదా. అని అంబవైపుఁజూచి 'అంబా! నీరక్షణము పురుష ప్రయత్నము నతిక్రమించినది. నీకై యీనిర్దోషియందు లేని యపరాధమును సహితము కల్పింప సాహసించితిని. పురంబునకు చేరిన

పిదప వచించినదానవు. స్వయంవరసమయము నందె నీవృత్తాంతమును జెప్పియుండిన నింత కలిగియుండదుగదా? సాల్వుని దుష్టబుద్ధిని శాసించుటకు నీకెప్పటికిని సమ్మతి లేకున్నది. ఇంక నెవ్వరు సేయునది యేమి లేదు. స్వయంకృతాపరాధము ననుభవింప వలసినదే యనెను.

ఈ మాట వినఁగానే యంబచిత్తమున నున్న కామలజ్జాశోకాది పరస్పర విరుద్ధగుణము లెల్ల నేకాకారములై క్రోధముగాఁ బరిణమించె; ఆమె మొదలు కొంతవడి నిశ్చలమైయుండి, చంద్రునిఁ బోలు నామె మొగంబున రక్తచ్ఛాయ యాక్రమించె. అంత నతిగంభీరంబుగ నిట్లు మాటలాడఁ దొడంగె

'శరణాగతుల రక్షింపఁగల పెద్దలని చేరినందుల కిట్లయ్యె; ధర్మోపదేష్టలారా! ఈయన యెడ నపరాధము లేదని యుపన్యసించితిరి. స్వయంవరమున కాంతలఁ బలిమిం దెచ్చుట యెట్టి ధర్మమో యించుక పరిశీలింపుఁడు? ఎవ రెటులు చేసిన నేమి? నేను పుట్టినది రాచకులము. మఱుజన్మమునందైన నితనిపై నీసుదీర్చుకొన లేకపోవుదునా? తపము, తపము, తపము గలదు! ఎవ రెట్లు చేసిన నది తన యాశ్రితుల విడనాడదు' అని చెప్పి వెడలిపోయె మిగిలినవారును వారివారి యునికిపట్టులకుఁ జనిరి.

ఎట్టివారికైనను సర్వధర్మములును కాలానుగుణముగ నర్థమగుచుండును. ఈయంబకు రోషసమయమున స్వయంవరము నందలి దోషములు రాక్షస వివాహము నం దారోపితములై తోఁచెఁగదా?

ఇది యేకాదశప్రకరణము.

## ద్వాదశ ప్రకరణము.

మత్తేభ మాలిక.

మది నిస్సంశయమైన నిశ్చయముతో
భావించు నెద్దాని న
య్యది సిద్ధంబగు నిట్టి నిశ్చయము యో
గాభ్యాసులందైన ని
ల్వదు కాకున్నను యోగమన్న నఖిల
ప్రాప్యంబుగా దిన్నియున్
మది సామాన్యుల యిష్టలాభములఁ బ్ర
త్యూహంబు లౌ వెండియు
న్నది యీ మర్త్యమెటులుంగిలే సెట్లఁగి క
ర్తల్ సల్పుచున్ నేర్పు ని
త్యదిరంబయి ఫలసిద్ధిఁ బొందుటకుఁ దా
నెవ్వంగఁ బోదట్లు గా
న దయాళుండగు వేదవ్యాసుఁడు నా
నామాత్ర గీతాదులన్
సుస్పష్టార్థముగఁ జేసి మానవులకా
త్యుత్కృష్టంబుమై వానిలో
మొదలం జేయఁగ సద్వాసనల్ ని
ర్త్రించెన్ మనల బుబ్బఁగన్.

ప్రతియును బ్రతుకునంత కాలము నిలుపుకొనఁగలఁడో లేఁడో యని మనస్సు పరీక్షించుటకై దైవముచే సృజింపఁబడెనో యన నేతెంచిన క్షత్రియాంతకుండగు పరశురాముని బారినుండి ధైర్యకవచ సహాయంబుచే మన కథానాయకునిఁ దప్పించి స్వస్థునిఁ

జేసితిమి. ఆతని తమ్మునికిని భూసతితోఁ గూడ నిరువురు భార్యలం గూర్చితిమి. ఇప్పటికి హస్తినాపుర రాజ్యమించుక నెమ్మదిపడినది. ఇఁక పాంచాలదేశము వైపు కొంతదృష్టి సారింతము.

2. ఈ పాంచాలదేశమునకు నిపుడు పంజాబు అని పేరు. ఇది వైశాల్యమున తక్కినరాజ్యముల కంటె నంత పెద్దది కాకపోయినను సారంబున నన్నిటికంటె ననేకతరము లధికమైయున్నది. ఐదు నదులు పాఱుచుండుటచే దీనియందలి భూమి గోప్పాదమంతైన నమరకము కానిది లేక ముక్కారులు పండుచుండును. ఈ నదులు గంగాది నదులంత పెద్దవి గాకపోయినను. హిమవత్పర్వతమునుండి వచ్చునవియగుటచే మండు వేసవియందు సహితము దగులుమీఱక ప్రవహించుచు భూమిని సారవంతము కలదిగాఁ జేయఁ జాలియుండును.

3. భూలోక నందనోద్యానమగు భరతవర్షంబున విహారార్థము నిర్మింపఁబడిన రత్నసౌధమువలెనున్న యీ పాంచాలమున కిందలి పురుషులెల్ల నాధారస్తంభములై యుందురు. వీరినిఁ గదల్చుట యెట్టివారికైన నసాధ్యమైయుండెను. ఈ దేశము శీతోష్ణస్థితియె వీరల కిట్టి దేహ బలంబుల నొసంగెననుటకు సంశయములేదు. శీతోష్ణ భేదములచేతనే కదా సర్వవస్తువులకును బలాబలంబు లేర్పడుచుండును.

4. ఆ దేశమును ద్రుపదుఁడను రాజు పాలించుచుండెను ఆరాజు కర పాదాదులచేతనే కాక తన పాలించు జనులచేతను గూడ శరీరవంతుఁడనఁ దగియుండెను. అతని మంత్రి తనబుద్ధిశక్తిచే నిఖిల రాజుల మిత్రులఁ గావించుకొనియు రాజకులమువారు సహజముగా కపటమిత్రులగుటచే వారల రాజ్యములోనికిఁ గూడ చారుల

నంపి యెప్పటి వృత్తాంత మపుడు విచారించుకొనుచును వారివలన తన కేమియు నపాయము కలుగకుండ వేయు కన్నుల తన రాజ్యమును కాపాడుకొనుచుండెను. ఆ దేశము ధనవంతమయినదగుటచేత నారాజునకు భోగములనుగుఱించి కొఱఁత లేదని వేఱుగాఁ జెప్ప నక్కఱలేదు గదా?

5. అయినను నొక్క కొఱఁతమాత్ర మా రాజును విడిచినది కాదు. ఆ కొఱఁతయే సుఖానుభవసమయమునందెల్ల ఆయన మనస్సును తపింపఁజేయుచుండెను. సామాన్యముగ నన్ని కాలములయందొక్కటేరీతిగ నా మనస్తాపముండెనని చెప్పుటకు వీలు లేకుండినను స్వారి వెడలుట మొదలగు సమయములందు మార్గమధ్యమునందో నెచ్చటనైనను పిచ్చియు రానిమాటలు మాట్లాడుచు నిష్టమువచ్చినట్లెల్ల సంచరించుచు ననేక భంగుల నాడుకొనుచు వెంటనుండి చూచుచున్న జననీజనకుల సంతోషామృతము నొందఁజేయుచున్న శిశువుఁగాంచుట తటస్థించెనేని యా రాజు మొగము చిన్నఁబోవుచు నప్పటియుత్సాహమెల్ల నష్టమగుచుండెను. ఆరాజు మొగము చిన్నఁబోయినపుడెల్ల నేకశరీరమందున్న వియునుంబోలె ప్రక్కనున్న వారి ముఖములు సహితము కాంతిహీనములగుచుండెను. కాలక్రమమున సుఖభోగములయం దనురాగమును తొలంగించుచు అసూయను కలిగించుచు తుదకు వైరాగ్యమును సహితము పొందించుచు వృద్ధినొందుచుండెను; కొఱఁతలు దీరుటయెన్నటికి.

6 ఈ కొఱఁత పుత్రులవిషయమైనదని చదువరు లెఱింగియే యుండవచ్చును. తన వంశమువారికి రాజ్యము లేకపోవుననియు తన బంధువులకెల్ల దానిచే శ్రమకలుగుననియుఁ గాదు,

బహుకాలమునుండియు తమపై నతిశయానురాగములు కలిగి తమ యనురాగమునకు పాత్రములై యేక కుటుంబస్థులవలె నున్న తమ ప్రజలకు తన తరువాత నెట్టిపాట్లు గలుగనున్నవియో యను శంకయె యీ సంతాపమునకు ముఖ్యకారణమైయుండె; క్రొత్తగా వచ్చు రాజునందు ప్రజల మనంబుల కనురాగము జనించునా? ఆ రాజు క్రూరుడయ్యెనేని చెప్పవలసినదే లేదు. ఒక వంశమువారే రాజులగుచు వచ్చినచో ననాదినుండియు ప్రజలయం దనురాగబీజము వృద్ధినొందుచుండుటచే యెప్పటిప్పటికి రాజు క్రూరుడయినప్పటికి నయ్యనురాగ మహావృక్షము తక్షణమే విఱుగ నేరదు.

7. ఏహేతు వెట్లుండినను సంకల్పసిద్ధిమాత్రము కేవలము దైవాధీనమైయే యుండెను. దైవాధీనమునగా వ్రతజపములచే దైవానుగ్రహమును సంపాదించుకొని దానిసహాయముచేత సంకల్పమును సిద్ధినొందించుకొనుట యని యెల్లరు నెఱింగినదియే; ఇట నొక్క విషయమునుగూర్చి యించుక విచారింపవలసియున్నది. వ్రతములచేతను, మంత్రములచేతను కోర్కెలు సిద్ధించుట కవకాశముకలదా లేదా యనునది విచారింపవలసిన విషయమే గదా !

8. ఈ విషయములలో ననేకు లనేకవిధములఁ జెప్పుచున్నారు; మంత్రములకు మాటలకును భేదమేమున్నది? కావున వీనివలన సంకల్పములు సిద్ధింపవు. అయినను పురుషప్రయత్నమువలన కార్యములు సిద్ధించునప్పటికి మంత్రజపము పూర్తియగు సమయముకూడ నొకటియై సమకూడినది కాక యన్యాయముగా తమ కార్యసిద్ధి యా మంత్రమువలననే అయినదని తలంచి నిరుప

యోగమగు నమ్మకము పెట్టుకొనుచున్నారని కొందఱ యభిప్రాయము. మఱికొందఱు పూర్వపువారీవిషయమున అతిశ్రద్ధతో పాటుపడిరి; మన కట్టి శ్రద్ధలేకపోవుటచే నిప్పుడు సిద్ధింపకున్నను మంత్రాదులయందు శక్తి లేదనుట సరికాదందురు. వీరివాదములనెల్ల ఖండించుట యిచ్చట ననవసరము. ఇకపై ప్రకటింపఁబడఁబోవు ధర్మశాస్త్రార్థసంగ్రహము మొదలయిన గ్రంథములలో నీ విచారణ సమగ్రముగ నొనర్తుము.

9. ప్రస్తుతము సందర్భము గలిగెను గాన వ్రతాదులకు సంకల్పసిద్ధి కలుగఁజేయునట్టి శక్తి కలదనుటకు సంగ్రహముగా నొకటిరెండు యుక్తులను మాత్రము చూపఁదలఁచినాఁడను. ఈ విషయమై తెలిసికొనునప్పుడు మొదట మనఃశక్తిఁగూర్చి యించుక తెలిసికొనవలయును.

10. భగవంతునిచే మనుష్యులందఱు నొక్కరీతిగ సృజింపఁబడిరి కాని కొందఱు మిత్రులుగను కొందఱు శత్రులుగను సృజింపఁబడలేదు కదా? అయినను లోకమునందు హితము సేయువాఁడెల్ల మిత్రుఁడును అట్లుకానివాఁడెల్ల శత్రువుగను అగుచున్నాఁడు. మిత్రుఁడై యుండియు నొక్క కారణమున క్షణమాత్రమున శత్రుఁడగుటయు కలదు. ఇట్లు పరస్పరవిరుద్ధములగు మిత్రత్వ శత్రుత్వము లొకనియందుఁ దోఁచుటకు కారణము విచారింపుఁడు.

11. ఇదియునుగాక మిత్రుఁడైయున్నపుడు చేదయిన నపరాధము చేసినను అవి సామాన్యముగా నగత్యాలికై యొనర్చెనని యును కొంచెము అధికమైన తెలియక చేసిరనియును మఱికొంత యతిశయించిన పొరఁబాటు లనియును నంతకంటె నెక్కు-

డయిన బుద్ధిపూర్వకముగఁ జేసినవి కావనియును, ఇంతకంటె మించిన హితోపదేశపూర్వకముగ క్షమింపఁ దగినవనియును తలంపఁబడుచుండును. వానినే శత్రువు లొనర్చి రేని గొప్పదోషములని తలంతురు. ఇది సామాన్యముగా ననుభవసిద్ధమే కదా? ఇఁక విమర్శింతము. తప్పనఁగా నెవరుచేసినను తప్పేకదా ? అది కొన్ని సమయములందు మనఃస్ఫూర్తిగ క్షమింపఁబడుటయు, మఱికొన్ని సమయములయందు ద్వేషింపఁ బడుటయునను వీనికి కారణమేమి ?

12. మిత్రుఁ డయినప్పుడు వీఁడు నాకు మిత్రుఁడనియు శత్రుఁడయినప్పుడు నాకు శత్రువనియు తలంపులయందు మాత్రము భేద మగపడుచున్నది. ఇంతియెకాని మనుష్యునియందుఁగాని వాఁడుచేయు నపరాధాదులయందుఁ గాని మార్పు ఏమియు లేదుకదా? కావున దీనిచే సంకల్పమే యిట్టి భేదములకు కారణమని నిశ్చయ మేర్పడినది. శక్తిగలవారు తమ దృఢసంకల్పములచే జగమునెల్ల వారి యిచ్ఛవచ్చినట్లు మార్పఁ గలుగుదురని వేఱుగాఁ జెప్ప నక్కఱ లేదు గదా ?

13. అది యట్లుండె. మనసు దాని యిచ్ఛవచ్చినట్లు మెలఁగుచున్నదికాని ప్రయత్నము లేకయే నొకరికి లోఁబడదు. అది తనకు భయము మొదలగు నాకస్మిక వేగములు సోఁకినప్పు డప్పటి విషయములఁ గూర్చి స్థిరముగా సంకల్పించును. ఒక మనుష్యుఁ డర్ధరాత్రమున నొకవిశాలస్తంభమునుజూచి చోరుఁడనితలంచి భయపడెనేని యా భయమువలన వాని సంకల్ప మంతకంతకు స్థిరపడి వాఁడు చూచు స్తంభమునం దవయవములను గూడ కనఁబడునట్లు జేయునుకదా?ఇట్టి సామర్థ్యముగల మనస్సు లోఁబడియుం

షీన నెట్టి కార్యములైనను సిద్ధించుననుట మఱియొకమాఱు చెప్ప నక్కఱలేదు. దీనిని లోఁబఱుచుకొనుటకై సమర్థులు యోగాభ్యాసము నొనర్చుచుందురు; ఆ యోగాభ్యాసము సర్వజనులకు సాధ్యము కాదని వేదపురుషుఁడు వ్రతజపాదుల మనస్సునకు కట్టు స్తంభములుగా నియమించియున్నాఁడు. ఈ జపమువలన ఈ కార్యము సిద్ధియగునని నమ్మకము కుదురుటయె మనసు స్థిరమగుట; మనోనిశ్చయము కలిగిన సంకల్పసిద్ధి నిశ్చయమని యిదివఱకే చెప్పఁబడెనుగదా? మనఃశక్తివలననే కోరిక సిద్ధించునుగాని వ్రతాదులవలన కాదని యెఱింగిన ప్రయోజనము లేకపోవుటయే కాక విశేష నష్టముకూడ గలదు. అట్లెఱింగినమాత్రమున మనస్సు స్వాధీనమును గాదు; వ్రతాదులయందు పూర్వమువలె నమ్మకము కలిగి కార్యములును సమకూర్పదు. ఇదియె మతధర్మములకెల్ల హేతువుల నెఱిఁగింపకుండుటకు కారణము.

14. ఇఁక నీ విషయమును జగత్తత్వమునకై విడిచి కథాసందర్భము నుపక్రమింతము. అంత నా రాజొక్కనాఁడు తన పురోహితుని రావించి యేకాంతంబున నిట్లనియె.

ఆచార్యా! సంతానహీనమగు భోగసమృద్ధితో ప్రయోజనమేమి?
నా మనస్సునందలి కొఱంత తీరునట్టి మార్గమెయ్యది?
సర్వజ్ఞులు మీరెఱుంగరాని దెద్దియు నుండదు గదా.

పురోహితుఁడు. పుత్రకామేష్టి యనుపేర సంతానము కలిగించు నట్టి యాగమొకటిగలదు; దానిచేతనేకదా పూర్వమున దశరథాదులు మహాభాగ్యవంతులగు పుత్రులఁబడసిరి. నీవును దాని నొనర్పుము. యాగాదులకు శుభకాలంబగు వసంతముగూడ సమీపించుచున్నది; వలసినవెల్ల

నాలస్యములేక సమకూరుటయుఁగూడ కార్యసిద్ధికి సూచకమే కదా?

15. ఈ వాక్యమును వినఁగానే రాజునకు కలిగిన యానందమునకు మితియే లేదు, తత్క్షణమే తగిన భృత్యులనియమించి యజ్ఞశాలాదికమును నిర్మింప నియోగించెను. అంత భూమియందెల్లెడలఁ గప్పుచుండిన శీతమారుతములు మెల్ల మెల్ల నడంగఁ దొడంగెను. వృక్షంబులెల్లను తమ్ము పాలించు సూర్యుని యభివృద్ధికి సంతసించినవియుంబోలె నూతనపల్లవంబులచే నలంకరించుకొన నారంభించెను. పక్షులెల్లను మంచునకు వ్రేలవైచిన తలల పైకెత్తనారంభించెను. సకలజంతువుల హృదయంబులును నొక క్రొత్త యుత్సాహంబుతోఁ పూరితంబు లగుచుండెను.

16. యజ్ఞముహూర్తమును సమీపించెను. సర్వసంభారంబులును సమకూర్పఁబడెను. రాణిమాత్రము మీవృత్తాంత మెఱింగినది, మొదలు లోలోన నేమేమియో విచారించుకొనుచు రాజసన్నిధియందుమాత్రము తన చిత్తమునఁ గల వికారము నించుకయైనఁ దోఁపనీయకుండెను. యజ్ఞముహూర్తము సమీపించుకొలది నామె యాలోచన యతిశయించుచు తుదకు ముహూర్తమునకు రెండు దినములున్నంతఁగా నొక విధమున నిశ్చయించి మందారిక యను చెలికత్తెను బిలిచి యేమేమియో చెప్పి పురోహితుని యింటికంపెను.

17. అంత సుముహూర్తదినము రాఁగానే యా రాజు సతీసహితుండై సంపదకుమాత్రమేకాక యప్పటి యుత్సాహంబునకుఁగూడ సరియైన వైభవముతో యజ్ఞశాల ప్రవేశించెను. అంత నచ్చట ఋత్విక్కులందఱును వేదవాక్యముల పఠించుచు

సన్నిలో వేల్వసాగిరి. సభాసీను లగుబుధులును పండితులు నతి శ్రద్ధతో గమనించుచు క్రియలయందు లోప మేమియు జరుగ కుండఁ జూచుకొనుచుండిరి. అంత కొంత సేపటికి రాణిగారి దృష్టి సవిశేషముగా పురోహితునియందు ప్రసరించుటయు నాయన ఋత్విజులవైపు సైగ చేయుటయు వారొకరిమొగ మొకరు చూచుకొని మంత్రవాక్యముల భేదము సేయ నారంభించిరి. రాజు దాని నెఱుంగఁగలవాఁడె. అయినను అప్పుడు మనస్సునందున్న అతిహర్షభారముచే దానిని గమనింపకుండె. సభలోనివారలు తమలో గుజగుజలాడుచు నూరకుండిరి.

18. ఇట్లు యజ్ఞము పూర్తినొందఁగానె రాజు వివిధములగు సంభావనలచే సభ్యుల గౌరవించెను. రాణిగారి కనుసంజ్ఞచే సంతకు మున్న మందారిక యంతఃపురమునకుఁబోయెను. ఆదాసి పోవుట చూడఁగానే ఋత్విక్కుల మనస్సులు సంతోషభరితము లయ్యెను. ఇంతయేల? రాజిచ్చు నమూల్యవస్తువులుసహితము వారికి సంతోషము మొందించు నొక టెక్కుగా నుండకుండె. ఈ సంతోష కారణమును వెనుకటి ప్రకరణములో నెఱుంగనచ్చు.

19. పిదప ఫలమునకుఁగూడ నాలస్యము కలుగలేదు. రాజపత్నికి శీఘ్రకాలముననే గర్భచిహ్నము లారంభమాయెను. వానిని జూచినప్పు డందఱకును సంతోష మతిశయించెనుగాని రాణిగారికిఁ గలిగిన సంతోషముఁ దక్క తక్కినవారి సంతోషములు అన్నియు ఫలము ననుసరించినవి కాకుండెను.

ఇది ద్వాదశప్రకరణము.

## త్రయోదశ ప్రకరణ

తే. శక్తి కలుఁగుట కాత్మ రక్షణమె తోడవు
వివిధ గుణముల కెల్లను వినయ గరిమ
ప్రజ్ఞకును లోకరక్షణ భంగు లాప్త
ధనమునకుఁ దోడ వగుఁ బాత్ర దాన మవని.

'తలంచుకొనుకొలఁది నాలో నాకే చిత్రమగుచున్నది. రాజు మనోరథంబు సమకూర్పుటకు దృఢముగ నిశ్చయించియు సంతలోనే మార్పు కలుగవలయునా? బ్రాహ్మణోత్తముఁడఁట! ఎవరయిన నేమి? ధనాశ పురుషుల నాడించు జంత్రముగదా? ఆమెకు మాత్రము తెలియని దేమున్నది? రాజు వెనుక రాజ్యాధికారి యగువాఁడు లేఁడనిగదా చాలఁగాలమునుండి చింతించుచుండుట; ఇంతలో పుత్రికపై మనస్సు నేల మారె? ఇవియెల్ల నంతయాశ్చర్యములు కావు గాని కన్నియకు మఱియొక కన్నియనిచ్చి వివాహము సేయుట నెచటనైన వింటిమె. అవును; ఏమి సేయుదురు? ప్రజల సంతసమునకు భంగము రాకుండ పుత్రుఁడని రాజ్యమునందెల్ల చాటించిరి. ఇఁక రాజపుత్రునకు వివాహము సేయకున్న నపకీర్తికదా యని నిట్టూర్పు విడిచి మఱియొకరి నేల యనవలయు? నా దురదృష్టమును నేనే నిందించుకొనదఁగాక; దైవమా! ఇట్టి చిత్రముల మున్నెన్నఁడైన రచించియుంటివే? కాదు కాదు; ఇదియే ప్రథమప్రయత్నమని తలంచెద; ఒకపని చేయువారి నేర్పెల్లను ప్రథమప్రయత్నమునందే కదా విశదమగును'

అని యిట్లు తలఁచి తలఁచి, అట్టివారి కిట్టి యవివేకము కడచి యిట్లొంటిగ యరణ్యములపాలు కావలసెఁగదా యని శోకిం

చుచు సుఖహీనమయిన యిట్టి నిరర్థక జీవనమును నా కొక్కతెకే కాక మఱియొక కన్నియకుఁగూడ దైవము విధించెకదా యని వగచెందుచు ముల్లోకంబులందును ధర్మాత్ముండని ప్రసిద్ధిఁగాంచిన జనకునకు నీ దురదృష్టురాలివలనఁగదా మోసగాఁడనునపకీర్తి కలుగవలసివచ్చెనని యడలుచు ప్రాణమిత్రు లగువారలకు కల నైనఁ దలంపఁబడని యిట్టిబలవద్విరోధము నానిమిత్తమునం గదా యని కుందుచు నిఁక దీనికై చేయవలసిన దేమియు కానరా లేదు. ఇదె యరణ్యామధ్యమును బ్రవేశించితినిగదా కందమూ లాదికము లుండు నొకచోటుఁ జూచుకొని నిలిచెదఁగాక. ముని వృత్తికంటె యిట్టిసమయమునందు శరణము మఱియేది?

అనుచు నతిశ్రమచే నడుగిడ నేరకయు నెట్లో యొకయట్ల రణ్యామధ్యంబున నడచుచున్న పాటసారి కాకసమునుండి కుమారీ 'తపము పూర్వజన్మముతోనే ముగిసినది! కోర్కె ఫలించినపిదపఁగూడ వృథగా నీ సుకుమారశరీరమును తపముచేఁ గృశింపఁజేయ నేటికి? ఇది మునిజన్మముగాదు శూరజన్మము' అనునట్టి యొక వాక్యము వినఁబడియె. ఆమాట వినఁగానే మనస్సునందలి వికారములెల్ల నొక్కమాఱుగ నాశ్చర్యముగా పరిణమించెను. ఆవాక్యములఁ జెప్పినవార లెవ్వరని నలుదెసలు పరికించెనుగాని యందొక్కరైనం గానరారైరి. దానిచే నవి యశరీరవాక్కులని యెఱింగి చేతులు జోడించి 'ఓ యశరీరవాణీ! నాపై కరుణించి జరుగఁబోవుదాని నెఱింగించితివి. అట్లే నేను ప్రకృతము చేయవలసినదాని నెఱింగించిన కృతార్థురాల నయ్యెద' అని పెక్కుభంగుల వేడుకొనెనుగాని అందుల కేమియు ప్రత్యుత్తరము రాలేదు.

కావున నామె మనస్సున నిదివర కించుక సంతసము కలిగియున్నను మరల నదియెల్ల శోకముగానే మాఱవలసివచ్చె. ఇది శూరజన్మమనియె నే! యువతులేమి శౌర్యమును జూపఁ గలరు? అట్లు చూపఁగలిగితి నేని నేనిట్లేల పరుగెత్తివత్తును? పూర్వ జన్మమునందుఁ గూడఁ దపమొనర్చితినఁట; అపుడుగూఁడ నిట్టి గతియె సంభవించియుండెనేమొ! హా దైవమా! తరుణులా! నీ క్రౌర్యమును సహించువారలున అని యనేకవిధములగు తలఁపు లామె మనంబునఁ బుట్టనారంభించె.

ఎట్లయినను తాను చేయవలసిన కార్య మేమియును మనసునకు తోఁపలేదు. ఇంతియెకాక దూరమందుండి నడచివచ్చిన యాయాసమును దీర్చుకొనుటకై కొంచెముసేపు విశ్రమింతమని యే ప్రక్కఁజూచినను సూదులవలె నున్న ముండ్లతోఁగూడిన చెట్లును రాలునుదప్ప వేరొండుగానరాలేదు. రాజునకుఁ బుట్టియు పుట్టని మొద లమితైశ్వర్యముల ననుభవించుచుండియు మన బాటసారి నేఁడిట్టి దురవస్థపాలయ్యె.

దైవము సంకల్పించిన నెట్లయిన శుభమును గూర్పవచ్చును. మన బాటసారి నిట్టి కష్టదశలో విడిచి దైవము విషయమును విచారించిన చదువరుల కించుక యసూయ కలుగునని యిట నావిచారమును విరంచుచున్నాను. వలయువారు దానిని ప్రకటింపఁబడబోవు నుత్సాహశక్తియను నవలలో చూచుకొనునది.

అట్లు తన దుఃఖమును దీర్చుకొనుటకు నడుగుపెట్టునప్పుడెల్ల నాటుకొను ముండ్లకును ఊపిరి ద్రిప్పుకొనుటకుఁ గూడ నెడమీయని యాయాసమును గూడ లక్ష్యముసేయక తపమె శరణమని నిశ్చయింప దానికి తగిన స్థలమును వెదకికొనుటకై ముం

దుకుఁ జనుచుండ నెదుట భయంకరములగు పొదలకు మాఱుగా సింహశార్దూలాదిమృగముల వికారధ్వనులకు వ్యతిరేకముగ నొక్క దివ్యభవనంబును దానినుండి యొక మనోహరంబగు వీణాగానంబును నేత్రశ్రోత్రంబుల కొక్కమాఱు గోచరంబయ్యె.

ఆగృహమును చూడఁగనె మన బాటసారి తన మార్గాయాసము సగము తీఱినట్లు యాభవనము ముందటి చలువరాతి తిన్నెపై కూర్చుండె. కొంతవఱకా భవన సౌందర్యమును, గాన మాధుర్యంబును మనంబున కింపుగలిగించుచుండెనుగాని, తుట్టతుదకు "చెడుకాలంబున నమృతమైనను విషమగును" అను మాట యనుభవంబునకు వచ్చె. తన తాపమునెల్ల చల్లార్చి మనస్సున కంచుక శాంతిఁగలిగించునని చేరఁబోవఁగా నాగృహ సౌందర్యంబును గాన మాధుర్యంబును మనంబునందలి శోకాగ్నిని మఱింత రగులుకొనఁజేయ నారంభించె; ఆమె మొగము వెల్లనై యంతకంతకు మఱింత కాంతిహీనంబగుచుండె. ఆమె కన్నులనుండి వెచ్చని కన్నీరు జాఱ నారంభించె. అవును; అనుభవించిన గొప్పదశ కష్టకాలంబున స్మరణకు వచ్చెనేని మనస్సు నెంతఁ జేయజాలదు. స్త్రీల హృదయంబును సహజ సుకుమారంబుగదా?

ఇట్లుండ కొంతసేపటికి గానము వినరాదయ్యె. మనస్సున నేమేమో తలపోయుచు మన మిఁక చేయవలసిన కార్యమెద్దియని చింతించుచుండ నొక్క దివ్యపురుషుండు ఆగృహంబునుండి వెలువడి వేదికపైనున్న కన్నియఁ జూచుచు "ఇట్లేకన్నియ యొంటిగ నీయరణ్యమధ్యమున కెట్లువచ్చె? ఈమె మొగంబు

దుఃఖాతిశయంబును సూచించుచున్నది. ఇట్లు దుఃఖము కలుగుటకేమికారణంబై యుండునో విచారించి చూచెద" నని తలంచి యిట్లనియె. ప్రతివిషయమునందును మహాత్ములైనను తమ దివ్యదృష్టి నుపయోగింపరుకదా.

పురుషుఁడు.—కన్యారత్నమా! నీ వెవరిదానవు? ఇట్టి దుఃఖమునకు కారణమేమి?

ఈమాట వినఁగానే రాజపుత్రి తలయెత్తి యతనిఁజూచుటకుఁగాని చూడకుండుటకుఁగాని నిశ్చయింపనేరక "ఈతఁడెవ్వఁడగును? మర్త్యుల బాధించుటకై కపటమున నిట్టి గృహాదులను నిర్మించిన రాక్షసుఁడవునేమో! లేకున్న నీ యరణ్యమధ్యమున నిట్టి గృహ ముండుటకు కారణ మేమైయుండును? వీనితో మాట్లాడుట పాటిగాదు. వీనిని జూచినఁగదా నేవిషయమైనఁ దెలియవచ్చును. వలలో చిక్కినపిదప నెట్లయినను తప్పించుకొనునది లేదు. కానిమ్ము. వీని యాకారమును పరికించెద"నని కడకంటితో చూచి, "ఆ! తెలిసినది. వీని ఱెప్పలు మూఁతపడుట లేదు; కావున వీఁడు దేవజాతిలోనివాఁడై యుండవలయు'

అని యిట్లు వితర్కించుచున్న నప్పటికి ఆపురుషుండు "ఈ కన్నియకు శోక మతిశయముగ నున్నది. నేనే దివ్యదృష్టిచే దీని కారణము నెఱింగి యోపినకొలఁది నుపకారము చేయుదును గాక" అని అట్లుచేసి కన్నియతో నిట్లనియె. "పుత్రీ! ఏను గంధర్వుఁడను. నావలన భీతినొందకుము. నీకుఁ గల శోకకారణంబు నెల్ల నెఱింగితిని.

కన్నియ.—ఆమాటలు వినఁగానే మనకు మేలుచేయ నొక్కఁడు దొరకెనుగదా యని యా రాజపుత్రి మొగ మింత

యాయెను. అయినను మేలు సంపూర్ణముగ కలుగునంతవఱకు తాపము సంపూర్ణముగ చల్లాఱదుగదా.

"గంధర్వశేఖరా! దేవతల కెఱుంగరానిది యెద్దిగలదు? అట్లు పురోహితునికి ధనముచే నాశ కల్పించి మాజనని తన యానందీర్చుకొని తృప్తినొందె. నేను గన్నియనైనను నాయెడ పుత్రభావము కలిగి మజ్జనకుండును తన పుత్రహీనతాశోకంబును నివారించుకొనియె. నిజస్థితిని తగినంత జాగ్రత్తతోఁ గ్రమ్మి వేఱొక కన్నియను తెచ్చి వివాహముచేసి మారాజమంత్రియు తన బుద్ధిచమత్కృతిని సఫలముచేసికొనియె. ఇఁక నేను ప్రాణములు విడిచి" అనునంతలో, "కాదుకాదు. పురుషత్వము నొంది రణమున జయముగాంచి యీశ్వరునియొక్క యఘటితఘటనాసామర్థ్యమును ప్రకటింపుము" అను వాక్యమొకటి వినంబడియె; దానిని వినఁగానే యిరువురును మహాశ్చర్యముతో గొంతవడి యూరకుండిరి.

పురుషుఁడు—"పుత్రీ! ఈ యశరీరవాణి నాకు మహోపదేశమొసఁగె; నాయోగశక్తిచే నాయందలి పురుషత్వమును నీయందు ఆవహించెద; యోగంబున కసాధ్యమెయ్యదియును లేదు. నీవును దానిని గైకొని రణంబున జయమునొంది మరల నాయొద్దకు రమ్ము; అందాఁక నీదు స్త్రీత్వంబు నాయోగబలంబున సన్నాశ్రయించి యుండునుగాక" అని యొసఁగె! శక్తికలిగియుండిన నిట్లు కదా దానిని సఫలముచేసికొనుట. తనప్రయోజనమునకై కాని, తమప్రయోజనమును మొదటిదానినిగా నెంచుకొనికాని, యొకరికి మేలుసేయువారనేకులు కలరు.

వారును పరోపకారులే; వీఁడును పరోపకారియే? పేరు
ఒక్కటియైనంతమాత్రమున హరి (క్రోఁతి)హరియగునా?
అంత నాకన్నియయు వాని పరోపకారగుణమును వేయి నోళ్లఁబొగడుచు యథేచ్ఛంజనియె; నాగంధర్వుండును తన కత్యద్భుత యోగశక్తి కలిగియుండుట కిట్లుకదా యుపయోగింపవలయునని మురియుచు గృహములోనికిం జనియె. అంత ఒకటి రెండుదినములు కడచుటయు, నొకనాఁటి మధ్యాహ్నసమయంబున నాకసంబున నొక గొప్పకలకలంబు మన గంధర్వునకు విన వచ్చె. మన మిట్టి స్థితితో బయలి కేఁగుట యుచితముగాదని యాతఁడు తన యింటనుండి వెలుపలకు రానొల్లకుండె. ఆ కలకలంబును క్రమముగా దగ్గఱకు వచ్చుచు,నీతనియింటికి కట్టెదురయ్యె. అటనుండి "ఓ గంధర్వశేఖరా! ఇటురమ్ము! సి విట నివసింప నారంభించి బహుదినంబులయ్యె; నిన్ను చూడఁగోరి దేవనాయకుండు పిలుచుచున్నాఁడు" అనుశబ్దమొకటి వినవచ్చె; దానినివిని యీ నూతన యువతి తా నొనర్చిన పరోపకారమునకు నింద్రుఁడు సంతసించును గాక యని యెట్టకేలకు మనస్సును గుదుర్చుకొని యాతని యెదిరికిఁజని నమస్కరించి నిలువంబడియె. దేవతలలో నగ్రజుండయ్యు, దేవతలకు రాజయ్యు, సత్వగుణసమృద్ధిగలిగియు నాయింద్రుఁ డీయనయొనర్చిన పరోపకారంబునకు సంతసించి యక్షయంబగు యోగశక్తి నొసంగి వృద్ధిఁజెందించుటకు మాఱుగ "ఓరీ! తనకు మాలిన ధర్మము చేయుటయుఁ గలదా? నీవు విచారము చేయకుండుటకు నిదె తగినఫలము నను భవింపుము; నీవాకన్నియవలనఁ గొనిన స్త్రీత్వంబును మరల నిచ్చుటకు నీయోగశక్తి సమర్థమైనది గాకుండును గాక" యని

శాప మొసంగె. సూక్ష్మదృష్టి లేకున్న వేయికన్నులతో మాత్రము ప్రయోజనమేమి.

ఇది త్రయోదశ ప్రకరణము.

---

## చతుర్దశ ప్రకరణము.

ఆ. ఒడలి విడువఁబోదు చెడదు దానిని గాఁడ
నేయ లేరు శత్రు లెవ్వ రేని
ధైర్యకవచ మట్టి దానిఁ దాల్పఁగ నేర్చి
వెలయవలయు నరుఁడు పృథ్వియందు.

చక్రవర్తులకు రాజధానియగు హస్తినాపురపు విషయమును విడిచితిమి; దాని నించుక విచారింతము. అట్లు విచిత్రవీర్యుని పత్నులగు నంబికాంబాలిక లిరువురును దేవకన్యల సొగసునైనను దిగస్కరింపఁజాలు తమ రూప విభవంబుచే నావిభుని మనంబును సంపూర్ణంబుగ నాకర్షించిరి. దానిచే నవ్విభునకు పూఁబొదరిండ్లు సభామంటపంబులుగను, పుప్పొడితిప్పలు సింహాసనంబులుగను, తేనియలు ద్రావి చెలరేఁగిన తుమ్మెదలగములు స్తోత్రపాఠ సమూహములుగను, మన్మథుఁడు ముఖ్యమంత్రిగను, మధురములగు కలకలధ్వనులతో నొప్పు శుకశారికాదులు తన గుణముల నభినందించు సభ్యులుగను. అయ్యాయి వేళలఁ దగినయట్లు తరువుల నలంకరించు వసంతగ్రీష్మాదులు గృహశిల్పులును ఏర్పడిరి; మఱియు నారాజ్యంబునందువలెఁగాక నీరాజ్యంబున నిరువురుపత్నులకును పెద్ద చిన్న యనుభేదములేక పట్టమహిషీపదంబు దొరకె. ఏమిచిత్రము ! రాజ్యాంగవిషయముల విచా

రించుటయే ముఖ్యవృత్తిగాఁగలవారికి సహితము ఇట్టి విపరీత స్థితి! అవును; కామపిశాచావేశము నిక్కముగ పిశాచావేశమే కదా.

ఇట్లతిశయలోలుఁడగుటచే క్రమక్రమమున ధైర్యముతోఁ బాటు సర్వధాతువులును క్షీణింప నారంభించి కట్టకడ కాతని యంతముతో నన్నియు విరమించె. సంతానహీనుఁడగునీరాజ మరణంబుచే చంద్రుఁడు మొదలింతవఱకవిచ్ఛిన్నమాగా వచ్చుచున్న నీరాజకులమున కెట్టిదశ రావలసివచ్చె! రాజులకు పుత్రహీనతకంటె వేఱొకదుఃఖ ముండదని చదువరు లింతకుముందె యనేకసందర్భంబుల నెఱింగియే యుందురు. సామాన్యుల కీదోషమున్న నది యొక్క కుటుంబమునే బాధించును; చక్రవర్తులకే యిట్టిది గలిగిన వారిరాజ్యంబులందలి సర్వకుటుంబములకును దుఃఖమే కదా? అంత నాతని కపరకృత్యంబుల భీష్ముండు నిర్వర్తించె; మఱియు దుఃఖమహాసముద్రంబున మునింగిన యా రాజకులము దరిచేరుటకు విశేషకాలము పట్టెను.

3. అంత నిట్లు దేశమెల్ల నరాజకంబగుస్థితి తటస్థించుటయు పురోహితమంత్రిప్రభృతులు తమలో మంతనముచేసి తుదకు భీష్మునితో నిట్లనిరి "గాంగేయా! నీవు ధర్మజ్ఞుండవు, నీకు మేము చెప్పఁగలయంతవారము కాకపోయినను, ఈకాలంబున మా యభిప్రాయము నెఱుంగుటకై యించుక విన్నవింపఁ దలంచుచున్నాము. సంతానహీనులై సత్యవతికుమారులు చిత్రాంగద, విచిత్రవీర్యులిరువురును మృతినొందిరిగదా. దేశ మరాజకమవుచున్నది. కావున నీవు రాజ్యభారమును బూనుము. ఇది మాకు నుచితమవునని తోఁచుచున్నది.

భీష్ముఁడు.—కాలోచిత మైనదానిని వచించితిరి. అయినను దేవతల సన్నిధి నొనర్చిన ప్రతిజ్ఞ నేమి చేయువాఁడ ?

మంత్రులు.—నీప్రతిజ్ఞకు నిట విషయ మేమున్నది?సత్యవతి సంతానంబునకు రాజ్య మొసంగుదునని ప్రతిజ్ఞ నొనర్చితివి. ఆప్రతిజ్ఞ సమకూడె. సత్యవతీపుత్రులు సంతానహీనులైరి. ఇఁక నీవు రాజ్యభారముఁబూనక దేశము నరాజకముఁ జేసెదవా?మఱియు పగులకు బాధఁ గలిగించుప్రతిజ్ఞాపూర్వకము కానేరదు. ఇదియు నీ వెఱుంగని విషయము కాదు.

భీష్ముఁడు.—ఇట్లనద రేల? రాజ్యమెప్పుడు వారిల కర్పించితినో యపుడే రాజ్యభారం మూనుట శూన్యమయ్యె. వారలకు సంతతి లేకుండిన వారిల భార్యలైనను బ్రతికినంతకాలము రాజ్యభారము నూనవలయు. పిదప నెట్లైన నట్లు అగుఁగాక. ఇంతియె కాని ప్రతిజ్ఞను విడుతునా?

మంత్రులు.—అట్లయిన దేవర న్యాయంబున వారల పత్నులయందు పుత్రులఁ బుట్టింపుము ; దీనిచేతనైనను వారి సంతానమునకు విచ్ఛిత్తి కలుగకుండును.

భీష్ముఁడు.—ఇది యేటిమాట? రాజ్యమును విడిచిన ప్రతిజ్ఞతోఁ గూడనే బ్రహ్మచర్యము నవలంబించితినిగదా ? అదియు నిపుడు విడుచుట పాడిగాదు. వలయునేని పరాశరముని వలన సత్యవతీదేవియందు జననమొందిన మహాత్ముని కృష్ణద్వైపాయనుని వేఁడెదము. ఎవ్వరైన నాయన యుపదేశమును మించువారలు లేరు.

ఈవాక్యమును వినఁగానే మంత్రులు మొదలగువారలు చే

యునది లేక యూరకుండిరి. ఈ వృత్తాంతము నెఱింగి సత్యవతియు భీష్ముని కనేకవిధంబుల బోధించెనుగాని యాయన మనం బించు కయుయినను స్థిరప్రతిజ్ఞనుండి తిరుగడయ్యె. ధీరుల నెట్టి సందర్భములయినను మనస్సు చలింపఁజేయనేరవుకదా? అంత నామె మనంబున వ్యాసునిఁ దలంచె. ఆఘనుండు యోగశక్తిఁ గలవాఁడగుటచే తన తల్లి తలంచిన యుత్తరక్షణంబున నామె యెదుట నిలిచి నమస్కరించి ఆమె తలంపు నంతకుమున్న యెఱింగినవాఁడుగావున నిట్లనియె. "తల్లీ! నీతలంపు నేనెఱింగితి; భీష్ముండు ధర్మాత్ముండు, ధైర్యవంతుండు, స్థిరమగు ప్రతిజ్ఞకలవాఁడు. ఆతనియెడ నించుకయైనను దోషంబు లేదు. అంబికాంబాలికల నేను నిర్ణయించిన పుణ్యదీక్షలో నొక్కవత్సరము నియమింపుము; పిదప నీకోర్కి ఫలించు" అనిపలికి దీక్ష నుపదేశించి యథేచ్ఛం జనియె.

వత్సరాంతంబగుటయు శుచిస్నాతలై యున్నవారిరువురును వ్యాసప్రసాదంబున గర్భవతులైరి. అంతఃపురదాసి యొక్కతెయు నట్లే గర్భవతియై మాండవ్యశాపంబున శూద్రయోనియందు జనింపవలయు వానిని యముని ధర్మస్వరూపుని విదురుఁడను పేరఁ బుత్రునిఁగాఁ బడసె. అంతకుమున్న యంబికాంబాలికలు తమతమ దోషంబులవలన గ్రుడ్డితనమును పాండురోగమును కలిగిన వారి ధృతరాష్ట్ర పాండురాజు లను పేరు గలవారి నిరువురు పుత్రులఁబడసిరి. మన భీష్ముఁడు రాజ్య పరిత్యాగమును ప్రతిజ్ఞ చేయుటయే కాని రాజ్యకార్యభారమును విడుచుట సంభవింపనే లేదని చదువరు లెఱింగియే యున్నారు. శంతనుని మరణానంతరమున సత్యవతిపుత్రులు వృద్ధినొందువఱకును, చిత్రాంగదుఁ డించుక ప్రవీణుఁడై రాజ్యకార్యములు చూచుకొనువయస్సు గలు

గునప్పటికి తన గర్వముచేతనే తాను నశించినందున నప్పుడు కొంతకాలమును, పిదప విచిత్రవీర్యుఁడు విషయలోలుఁడై రాజ్యభారముల విడిచియుండుటచే కొంతకాలమును నీవిధమున నిప్పటి వఱకును సింహాసనాసీనుఁడు గాకయును కిరీటమును ధరింపకయును రాజ శబ్దముచే పిలువఁబడకయును మన భీష్ముఁడే రాజ్యపాలకుఁడై యుండె. విచిత్రవీర్య మరణానంతరమున నంబికాంబాలికలకుఁ గలిగిన గర్భముల నభిషేకించి తానే రాజ్యమును చూచుకొనుచుండెను గదా? అయిన నిరువురుపుత్రులు కలుగుదురు గదా? ఈ రాజ్యభారము మనల విడుచునని తలంచెను గాని ఇప్పటికి నది విడిచినదిగాదు.

పెద్దకుమారు డంధుఁడగుటచే నామమాత్రమునకు రాజయ్యెనుగాని రాజ్యకార్యములను విచారించుట కించుకయైనను సమర్థుఁడు కాకుండె. ఇట్టివారి కభిషేకార్హత లేదని ధర్మశాస్త్రములు పలుకునుగాని రెండవవాఁడు తమ రాజ్యము నభివృద్ధి నొందించుటకు లో సర్వకాలములందును పనివడియుండెను గావునను, ఇట రాజ్యకార్యముల నిర్వహించుట యాతనివలననే జరుగవలసిన నిమిత్తము లేకపోవుటచేతను ధృతరాష్ట్రునకే యభిషేకమొనర్చిరి.

ఇప్పటికి రాజకులమునకు శాంతికలిగినది. నూర్వురుపుత్రుల వడయునట్టి వరము నొందెనని గాంధారదేశపు రాచకన్నియ గాంధారి యనుదాని ధృతరాష్ట్రునకిచ్చి వివాహముచేసిరి. ఇంతియె కాక కులశీలాదులచే నుత్తమలగు ననేకకన్యలు ఆ ధృతరాష్ట్రునకే భార్యలైరి. పాండురాజునకును కుంతిభోజుని కొమార్తయగు కుంతియు, మద్రదేశపు రాజపుత్రియగు మాద్రియు

నను నిరుపురుభార్యలైరి. ఇఁక కౌరవసంతానమునకు విచ్ఛేదము కలుగదని యెల్లరును సంతసించుచుండిరి. మఱియును విదురుఁడు రాజకార్యములయందతిసమర్థుండై భీష్ముని కార్యభారమును సగమువఱకు తగ్గించె. పాండుని పరాక్రమమున సకలరాజులును హస్తినాపుర సింహాసనమున కధీనులైరి.

ఇది చతుర్దశ ప్రకరణము.

---

## పంచదశ ప్రకరణము.

ఆ. తనకు భక్తిఁగొలుచు జనులైనఁ దన కిష్ట
హితులయిన బంధు హితులయిన
వీరు పరులటంచు గోరంత తలఁపున్న
మనము స్వార్థపరత మానఁబోదు.

"రిత్తధర్మముల నుపదేశింప నేటికి? శత్రువులనైన నుపేక్షింతురుగాని క్షత్రియులు వేటకై వచ్చినచోట మృగంబుల విడువరుకదా? నమ్మికఁజేసిగాని మాయచేతఁగాని వధించుట యధర్మమంత్రముగాని నీవన్నట్లు పరుగెత్తనేరకుండునప్పుడు వధించుట యధర్మమనలేదు. కావున వృథగా నిందింపకుము." అని కను లెఱ్ఱంజేసి ఘోరముగా సంభాషించుచు నొక్క రాజపురుషుఁడు ధనుర్బాణముల ధరించి యశ్వారూఢుఁడై పత్నులిరువు రుచితవాహనంబులపై వెంటనరుగుదేర హిమవత్పర్వతప్రాంత ఘోరారణ్యంబులం దొక్కనాఁడు గనుపట్టె. మృగయ యఁట; మృగముల నిరపరాధులైనను వధింపవచ్చునఁట; పరుగెత్తలేనపుడు వానిని వధింపరాదనుట వృథావాక్యములఁట; ఆహా! ఇది యేటి

ధర్మము? వివేకవంతులయ్యు ధర్మశాస్త్ర నీతిశాస్త్రముల ముఖ్యముగఁ బరిశీలించియు నొకరు సేయు ధర్మాధర్మముల నిరూపించి, యుపదేశించుటకు సమర్థులయ్యు తమ గుణముల నెఱుంగలేకున్నారు. నిశ్చయమె. వ్యసనంబులఁ దగిలినవారికి యుక్తాయుక్త వివేక మెక్కడిది? వ్యసనంబులు మనమును సంపూర్ణముగ నాకర్షింపఁగలవుకదా?

ఈ వాక్యముల వచియించుచుండఁగానే క్షత్రియపురుషుని దెస నాగ్రహమును సూచించుచు నెదుటనుండు ముని పలుకనారంభించె. "ఏమనెదవు? నీవు చేసినది ధర్మమని నుతించుచున్నావా? నిన్ననేటికి? పాండుండనయ్యు చంద్రకులంబునకు నిలత్వంబు కలిగించుచున్నావు; అగుగాక. నీకృత్యంబునకిదే ఫలము ననుభవింపుము. నాకువలెనె రతిసుఖసమయంబున నీకును మృత్యువు ప్రాణాపహారియగుఁగాక." యని శపించి యా పురుషుని చే నంతకుమున్న విడువఁబడిన బాణవేదనకు సహింపనోపక కడ యూర్పు విడిచె.

అంత నప్పాండుభూపతియు పురంబునకు మరలుటకు విరక్తి గలవాఁడై తన్ను నిలుచుట కిష్టపడని యిరువురు పత్నులతోడ హిమవత్పర్వతారణ్యంబులకుఁ జని సప్తాంగములు గల రాజ్యమును దనూయగలవాఁడునుంబోలె సప్తాంగయోగరాజ్యంబున కభిషిక్తుండయ్యె. రాజ్యసుఖమువలనఁ గలిగిన దుఃఖము అంతగా బాధింపకుండినను పుత్రహీనతా శోకమూమాత్రము ఆయనను విడువలేదు. కుంతి యంతఁ బతియనుజ్ఞచే తనకు బాల్యంబున దుర్వాసుఁడుపదేశించిన మంత్రంబున యమ వాయ్వింద్రుల నుపాసించి వారివలన క్రమంబుగ ధర్మజభీమార్జునులను

పుత్రులఁబడసె. మాద్రియు నామంత్రంబును కుంతివలన నుపదేశంబునొంది యశ్వీదేవతల ప్రసాదంబున నకుల సహదేవుల నిరువురుకొమరులఁ బడసె. ఇట్లు పత్న్యు లిరువురును, పాండురాజునకుఁ గల కొఱంతఁ బాపిరి. అంత కాలక్రమంబున మన్మథ పట్టాభిషేకోత్సవంబునకుఁబోలె వసంతుండు ధరణీమంటపము నలంకరించె. నవీన ప్రభుండగు విష్ణుపుత్రుని సేవించి కృతార్థత నొందుదమని మనరాజ పుత్రుని మనము వేగిరించుచుండఁ దమ మౌనిశాపవాక్యముచే ప్రేరేపింపఁబడి యాతని ప్రాణానిలంబులఁ గ్రోల పొంచియున్న కాలసర్పము. తనయిష్టమును నెఱవేర్చుకొనియె. దానికి కారణభూతురాలగుటం జేసి మాద్రియును రాజన్యునితో సహగమనమొనర్చె. అంత కుంతియు యుక్తవయస్కులగు బాలురకు ఋషులచెంగట వేదాధ్యయనాదులు చేయించి తుద కాఋషులు కొంద అనుసరింప శిశువులతోఁ గూడ హస్తినాపురంబున కరిగె. అంతకుమున్న గాంధారియు నూర్వురపుత్రులఁబడసియుండె. వీరిలలో పెద్దవాఁడగు దుర్యోధనుండు కుంతీపుత్రులలో పెద్దవాఁడగు ధర్మరాజుకంటె చిన్నవాడు. ఇపుడు రాజమందిరంబెల్ల శిశువులతో నిండియుండె. దీనిచే కురువృద్ధులును పౌరజనులును చంద్రవంశంబునకు విచ్ఛేదము కలుగదని సంతసించుచుండిరి.

ధృతరాష్ట్రునకు పాండురాజమరణము తోడనే కాక తనకుఁ గల పుత్ర శతలాభమువలనఁ గూడ కుంతి మొదలగువారియందు పూర్వమున్న మమకారము కొంచెముకొంచెముగా తగ్గనారంభించినది. అయినను ధార్మికులగు భీష్మాదుల సహవాసము వలన వారియందు ద్వేషము అంకురించుటకుమాత్రము అవకా

శము కలుగకుండెను. ఇంక బాలురవిషయమే మన దుర్యోధనాదులకు మొట్టమొదటనే పాండవులయందు వీరు పరులు అను బుద్ధి పుట్టియున్నందున నాటలు మొదలగుసమయములందు భీముఁడు చూపు నమానుష పరాక్రమంబునకు "ఇట్టి పరాక్రమవంతుఁడుండిన మన కెట్టి కీడునురాదు" అని సంతసించుటకు మాఱుగా "వీనివలన మన కుత్తరకాలమున మనకేమి కీడువాటిల్లునో! ఇంత బలవంతుఁడు తమ్ముఁడై యుండుటచే నాధర్మరాజు మనల నేమియైనఁజేసి రాజ్యము నపహరింపఁజూచును. మనము నూర్వురమైనను ఈ యొక్కనిసాటిగాము. కావున నేయుపాయముచేతనైన వీనిని వధించుట కర్తవ్యము" అని భీమునిపై విరోధమును బూనిరి. తామెంతయో పరులుగూడ నంతయే యనిగదా సాధారణముగ దలంతురు! పాండవులకు వీరియందు వాస్తవముగా ద్వేషమే లేదు. అట్టి సుగుణవంతులకుఁ గూడ ద్వేషము కలిగించుటకు పైనిజెప్పిన విధమున నిష్కారణముగ భీమునియందు ద్వేషమును బూనిన దుర్యోధనుఁడే కారణమయ్యెను. తాను జేయు ప్రయత్నమును నిష్ఫలములగుచుండుటచే నాతని ద్వేషము మఱింత హెచ్చ నారంభించెను.

ఇంతియె కాక వారలు ధనుర్విద్య నభ్యసించునపుడు అర్జునునికిఁ గల యస్త్రలాఘవ మందఱికంటె నతిశయమై యుండెను. సాధారణముగ నొకఁడు తనకంటె నతిశయముగ నున్నాఁడనిన వానియందు మత్సరము కలుగుట సహజముకదా? ఇంతమాత్రమే గాక నీ యర్జునుఁడుకూడ పంచపాండవులలోనివాఁడేయాయెను. ఇఁక దుర్యోధనుని మనస్సు ఎట్లుండవలయును? మఱియు, వీరల కస్త్రవిద్య నేర్పిన ద్రోణాచార్యునకు గురుదక్షిణగా, నాగు

రువునకు శత్రువగు ద్రుపదుని వీరలందఱును బట్టి తేవలసినవారైరి. అపుడు అందఱును ద్రుపదు నెదుర్ప లేకున్న సమయమున నర్జునుఁ డొక్కఁడై విజృంభించి ద్రుపదునిఁ బట్టి తెచ్చి గురుదక్షిణ నొసంగె. ఈ పరాక్రమమును జూచినది మొదలు దుర్యోధనుని మనస్సున నిక్కముగ ధైర్యమే లేదు.

అయినను వీనికి నీ విషయమున ధైర్యము కలిగించుటకాధారము బొత్తిగా చిక్కకుండ లేదు. కుంతి తన బాల్యదశయందు దుర్వాసుఁ డుపదేశించిన మంత్రమును బరీక్షించుటకై సూర్యు నారాధింప నాసూర్యునివలన నొక్క పుత్రుఁ డుద్భవించె. వానిని లజ్జచే నింటికి తేనొల్లక యొక్క మందసమున నిడి యామె నదిలో పాఱవైచె. వాఁడు దైవయోగంబున సూతుని కొక్కనికి దొరకి వానిచేఁ బెంపఁబడి వీరలతోఁ గూడ విద్యాభ్యాసము నొనర్చుచుండె. వాఁడు అస్త్రవిద్యలో నర్జునుతో సమానుఁడై కనఁబడినందున వానితో నగ్నిసాక్షికంబుగ చెలిమియొనర్చి దుర్యోధనుండు వాని నర్జునునకు నెదురుచేసికొని యుండె. భీముండును గదాయుద్ధంబున నిపుణుండగుట నెఱింగి తానును దానియందు పాటుపడుచుండె. ఇట్లుండ భీష్మాదుల యుపదేశముచే బాలురలో నెల్లఁ బెద్దయగు ధర్మరాజునకు ధృతరాష్ట్రుఁడు యువరాజ్య పట్టాభిషేకమొనర్చె. ఇంతవఱకును పుట్టలో మఱగియున్న సర్పమువలె దుర్యోధనుని మనంబున విషంబునుఁ గ్రక్కుచున్న ద్వేషసర్పము తలయెత్తుటకు సమయమువచ్చె. గాంధారికి తమ్ముఁడగు శకునియనువాఁడు బాల్యమునుండియు వీరలతోఁ గూడనే పెరుఁగుచుండె. ఆతఁడే యారంభమునుండియు సర్వకార్యములందు నీదుర్యోధనునకు రహస్యమంత్రియై యుండె. ఈ యభిషే

కము జరిగినపిదప యీ దుర్యోధన శకునులిరువురును తమలో తా మెంతయో యాలోచించి కట్టకడకు కొందఱు శిల్పులచే కాశీపురంబున లక్క మొదలగు నానావిధములై నిప్పునకు తక్షణమె యంటుకొనునట్టి ద్రవ్యములచే రాజయోగ్యము లగు విచిత్రగృహముల నిర్మింపించిరి.

ధృతరాష్ట్రునిమనంబున ద్వేష మహావృక్షబీజంబు లంకురించుట కిదియు గలిగినది. కుమారులు సర్వశాస్త్రనిపుణులై రాజ్యభారమును వహింప సమర్థులై యుండిరి. తమ్ముని కొమరుల పరాక్రమము లోకోత్తరమై యుండెను. ఇదియునుగాక ధర్మరాజు ధర్మాత్ముఁడగుటచే భూజనులందఱును వానియందు అతిశయానురాగము కలిగియుండిరి. యువరాజుగా నున్నకాలమందె ప్రజల యనురాగము నింత యతిశయముగా సంపాదించిన వాఁడే రాజైన సర్వస్వతంత్రుఁడైన నప్పటిస్థితి యేమని చెప్పవలయును! ఇదియునుఁగాక ధర్మరాజునందు జనుల కెంత యనురాగముగలదో, దుర్యోధనుఁడు చేయు దుశ్చేష్టలకు నాతనియందంత ద్వేషము కలుగుచుండెను. ఇవియెల్ల నాలోచించిన కొలఁది ధృతరాష్ట్రునకు పాండవులయందు ద్వేష మతిశయింపసాగెను. పైకిమాత్రము భీష్మాదుల యుపదేశబలమున వారియందు ప్రేమగలవాఁడుగానే యభినయించుచుండెను. ఈ సమయము కనిపెట్టి శకునియొక్కయు నాతని మంత్రియొక్కయు నుపదేశము వలన దుర్యోధనుఁడు తమయాలోచన మంతయు క్రమక్రమముగ తండ్రికి బోధించి కుంతి మొదలగువారి నార్వురను తగిన పరివారము నిచ్చి యేదియో యొక వ్యాజమున వారణాసీపురమున కంపునట్లు చేసి వారితోడ పురోచనుఁడను నొక్క కపట

సేవకుని తానుగా పంపెను. ఈ పురోచనుఁడు మొదటనుండియు దుర్యోధనునికి నాతఁ డొనర్పఁదలంచిన కార్యములయందు సహాయము చేయుచుండెడివాఁడు. పాండవులును ధృతరాష్ట్రుఁడు తమ్మును సంహరింపఁ బ్రయత్నించెనని యెఱుంగకపోయినను తమపై ద్వేషము కలిగియున్నవాఁడనిమాత్రము తెలిసికొనకపోలేదు. మఱియు తమ కీ దుర్యోధనాదులతో సహవాసము తప్పి దూరముగా స్వతంత్రించి యుండుటకు పీ లేర్పడుటయె మేలని కూడ తలంచి ధృతరాష్ట్రుని యాజ్ఞను శిరసావహించిరి.

ఈవిషయము కురువృద్ధుల కందఱకును తెలియదు. భీష్ముఁడు ధృతరాష్ట్రునకు పాండవులయెడ ద్వేషముకలుగు సూచనలు కనుపెట్టునప్పుడెల్ల వానిని నివారించుచుండెను. ఎట్లయినను బంధుత్వ మతిశయమగుటచే ప్రియపరుఁడుగా నుండుట మాత్రము విడువలేదు. బంధుత్వ ప్రేమ అతిశయించుకొలఁది జనులు తా మెంత ధర్మాత్ములైనను తమవారికి ప్రియమును-అనగా తత్కాలమందు సంతసము గలుగువిషయమును-గోరుచుందురుగాని హితమును-అనఁగా తత్కాలమున నించుక కష్టముగా తోఁచినను ఉత్తరకాలముకు సౌఖ్య మిచ్చు విషయమును చెప్పుట కంత యతిశయముగా కోరరు. ఇందుచే వీరికి తమ బంధుజనులకు హితము గలుగుట యిష్టముకాదని తాత్పర్యముకాదు. మనస్సునందు ప్రేమ యతిశయించుకొలఁది తమవారి కించుక యాయాసము కలిగినను చూచి యోర్వలేకుండుటచే వారు ప్రేమను మాత్రమే విశేషముగ కోరుదు రనవలయును. విదురుఁ డట్టివాఁడు కాఁడు. అతఁడు పాండవులు హస్తినాపురము ప్రవేశించినదిమొదలు తన సూక్ష్మదృష్టిచే ధృతరాష్ట్రునియొక్క

యు దుర్యోధనాదులయొక్కయు తలంపులనెఱింగి వారలచేష్టల జాగ్రత్తతో విచారించుచు ధృతరాష్ట్రునకు సర్వకాలములందును హితము నుపదేశించుచుండెడివాఁడు. కావున మునుమున్నుగా పాండవుల నాపదలనుండి తప్పింపవలయునని యొక భృత్యుని తో కొన్ని సమాచారములు చెప్పి కాశికి నంపెను. ఇచట మొదటనుండియు దుర్యోధనుఁ డొనర్చినవృత్తాంతము లన్నింటిని రాజునకు పూసగూర్చినట్లెఱింగించి రాఁబోవు కీడులనెల్ల నద్దమునఁ జూపినట్లు చెప్పుచుండెను. నాఁటనుండియు దుర్యోధనుఁడే యువరాజై యుండెను.

అట పాండవులును విదురుఁడు పంపిన భృత్యునివలన వృత్తాంతమునెల్ల నెఱింగి యర్ధరాత్రమున నాగృహమునకు అగ్ని నంటించి విదురుఁ డంపినభృత్యుఁ డొనర్చిన బిలద్వారమునుండి యొక మహారణ్యమునకు నిర్గమించిరి. మఱునాఁటియుదయమున లక్కయిల్లు కాలెననువార్త హస్తినాపురమునకు తెలిసెను. అపుడచటివారందఱును వారణాసీపురంబునకువచ్చి బూదియై యున్న గృహమును, అందు కొంచెముకొంచెముగ కనఁబడు చున్న యేడు శవములను చూచి యందఱును దుఃఖింపసాగిరి. అందఱి కన్నులనుండియు ధారలుగ నీరు కాఱుచుండెను. కాని, యిట్లు అందఱికిని నొక్కమాఱుగా దుఃఖము కలుగుటకు కారణములుమాత్రము వేఱయియుండెను. దుర్యోధనుని ప్రియమిత్రుండగుపురోచనుండు తాను తన యువరాజున కొనర్చిన యపరిమితోపకారమును చెప్పుకొనుచు నదురుగా రాలేదు. విదురునకు తన భృత్యుఁడు పాండవులకు చెప్పుమని తా నాజ్ఞాపించిన వార్త నెఱింగించెనో లేదో యను సంశయము బాధించుచుండె. ఏల

ననిన నాఁటిరేయి విశ్వనాథమహోత్సవము చూచి వచ్చిన యొ
క్కవనిత తన యైదుగురు పుత్త్రులతోడ నాయింటి పంచఁ బవ
ళించియుండె. దహనమైన పిదప నిది పంచయనియు, నిది యి
ల్లనియు, అచట కనఁబడుశవములలో వీరు పలానివారనియు
నెఱుంగుటకు వలనుపడదుగదా? కాశియందెల్ల మహాధర్మాత్ములు
పాండవులు మృతులైరిగదా? రాజగృహమునకు నిప్పంటించు
వారెవరు? వారికి విరోధు లెవ్వరును లేరే? ఇది రాజకులము
నుండియె జరిగిన కపటకృత్యమని జనవాద మతిశయించె. విదు
రుని విషయమె యిట్లుండ నిఁక నేమియొఱుంగని భీష్మాదులవిషయ
మేమనవలయు. ఒక్క పాపకృత్య మెన్నిపాపములకు కారణ
మవునో చూచితిరా, నిరపరాధులగు పాండవుల వధింపఁ దలం
పు పుట్టఁగానే మిత్త్రవధయు ననాధజనుల వధించుటయు నను
రెండుపాపములు దానికి తోడయ్యె. ఎట్లైనను దుర్యోధనుఁడు
నిక్కముగ నదృష్టవంతుఁడు. ఆ వనితయు నేవురుపుత్త్రులును
నాటిరేయి రాకయుండిరేని మఱునాటియుదయమున కాశీపుర
వాసులచేతిలో దుర్యోధనునిచావు నిజమై యుండును.

ఇది పంచదశప్రకరణము.

# షోడశ ప్రకరణము.

క. మూఁడుజగంబుల నెందును
గూడదు సత్వంబె యితర గుణములరెంటిన్
వీడి యటులైన నయ్యది
పోడిమిగలదేని మనము పొందు నిలుకడన్.

"తలంపు సంపూర్ణముగ నెఱవేఱదయ్యెనుగదా? వేదమంత్రంబులకుఁగూడ నిట్లు ప్రభావము తప్పుటకు కారణమేమైయుండును? బాలుండయ్యు ధనుర్విద్య నభ్యసించుచునే యుండియు, మహాసైన్యసంపన్నుండగు నాయంత కృతహస్తుని గెలుచునంతటి సామర్థ్యము గలవాని నల్లునిఁగాఁ బడయు భాగ్యముతప్పెఁగాబోలు. తప్పకేమి? దహనమైనవారు మరల వత్తురా" అని కొన్ని శుభశకునములఁ జూచి, కాదుకాదు,"వారలకు హాని యేమియుఁ గలిగియుండదు. ధర్మమునకే హాని గలిగిన లోకము నిలుచునా? కావున నసాధ్యమగు నొకయుపాయమును గల్పించి వారి నిటకు రప్పించెదఁగాక" అని ద్రుపదుఁడిట్లు తలపోసి మంత్రులతో నాలోచించి తగిన శిల్పులచే నాకాశచారియగు మత్స్యయంత్రమును నిర్మించి యసాధ్యమగు ధనుర్బాణములఁ గల్పించి"యీమిచ్చు ధనుర్బాణములతో నెవ్వఁడాకాశచారియగు మత్స్యయంత్రమును క్రిందనుండు నీటిలో గుఱిచూచి పడనేయునో యట్టివానికి యజ్ఞమునందు పుట్టినయాజ్ఞసేనిని (ద్రౌపదిని) వివాహముచేసెద"మని యన్నిదేశంబులందును జాటింపించిరి. దీనిని విని నానాదేశంబులనుండి రాజకుమారులెల్లరును తగిన సన్నాహంబులతో పాంచాలపురంబు చేరిరి. పురమెల్ల నెంతహర్షముతోనున్నను రాజు మనంబునకుమాత్రము నిలుకడ చిక్కలేదు. "అనేకయుద్ధములలో నాఱితేఱినవారును, ధనుర్విద్యయందు నతి సమర్థులు నగు నిందఱురాజులలో నెవ్వఁడైన నీ మత్స్యయంత్రము నేయలేకుండునా. వీరందఱకును నీయంత్రము సాధ్యముకాకపోయిన నా బాలునకు సాధ్యమగునా? కాదుకాదు. అతనికి నిది సాధ్యముకాకపోదు. అతఁడు

వయస్సునకుమాత్రము బాలుఁడేకాని బుద్ధియందు బృహస్పతి యంతవాఁ''డని తనమనంబున ననేకవిధంబుల నాలోచించుకొనుచుండెను.

దృఢసంకల్పములకు హాని యెన్నఁడును గలుగదు. లోకములందలి సర్వకార్యములును మంత్రజపాదులవలనఁగలుగు నద్భుత సిద్ధులును ఒక్కటియననేల? అణిమాదులగు యోగసిద్ధులుకూడ దృఢసంకల్పమువలననేకదా కలుగుచున్నవి. ఈ విషయమును గూర్చి పంద్రెండవప్రకరణమంతయు వివరింపఁబడియున్నది. అంతకుము న్నట్లు లక్కయింటనుండి వెలువడి మహారణ్యమున ప్రవేశించి యందు హిడింబాసురునిఁ జంపుటచే లోకమున కుపకారమొనర్చి యటనుండి యేకచక్రాపురంబున బ్రాహ్మణవేషధారులై, మధుకరాన్నమును భుజించుచుండి యచ్చట బ్రాహ్మణులు కొందఱు పాంచాలపురంబున స్వయంవరవార్తవిని యటకుఁజనుచుండ వారితోఁడఁ జనుచు పంచపాండవులు ద్రుపదపురంబు చేరిరి. పిదప నాస్వయంవర సమయమున నన్యుల కసాధ్యమగు మత్స్యయంత్రమును దెగనేసి యర్జునుఁడు ద్రౌపదిచే వరింపంబడియె. అక్కుమారికను వెంటఁబెట్టుకొని ధర్మ నకుల సహదేవులు తమవిడిదికిం జనిరి. రాజకుమారు లందఱును క్రోధావేశంబున "ఏమీ! మేమిందఱముగలుగ నీద్రుపదుఁడు తన కొమరితను నొక్క బ్రాహ్మణున కిచ్చువాఁడా? వీరును తమయధికారమెఱుంగక మమ్మిందఱ ధిక్కరించి కన్యను తీసికొనువారా చూతము'' అని యుద్ధమునకుఁ గడంగి భీమార్జునులచే పరాజితులైరి. తొలుదొలుత బ్రాహ్మణాభిమానముచే భీమార్జునులకు తోడ్పడ ప్రయత్నించిన బ్రాహ్మణుల సంరంభము హాస్యావహ

ముగా నుండెను. పిదప ద్రుపదుఁడు వివిధోపాయంబులచే వీరల పాండవులుగా నెఱింగి కొన్ని కొన్ని కారణములవలన వీరల కేవు రికిని నాకన్యనిచ్చి వివాహముచేయవలసినవాఁ డయ్యెను. ఈ పాండవులును తాము ద్రుపదపురమునకు వచ్చునపుడు మార్గమ ధ్యమున నంగారపర్ణుఁ డను గంధర్వుని యుపదేశమువలన పురో హితునిఁగా వరించిన ధౌమ్యుని యాజ్ఞికత్వముచే వివాహమును నెఱవేర్చుకొనిరి.

ఒక్కదుర్గుణము జనించినచో దాని ననుసరించి మఱి యెన్ని యో దుర్గుణములు గలుగుట యావశ్యకమైయుండును. మొదటి నుండియు ద్వేషము గలిగియున్న దుర్యోధనాదుల మనంబున కిప్పుడు భయము గలుగవలసివచ్చెను. భీమార్జునుల పరాక్రమ ములను జూచియే వారలమనం బదరుచుండును. విద్యాభ్యాసము లొనర్చు కాలము మొదలుకొని వీరి యస్త్రవిద్యాగురువగు ద్రోణుఁడు వారియొద్దనే యుండుట తటస్థించెనేని చదువరు లూహింపఁగలిగియే యుందురు. ఇట్లు భీష్మద్రోణు లిరువురును తమ చెంతనుండుటచే భీమార్జునుల శక్తి యొక లెక్కకాదని ధైర్యముతో నుండిరి. దీనికిఁగూడ నిప్పుడు భంగము కలిగెను. నాఁడు భీష్మునిచేతను సాల్వునిచేతను తిరస్కరింపఁబడి పరశురా ముని సహాయముగలిగి కూడ తన యిష్టమును నెఱవేర్చుకొనలేక భీష్మునిపై నుండు రోషముచే నాతనిని వధింపవలయు నని కోరి తపంబున కేగిన యంబ శిఖండి యనుపేర ద్రుపదరాజునింట పెరుఁగుచుండెను. ఈపెయే యీరాజునకు మొట్టమొదట పుత్రిక యై జనించి పిదప గంధర్వుఁడిచ్చిన పురుషత్వమునుబొంది యా పురుషత్వమును మరల తీసికొనుటకు శక్తి గంధర్వునకు నింద్రుని

శాపమువలన నశించుటచే నతఁడు పురుషుఁడై యుండె. ఇదియును గాక యర్జునుని పరాక్రమమునకు మెచ్చి యాయర్జునుని వివాహము చేసికొను కూఁతురును, తనకు విరోధియై తన్ను పట్టి తెప్పించిన ద్రోణుని వధింపఁగల కుమారుఁడును గావలయు నని పుత్రకామేష్టి యొనర్చి దాని ప్రభావమున ద్రుపదుఁడు తనతలంపు నెఱవేర్చుకొనియె. ఇట్లు భీష్మద్రోణులకు మృత్యువులై జనించి శిఖండి ధృష్టద్యుమ్ను లిరువురును పాండవులకు ముఖ్య సంబంధులైరి.

ఏసమయంబునందును నలక్ష్యమగు విదురునిమాట యిపుడాదరింపవలసివచ్చె. భీష్మద్రోణాదు లందఱును ధర్మాత్ములగుటచే పాండవులపక్షమునఁ బలుక నారంభించిరి, ఇట్టి యుపదేశముల వలన నా ధృతరాష్ట్రుఁడు ఎట్టకేలకు కృష్ణసహితులై ద్రుపదపురమున సుఖమున్న పాండవుల రావించి వారలకు నింద్రప్రస్థపురమును రాజధానిఁగా జేసి, యర్ధరాజ్యాభిషేక మొనర్చె. పిదప నర్జునుం డొక్కసమయంబున నగ్నిదేవునకు ప్రియంబుగ ఖాండవవనము నొసంగి యప్పు డావనమును రక్షించుటకై వచ్చిన యింద్రాదుల నద్భుతపరాక్రమమున జయించి తుట్టతుదకు వారి యనుగ్రహంబున ననేక దివ్యాస్త్రంబులను గాండీవమను ధనుస్సును దివ్యమగు రథాశ్వములును బడసె. ఖాండవదహన సమయమున కాలుచున్న య వ్వనమునుండి మయుఁడను నొక్కశిల్పి యర్జునుచే రక్షింపఁబడియె. దానికి ప్రత్యుపకారముగ వాఁడు లోకపాలురగు నింద్రాదుల సభలను మించిన సౌందర్యముగల యొక్క దివ్యసభాగృహమును నిర్మించి తెచ్చి యిచ్చె. ఇంతియె కాక యేకచక్రాపురమునుండి ద్రుపదపురంబునకు పోవు

నప్పుడు మార్గమధ్యమున గంగాతీరమున పత్నీసహితుండై విహరింపవచ్చిన యంగారపర్ణునితో వీరలకు గంగానది దాటువిషయములో యుద్ధముజరిగె. అందు నర్జునుని పరాక్రమమునకు అంగారపర్ణుఁడు మెచ్చి దేవతలు ప్రయోగించునట్టి సమ్మోహనాస్త్రమును భూలోకమం దెచ్చటను లేని యేనూఱుగంధర్వాశ్వములను లెక్కలుగల గుఱ్ఱములు నిచ్చియుండె. ఈవిధముగా మనుష్య సామాన్యులకు లేని దివ్యభోగములతో వారు రాజ్యమును పరిపాలించుచుండిరి. మఱియును, విష్ణువునకుఁ గలచతుర్భుజంబు లట్లు తనకన్ని విధంబులఁదోడ్పడు నలువురుతమ్ముల సహాయముచే సకలరాజుల నోడించి తన భూపతిత్వమును స్థిరపఱచుకొనుటకై నారదప్రేరణచే నాధర్మతనయుండు రాజసూయయాగము నొనర్చె. ఇట్లు తమ ప్రియబంధుఁడు రాజ్యపదవినుండి సామ్రాజ్యపదవి పొందినపుడు తమ వంశమునకు నింత యున్నతదశ వచ్చెనుగదా? యని, సంతసించుటకు మాఱుగా నా దుర్యోధనాదుల మనంబుల వీరిపై నీర్ష్య జనించి బలముచేత నపహరించుటకు సాధ్యముకాకున్నను మఱి యే మాయోపాయము చేతనైనను, వీరి రాజ్యము నపహరింపవలెనని తలంపు జనించె. ఇంతేకాని వారి సమృద్ధిహేతువులగు సుగుణముల నార్జించి యట్టిసమృద్ధిని తాముగూడఁ జెందవలయునని తలంపు జనింపలేదు. నిక్కముగ పాండవులయందు జనులెల్ల ననురాగము నొంది వారి ప్రభుశక్తి నుఱిదిఁ జెందించి వారి రాజ్యమునకు వృద్ధి గలిగించుచుండుట వారి యమూల్యములగు సుగుణములచేతనే కదా? దీనిని దుష్టహృదయు లేమెఱుంగుదురు? మఱియు, సమచిత్తము లేకుండుట యెన్ని దుర్గుణములకు నాధారమగును!

ఇట్లు తలంచి దుర్యోధనాదులు విచిత్రమగు నొక్క సభను సర్మించి యా సభను చూడవలెనను మిషచే పాండవుల హస్తినాపురికి రావించి యచ్చట ధర్మరాజును జూదమున కొప్పుకొనునట్లు చేసి తనకై యాడుటకు మాయాద్యూతమున నిపుణుండగు శకునిని నియోగించి పాండవుల రాజ్యమును నెల్ల నాద్యూతమూలముగ నపహరించె. ఎట్టివారికైనను మనస్సు సర్వకాలములయందును సత్వగుణముతో మాత్రమే కూడి యుండదు గదా? సత్వరజస్తమోగుణములలో నేదైన నొక్క గుణ మధికముగాను తక్కినవి తక్కువగాను నుండవచ్చును గాని ఒక్కటే గుణముండదు. కావున తమోగుణమువలనఁ బుట్టు ప్రమాదము సర్వ సాధారణము. ప్రమాదముచే నొక్క వ్యసనమునందు తగులుకొనిన మనసును మరలించుటయే కష్టము. ఇదియునుగాక ద్యూతాదులయందు మొట్టమొదట మనము జనింపవలయునని కోరికయు, ఆకోరిక సిద్ధింపకుండిన రోషమును, ఇవిమొదలగు దుర్గుణము లన్నియు క్రమముగ సంభవించుట సహజమె. ఆద్యూతమున కట్టకడకు నా దురాత్ములు సభయందు ద్రౌపదిని నవమానింపఁ జూచుటయు, నప్పుడామెకు కరుణామయుం డగుకృష్ణుండు రక్షకుండయ్యె. ఆదుష్కార్యముకు రోషము గలిగి భీమాదులు నలువురును క్రమముగ దుర్యోధనాదుల నూర్వురను కర్ణుని రాజకుమారులను శకునిని యుద్ధసమయమునందు వధింతుమని ప్రతిజ్ఞల నొనర్చిరి. ధర్మరాజుమాత్రము, బుద్ధిపూర్వకముగ స్వయముగానె తప్పునొనర్చి యా విషయమున నొరులపై కోపింపరాదని శాంతివహించి యుండె. భీమాదుల ప్రతిజ్ఞలకుమాత్రము సభయందు కలిగిన సంక్షోభ

మునకు మితిలేదు. ఈరోషముచే భీమాదు లిప్పుడే వీరల వధింతురేమో యని తలంచిరిగాని యాధర్మరాజునాజ్ఞచే నట్లు జరుగలేదు. సభయందలివారికెల్ల కలఁత తీఱనను ధృతరాష్ట్రుని మనసునకుమాత్రము కలవర మతిశయించె. మొదటినుండియు నెంతవిశదముగఁ జెప్పుచున్నను చెవులకెక్కని విదురునిమాట యాసమయమున నించుక లక్ష్యమయ్యె. కావున నాతఁడు తన లోనున్న భయమునంతయు ప్రేమగా గనఁబఱచుచు ద్రౌపదిని రావించి యామెకుఁ గా పాండవుల సకలరాజ్యమును మరల నొసంగె. దానికి దుర్యోధనాదులు తమ ప్రయత్నము విఘ్నమగుటకై తమలో దుఃఖించి పాండవుల మరల రావించి రెండవ మాఱు ద్యూతంబునకు ప్రవర్తింపఁ జేసిరి. అపుడు రాజ్యమును విడిచి యోడినవారు పండ్రెండేండ్లు అరణ్యవాసమును, ఒక్కయేఁ డజ్ఞాతవాసమును చేయుటయే పందెముగా నిడుకొనిరి. జయేచ్ఛయే ధర్మరాజును మరల ప్రవర్తింపఁజేసెఁగాని తుదకు నాకోర్కె నిష్ఫలమయ్యె. కాని పదుమూఁడేండ్ల యనంతరము యుద్ధముచేసి రాజ్యమును గ్రహింపవచ్చునుగదా? యను తలంపించుక ధైర్యము గలిగించుచుండె. అనేకులగు జనులును వారియందలి యనురాగముచే వారి నరణ్యమున కనుసరించి చనిరి. అందువలన వీరల యరణ్యవాసము నగరవాసము నతిశయించి యుండె. సూర్యుని యనుగ్రహమున వారలకు నాహారవిషయమై లోప మేమియుఁ గలుగకుండె.

దుర్యోధనుని దురాలోచన మింతటితో ముగియలేదు. అరణ్యవాసమున రాజభోగములు లేక దుఃఖించుచున్న పాండవులయొద్దకు తాము మహాభోగసంపన్నులై చని తమ యైశ్వర్య

మును జూపి వారి మనస్సు ఒకవైపు తమయందలి క్రోధము చేతను మఱియొకవైపు ప్రతిజ్ఞాభంగభయముచేతను కలఁతపడు చుండ దానిని జూచి యెగతాళిచేయవలెనని ఘోషయాత్రను మిషచేసికొని ద్వైతవనమునందుండు పాండవులయొద్దకుఁ జనిరి గాని యచట పాండవులపై నుండు నభిమానముచే నింద్రు నిచే ప్రేరేపింపఁబడి యుద్ధమునకై వచ్చిన చిత్రసేనుఁడను గంధర్వునిచేతఁ జిక్కి ప్రాణమాత్రావశిష్టులై కట్టకడకు తమకు ముఖ్యవిరోధులైనవారిచేతనే విడిపింపఁబడవలసినవారైరి. పుట్టిననాఁటనుండియు తమ కెంత యపకార మొనర్చుచుండినను "బంధువులు తమలో తా మెంత విరోధముగా నుండినను పరులు తమలో నెవరిపై కినైనను వచ్చినయపుడు వారి నుపేక్షించుట పాడికాదు" అను ధర్మమును గమనించి వారి యపరాధములనెల్ల లెక్కసేయక వారిని రక్షిపఁదలఁచునంతటి శాంతి ధర్మరాజునకు తగెనుగాక, మఱియొకరికి నుండఁగలదా?

ఆయరణ్యవాసంబున నర్జునునకు పాశుపతాది దివ్యాస్త్రలాభంబును, ఇంద్రునికి దుర్జయులగు నివాతకవచాదుల వధించి కిరీటము శంఖము మొదలగువానిని దేవతలనుండి వడయుటయు, ఆ జయమువలన నపరిమితప్రసిద్ధి గలుగుటయు సంభవించె. మఱియు నరణ్యవాసాంతంబున యముండు ధర్మతనయుని ధర్మగుణము పరీక్షించుటకై లేడియై యొక్క బ్రాహ్మణుని యరణులు హరించి సరస్సుతీరంబునకుం జనియె. దాని నెఱింగి బ్రాహ్మణున కుపకారము చేయుటకై యాలేడిని బహు దూరము తఱిమిరి గాని తుదకు నదృశ్యమగుటచే వీరల శ్రమ వృథయయ్యె. అంత వీరలకు దాహ మతిశయ మగుటయు

మంచి నీళ్లు దెచ్చుటకై యా యముఁడు చేరియున్న సరస్సు నొద్దకు సహదేవాదులు క్రమముగాఁ జని దాహంబు పెంపున యమునిమాట నాదరింపక యచటి నీరు ద్రావి, మృతప్రాయులై పడిరి. ధర్మతనయుండు వారిచెంతకుఁజని స్వయముగా శాంతిగలవాఁడు కావున యక్షరూపమున సదృశ్యుఁడై యున్న యమునిమాట నాదరించి వానిప్రశ్నల కుత్తరమిచ్చి తుదకు "నీ యీనలువురితమ్ములలో నెవ్వనిబ్రతికింతు" ననిన సహదేవుని బ్రతికింపుమని వేఁడె. బలమున నధికులగు భీమార్జునులున్నను సవతి తల్లియందలి యభిమానమునే నామెపుత్రులలో నొక్కని నే బ్రతికింపుమని వేఁడునంత సుగుణ మింక నెవ్వానికిఁ గలుగును? అంత యముని యనుగ్రహమున తమ్ములెల్ల సజీవులై తోడ నడచుచుండ, నయ్యమునివద్దనున్న యరణులఁ దెచ్చి బ్రాహ్మణున కొసంగి తమ యాశ్రమమున కేఁగిరి.

ఇట్లు అరణ్యవాసమును ముగించి యజ్ఞాతవాసమునకై విరాటరాజ్యము సుఖకరమని తలంచి ధర్మరాజాదులు క్రమముగ సన్యాసి, వంటలవాఁడు, నపుంసకుఁడు, అశ్వశిక్షకుఁడు, గోపాలకుఁడు ననెడియీవేషములుదాల్చి కంక, వలల, బృహన్నల, తంత్రీపాల, దామగ్రంథు లనుపేళ్లఁ బెట్టుకొని కొలుచుచుండిరి. ద్రౌపదియు మాలిని యనుపేర సుధేష్ణను సేవించుచుండె. ఇట్టియెడ సుధేష్ణ తమ్ముఁడు, కీచకుఁ డనువాఁడు ద్రౌపదినిమోహించి యర్ధరాత్రమున ద్రౌపదీ వేషధారియగు భీమునిచే హతుండయ్యె. వానికి తోడైన యుపకీచకులు నూర్వురును అట్లే హతులైరి. దుర్యోధనుఁడు పాండవుల వెదకుటకై పంపిన జట్టి యొకఁడు విరాటపురంబున భీమునిచే పోరి హతుఁడయ్యె. ఇట్లు కీచక

మల్లుల సంహారమునువిని పాండవులు విరాటపురంబున నున్నవా రని తెలిసికొని దుర్యోధనాదులు తమ సైన్యమును రెండుభాగములుగా విభజించి విరటునిపురంబునకు దక్షిణోత్తరభాగములనుండు గోవులను నొక్కమాఱుగా నాక్రమించిరి. అందు దక్షిణపువైపునకు రాజుతోఁగూడ బృహన్నలతప్ప తక్కిన నలువురు పాండవులు నేఁగి జయమునొందిరి. ఉత్తరపు వైపునకు విరటుని పుత్రుఁ డుత్తరుఁడను వానిని వెంటఁబెట్టుకొని బృహన్నల రణమున కేఁగి జయమునొందె. అప్పటికే వీరల పదుమూఁడు సంవత్సరములును ముగిసియున్నందున దుర్యోధనాదుల ప్రయత్నము వృథయయ్యె. అజ్ఞాతవాస సంవత్సరములోన వీరిని గుర్తించి రేని మరల పండ్రెండేండ్లు అరణ్యవాసమును నొకయేఁ డజ్ఞాతవాసమును జరుపవలసినట్లు మొదటి ప్రతిజ్ఞలో నియమమైయుండె.

వీరల కొకటి రెండు సహాయములు దొరికినవి. విరటుని పుత్రి యగు నుత్తరను నభిమన్యునికి వివాహముచేసికొనిరి. ఇట్లు ఒకవైపు ద్రుపదుఁడును, మఱియొకవైపు విరటుఁడును సంబంధులై పాండవుల క్షేమమే తమక్షేమముగ చూచుకొనుచున్నను మిత్రులగు క్షత్రియులందఱును, తమ యరణ్యవాసము నప్పటినుండియే దుర్యోధనాదుల యధర్మమునకు రోసి వారిపై కారములు మిరియములు నూఱుచుండినను, ధర్మరాజు మొట్టమొదటనే యుద్ధమునకు గడంగక రాజ్యమాత్రమునకై యొక కులమువారు తమలో తాము పోరుట మేలుకాదని పెక్కువిధముల దుర్యోధనునితో సంధికై ప్రయత్నించెనుగాని యదియంతయు నిరర్థకంబయ్యె. ఇంతయేల! సర్వజనులకును పూజ్యుఁడగు శ్రీకృష్ణుండే

వారలయొద్ద కేఁగినను, వారాయనమాట నంగీకరింపక పోవుటయే కాక "ఈకృష్ణుఁడొక్కఁడేకదా యిచ్చటికివచ్చెను. ఈతని బంధించిన పాండవు లసహాయులై మనచే సుఖముగ జయింపఁబడుదురు" అని తలంచిరి ఆశ యెన్ని యకార్యములకు త్రోవ చూపును? మొట్టమొదటనుండియు తమ బలాబలముల నెఱింగిన ద్రోణుఁడును, మునుమున్న సర్వవిషయముల నెఱింగి చెప్పుచున్న విదురుఁడును, ధర్మమూర్తియై రాజ్యము నింతవఱకు నభివృద్ధికిఁ దెచ్చిన భీష్ముఁడును, మఱియు ననేక బంధువులును, మునులును నెంత వివరించినను దుర్యోధనుఁడు, తన శక్తి తానెఱుంగలేడయ్యె. దీనిచేతనేకదా సుయోధనుఁడయ్యు, దుర్యోధనుఁడయ్యె.

పిదప రెండుదెసలను యుద్ధప్రయత్నము లారంభమునొందెను. భీష్మద్రోణులు ధర్మపక్షపాతులైనను ధర్మాత్ములగు పాండవుల దెసకు వచ్చుటకు వీలుకాదయ్యె. అర్ధరాజ్యము విభజించుకొనినదిమొదలు వీరు దుర్యోధనుని యొద్దనే నిలిచియుండిరి. వీరి బలమును చూచుకొనియె దుర్యోధనుఁడు పాండవులపై ద్వేషము బలపఱచుకొనియె. భీష్ముఁడు రాజ్యమును మొట్టమొదటనే పరిత్యజించుటచే నాతఁడును, ద్రోణునివలెనే రాజాశ్రితుఁడయ్యెను గాని రాజ్యాధికారి కాలేదు. కావున నీ రాజ్య విభాగవిషయములో నాయన కధికారము లేకయుండెను. సామాన్యధర్మమునుబట్టి చూచిన రాజాశ్రితులు రాజున కుపదేశింపవలసినవారేకాని రాజును శిక్షింపవలసినవారు కారు. మఱియు నాతని కాపత్తు గలిగెనేని, దానినుండి తమ శక్తికొలఁది నాతని తప్పింప ప్రయత్నింపవలయునేకాని తమ మాట వినలేదని

యు, నాతఁ డధర్మముచేసి స్వయముగానే యీయాపదను తెచ్చుకొనెననియు, నాతని సాధింపరాదు. అందును భీష్ముఁడు, వాత్సల్యము గలవాఁడు గావున రెండువైపులను, ప్రియములను కోరువాఁడగుటచే, వీరిని విడుచుటకుఁగాని విడువకుండుటకుఁగాని మనసు రాక యెట్టకేలకు సామాన్య ధర్మము నవలంబింపవలసినవాఁడయ్యె. ద్రోణుని కిట్టి నిర్బంధము లేకపోయినను తన్ను నమ్మియే, దుర్యోధనుఁడు యుద్ధమునకు ప్రయత్నించుటచేతను, ముఖ్యముగా తనకు విరోధియై తన్ను జంపుటకుఁగా కుమారునిఁ గోరి యజ్ఞమును సహితము చేసిన ద్రుపదరాజు పాండవులవైపున ముఖ్యుఁడై యుండుటచేతను, వీరి పక్షము నవలంబించె. ఇంత యేల? వీరలకు సహాయముగా వచ్చిన రాజులందఱును తమ యపజయంబుల దృఢముగా నెఱింగియుఁ బాండవుల కెదురై నిలుచుటకు కారణములు ఏమియన, కృష్ణుఁడు మొదలగువారితోఁ గల పూర్వ వైరములే. కామక్రోధాదులు చేరక శుభ్రముగా నుండిననే కదా మనస్సు స్వతంత్రముగా ప్రవర్తింపఁ గలుగుట. పాండవులకు స్వయముగా మేనమామయయ్యు, ద్రుపదాదులకంటె మిక్కిలి సంబంధము గలిగియు, శల్యుఁ డించుక మిషపెట్టి కృష్ణునితోఁగల పూర్వ వైరంబున దుర్యోధనుని వైపునఁ జేరె. ఆ వైరము కూడ నంత యతిశయ మైనదికాదు. తమ సంబంధురాలగు కన్నియను కృష్ణుఁడు స్వయంవరములో తెచ్చెనఁట; రాజసుల వైర మెంత ఘోరము!

ఇట్లు యుద్ధమారంభించిన మొదటి పదిదినములయందు వృద్ధుఁడయ్యు భీష్ముఁడు కుమారునికంటె నధికముగ పోరి, శిఖండి సహాయమున నర్జునుని బాణములచే పడియె. శంతనుని వివాహము

చేసిన యప్పుడు నాతఁ డిచ్చినవరముచే భీష్మునికి తన మరణము స్వాధీనమయియున్నందున ద్రోణ కర్ణ శల్యాదుల వధలు ముగిసి పాండవులకు సంపూర్ణముగ జయమై పట్టాభిషేక మగునంత కాలమువఱకును, జీవించుటయే కాక ధర్మరాజు పట్టాభిషేకానంతర మాతనికి, సకల ధర్మముల నుపదేశించి యుత్తరాయణ పుణ్యకాలము వచ్చునంతవఱకును, ప్రాణముల ధరించియే యుండెను. తా నష్టవసువులలోనివాఁడే కావున నయ్యష్టవసువులలోఁ జేరి దివంబున కరిగె.

చదువరులారా! భీష్ముని చరిత మింతటితో ముగిసెను. ధైర్య మనఁగా మనస్సు చలింపకుండుట; ఇట్టి ధైర్యము గలిగిననేకాని మనుష్యుఁ డేలోకమునందును సౌఖ్యము నొందనేరఁడు. మనుష్యులు చేయుప్రయత్నములకు నెన్నియో విఘ్నములు గలుగుచుండును గదా? వానినెల్ల సహించుటకు నీ ధైర్యమున కంటె వేరొండు సాధనమెద్ది? కామక్రోధాదులు మనస్సు బాధించుటయె కాని సుఖమును గలుగఁజేయనేరవని యెల్లరు నెఱింగినదియె. వారి బాధను మాన్పుకొనుటకు నీధైర్యమున కంటె వేఱొండు సాధనము లేదు. ఒక్కదాని కననేల? లోకమున ప్రవర్తించు సకలవిషయములకును, ధైర్యమే యాధారము. శ్లో॥ ఉత్సాహస్సాహసంధైర్యం । బుద్ధిశ్శక్తిః పరాక్రమః । షడేతే యత్ర వర్తంతే । తత్రదేవ స్సహాయకృత్ ॥ తా నవలంబించిన కార్యమును కడవఱకు నవలంబింపవలెనను పూనిక తన ప్రయత్నములో గల సుఖదుఃఖముల నిర్ణయించునప్పుడు తనకుఁ గలుగు సందేహములను తొలఁగించుకొని కార్యమున ప్రవేశించునట్టి చొరవ. ఆ ప్రయత్నమునందు కలుగు విఘ్నముల

వలన దుఃఖము నొందక తాను పట్టినపట్టుదలయుండె మనస్సును
నిలుపునట్టి ధైర్యము వెనుక ముందునకు హానిలేకుండ తన
కార్యము సిద్ధినొందునట్లు ఆలోచింపఁగల బుద్ధి తన మిత్ర శత్రు
వులను, వారు వారుండవలసిన రీతులలో నుంచుకొనఁగలిగిన
శక్తి, వాఁడంత యతిశయముగా నున్నాఁడుగదా ? మనమేల
యట్లుండరాదు అనునట్టి పరాక్రమమును, ఈ యాఱుగుణములు
నేపురుషునియందుఁ గలవో వానికి దైవము యథార్థముగా సహా
యముచేయును, అను శ్లోకములో చెప్పఁబడిన యాఱు గుణ
రత్నములలో ధైర్యమనునది నన్నిటికి ఆధారము. ఈ ధైర్య
కవచమువంటిది, ఇతర కవచముల ధరించినవారలకు శత్రువుల
వలన బాధ యొకప్పుడైనను సంభవించునుగాని, యీ కవచ
మును, ధరించినవారికి అట్టి దుఃఖ మెప్పటికిని సంభవింనేరదు.
అవు నీ కామక్రోధాదులే కదా బయటనుండువారి నందఱ
శత్రువులను జేయుచుండును. అట్టి యంతః శత్రువులనే ఈ ధై
ర్యకవచ మున్నాలింప వారికి శత్రువు లెవరుందురు?

ఇది పదియాఱవ ప్రకరణము.

ధైర్యకవచము సమాప్తము.

PRINT ED BY R. VENKATESHWAR & CO., AT THE ANANDA PRESS, MADRAS.